


# అరణ్యపురాణం

సీయోనీ కొండలలో ఒక గుహ. అందులో ఒక తోడేలయ్య సకుటుంబంగా కాపరం ఉంటున్నాడు. అతడికి భార్యా, నలుగురు పసికందులూనూ.

సాయంకాలం ఏడయింది. చంద్రుడు గుహలోకి తొంగి చూస్తున్నాడు. తోడేలయ్య కాళ్ళు చాచి, ఒళ్ళు విరుచుకుని, నిద్ర లేచాడు. వేటకు వేళ అయింది. తోడేలయ్య కొండ దిగిపోదామనుకుంటుండగా గుహ ద్వారాన నీడ కనపడింది. "శుభం కలగ వలె, తోడేలుదొరా! పిల్లలకు గట్టి దంతాలు రావలె! ధర్మం వర్థిల్లవలె!" అన్నది నక్క అతి వినయంగా.

నక్క తబకీ అంటే తోడేళ్ళకు తగని రోత. అది అన్నిచోట్లా చెడతిరిగి, చాడీకోరు కబుర్లు చెబుతుంది. ఎంగిలి నాకుతుంది. ఏ చెత్తపోగు మీది తోలుముక్కలైనా కొరుకుతుంది. గుడ్డపీలికలను కూడా విడిచిపెట్టదు. అయితే నక్క అంటే తోడేళ్ళకు కొంత భయం కూడా లేకపోలేదు. ఎందుకంటే, ఉన్నట్టుండి దానికి పిచ్చెత్తుతుంది. పిచ్చి నక్క అంటే పులికికూడా హడలే. పిచ్చినక్క కాటు వల్ల సంభవించే మరణం మహా దారుణమైనది.

"లోపలికి వచ్చి చూసుకో కావలిస్తే. తిండి ఏమీలేదు," అన్నది తోడేలు నక్కతో.

"తమకు లేకపోవచ్చు. నాబోటివాడికెంత కావాలి? ఎండు ఎముకైనా చాలు," అంటూ నక్క గుహమూల పడి ఉన్న ఒక ఎముక మీది మాంసం గీరుకు తింటూ, "ఆహా, ఎంత చక్కని భోజనం! ఎంత, చక్కని పిల్లలు! చెంపకు చారడేసి కళ్ళు!... అన్నట్టు షేర్‌ఖాన్‌గారు—అంటే పెద్దాయన—మన ప్రాంతాలకి వేటాడ వచ్చారు. ఈ నెలల్లా ఇక్కడే వేటాడుతూ ఉండిపోతామని నాతో అన్నారు!" అన్నది.

అట్ట చివరి బొమ్మ



షేర్‌ఖాన్ అనేది ఒక పులి, అది ఇరవై మైళ్ళ దూరాన వాయిన్‌గంగా నదీతీరాన నివాసం ఉంటుంది.

"అది చట్టవిరుద్ధం! షేర్‌ఖాన్ ముందు చెప్పకుండా చెందకుండా తన వేటస్థలాన్ని మార్చటం అరణ్యచట్టానికి విరుద్ధం. పది మైళ్ళమేరలోగల మృగాలన్నీ బెదిరి పోతాయి. నా సంగతి చూడబోతే, మా ఆవిడ వేట కూడా ప్రస్తుతం నేనే ఆడాలాయె!" అన్నది తోడేలు.

"వాణ్ణి వాళ్ళమ్మ మొదటి నుంచీ సొట్ట డనే పిలిచేది. పుట్టినప్పుడే కుంటికుంక. అందుకే పశువుల్ని తప్ప వేటాడిచావలేడు. వాయిన్‌గంగ ప్రాంతంలో వాళ్ళని రెచ్చ గొట్టాడు. ఇప్పుడిక్కడా అదే చెయ్యటానికి దాపరించాడు. వాడి కోసం దుబ్బు అంటి స్తారే, అప్పుడుంటాయి మనపాట్లు," అన్నది తోడేలమ్మ తాపీగా.

ఇంతలో కొండ కింది లోయలో నుంచి షేర్‌ఖాన్ కంఠం వినిపించింది. నక్క చల్లగా జారుకున్నది.

"చచ్చువెధవ! ఊరపొద్దూక్కముందే ఆ రంకె లేమిటి? ఇక్కడి వేటమృగాలు లేళ్ళు, వాయిన్‌గంగ దున్నలనుకుం టున్నాడో ఏమో!" అన్నాడు తోడేలయ్య.

"వాడు వేటాడుతున్నది లేడీ కాదు, దున్నా కాదు—మనిషి," అన్నది తోడేలమ్మ.

"ఛీ, ఛీ! మనిషిని వేటాడే బదులు కప్పల్నీ, చేపల్నీ తిని కడుపు నింపుకో రాదూ?" అన్నాడు తోడేలయ్య నిరసనగా.

ఎంతమాత్రమూ దాటరాని అరణ్యపు కట్టుబాట్లలో ఒకటి ఏమిటంటే వీరమృగాలు మనిషిని వేటాడరాదన్నది. దీనికి బలమైన కారణం లేకపోలేదు. అవి మనిషిని వేటాడ నారంభించినట్టయితే మనుషులు ఏనుగు లెక్కి తుపాకులు తీసుకుని, కాగడాలూ, అవ్వాయచువ్వాలూ, తప్పెట్లూ వేసుకుని వచ్చి పడతారు. అది అరణ్యాని కంతకీ

ఉపద్రవం. అయితే మృగాలు తమలో తాము చెప్పుకునే కారణం వేరే ఉన్నది. అన్ని జంతువులలోకీ మనిషి దుర్బలుడూ, అసహాయుడూనూ. అతడి జోలికి పోవటం శూరలక్షణం కాదు; పైపెచ్చు మనిషిని తినే జంతువులకు ఒళ్ళు వాస్తుంది, దంతా లూడిపోతాయి.

పులి అరుపు బొబ్బగా పరిణమించింది. అది దూకింది, కాని మరుక్షణమే రోదన ధ్వని చేసింది పులి.

"అందలేదు. ఏమిటో అది?" అన్నది తోడేలమ్మ.

తోడేలయ్య బయటికి తొంగి చూశాడు. షేర్‌ఖాన్ పొదల మధ్యగా పడుతూ లేస్తూ, ఏదో గొణుగుతున్నాడు.

"వెధవ, కలప కోసేవాళ్ళ నెగడు లోకి దూకి కాళ్ళు కాల్చుకున్నాడు. తబకీ వెంటే ఉన్నాడు," అన్నాడు తోడేలయ్య.

తోడేలమ్మ చెవి రిక్కించి కొద్దిసేపు విని, "ఎవరో కొండ ఎక్కి వస్తున్నారు జాగ్రత్త!" అన్నది మెల్లిగా.

పొదల్లో అలికిడి అయింది. తోడేలయ్య లఘించటానికి సిద్ధంగా కూర్చున్నాడు. సరిగా తరుణం చూసి లంఘించబోయి అంతలో ఏదో చూసి తనను తాను నిగ్రహించుకోవ



టంలో, గాలిలోకి నాలుగైదు అడుగుల ఎత్తు లేచి, మళ్ళీ అక్కడే పడ్డాడు.

"మనిషి! మనిషిపిల్ల! చూడు," అన్నాడు తోడేలయ్య.

అతని కెదురుగా ఒక పిల్లవాడు, కొద్ది ఎత్తులో ఉన్న మండ ఒకటి పట్టుకుని నిలబడి ఉన్నాడు. వాడి కిప్పుడిప్పుడే నడక వస్తున్నది. వాడు తోడేలయ్య ముఖంలోకి చూసి నవ్వాడు. వాడి ఒళ్ళు మెత్తగా, సొట్ట లతో నవనవలాడుతున్నది.

"అదా మనిషి పిల్లంటే? ఎన్నడూ చూడలేదుస్మీ. ఏదీ, ఇలా పట్రా," అన్నది తోడేలమ్మ.

తోడేలయ్య ఆ పిల్లవాడి వీపును తన దవడలమధ్య బలంగాపట్టి తీసుకొచ్చి తన పిల్లలమధ్య పెట్టాడు. పిల్లవాడి శరీరానికి ఇంత చిన్న గాటు కూడా లేదు.

"ఎంత చిన్న ఒళ్ళు! ఎంత నున్నని వాడు! ఎంత ధైర్యం!" అన్నది తోడేలమ్మ మృదువుగా. పిల్లవాడు తోడేలు పిల్లల మధ్య వెచ్చగా చోటుచేసుకుని, వాటి ఆహారమే తానుకూడా తినసాగాడు. అదిచూసి తోడేలమ్మ తెగముచ్చటపడింది.

"ఎప్పుడైనా తోడేళ్ళు తమ పిల్లలతో బాటు మనిషి పిల్లని పెంచటం కద్దా?" అన్నదావిడ.

"ఎప్పుడో జరిగినట్టు వినటమేగాని, మన మందలో, మనకాలంలో ఎరగం. వాణ్ణిచూడు, ఒంటిన ఒక్క వెంట్రుకలేదు, నేను కాలుతో ఇలా అన్నానంటే చస్తాడు, కాని వాడికి భయంలేదు,'" అన్నాడు తోడేలయ్య.

గుహద్వారాన వెన్నెల కాస్తా పోయింది. ఆ ద్వారంలో షేర్‌ఖాన్ తలా, భుజాలూ ప్రత్యక్షమయాయి. "దొరా, దొరా! అది ఈ లోపలికే వెళ్ళింది," అని తబకీ కీచు గొంతు వినిపించింది.

"మనిషికూన! నా వేటను నా కిచ్చెయ్యండి. దాని తల్లీ తండ్రీ తప్పించుకు పోయారు," అన్నాడు షేర్‌ఖాన్. అతను నెగడులోకి దూకి కాళ్ళు కాల్చుకున్నమాట నిజమే. ఆ బాధమూలాన చాలా కోపంలో ఉన్నాడు. అయితే అతను ఆ ద్వారంలో నుంచి దూరి గుహలోకి రాలేడని తోడేలయ్య ఎరుగును. ఇప్పటికే ద్వారంలో అతని తలా భుజాలూ నొక్కుకుంటూ ఉండి ఉండాలి.

"తోడేళ్ళు స్వతంత్రులు. వారిని ఆజ్ఞాపించగలవాడు మందనాయకుడు మాత్రమే. ప్రతి చారలమెకమూ చెప్పినట్టు వాళ్ళు నడుచుకోరు. మనిషికూన మాది!" అన్నాడు తోడేలయ్య. —(ఇంకా వుంది)





# అరణ్యపురాణం

## 2

షేర్‌ఖాన్ రంకె వేసి, "నా సొత్తు కోసం నేనీ కుక్క బొక్క దగ్గిర నిలబడాలా? షేర్‌ఖాన్ అంటే ఎవరో తెలుసా?" అన్నాడు.

తోడేలమ్మ ముందుకు వచ్చి, "రాక్షసి అనే బిరుదుగల నే నెవరో నీకు తెలుసా? మనిషికూన నాదిరా, సొట్టడా—నా సొంతం. వాడు చావటానికి వీల్లేదు. వాడు మందతో పరిగెత్తాలి, మందతో కలిసి వేటాడాలి. ఓరీ, కూనల్ని తినేవాడా, కప్పల్ని తినేవాడా, చేపల వేటగాడా! చివరకి వాడు నిన్నే వేటాడాలి. పోరా, కుంటుకుంటూ మీ అమ్మ దగ్గిరికి పో! ఫో!" అన్నది.

తోడేలయ్య నిర్ఘాంతపోయాడు. తనకు భార్య కాకమునుపే ఆమెకు మందలో రాక్షసి అనే బిరుదుండినమాట నిజం.

తోడేలయ్యకు తట్టుకోవచ్చునేమోగాని తోడేలమ్మకు తట్టుకునే శక్తి తనకు లేదనీ, స్థానబలిమి ఆమె కున్నదనీ గ్రహించి షేర్‌ఖాన్ గుర్రుమంటూ తల వెనక్కు పీక్కుని, గుహ వెలపలి నుంచి, "దొడ్డి కుక్క దొడ్లో మొరగటానికేం? ఈ మనిషికూన పెంపకం గురించి మంద ఏమంటుందో నేనూ చూస్తాను. ఆ కూన నాది, ఎప్పటికైనా నా నోటికి అంది తీరుతుందర్రా, జల్లితోక ముచ్చుల్లారా!" అని అరిచాడు.

"షేర్‌ఖాన్ అన్నది ఒకటి నిజం. ఈ కూనను మందకు చూపాలి. దాన్ని ఉంచుకుంటా నంటావా?" అన్నాడు తోడేలయ్య.

"ఉంచుకుంటానా! రాత్రి వేళ, నగ్నంగా, ఆకలితో వచ్చాడు; కాస్తయినా జంకలేదు! ఆ కుంటి కసాయి వీణ్ణి చంపి వాయిన్‌గంగకు పారిపోయి ఉండేవాడు. గ్రామస్తులంతా వాడి కోసం వెతుకుతూ మన

అట్ట చివరి బొమ్మ

ఇళ్ళన్నీ గాలించి పగ తీర్చుకునేవాళ్ళు. ఉంచుకోనా? తప్పక ఉంచుకుంటాను. కదలకురా, బుల్లి కప్పాయ్! ఏడికి మౌగ్లీ కప్పాయ్ అని పేరు పెట్టుకుంటాను. ఒరే మౌగ్లీ, నువు పెద్దయి నిన్నా షేర్‌ఖాన్ వేటాడినట్టు వాణ్ణి నువు వేటాడరా!" అన్నది తోడేలమ్మ.

"సరేలే, మన మంద ఏమంటుందో?" అన్నాడు తోడేలయ్య.

అరణ్య నియమాలప్రకారం పెళ్ళి చేసుకున్న తోడేలు తన మందను విడిచి వెళ్ళి వేరే కాపరం పెట్టవచ్చు, కాని అతని పిల్లలు కాళ్ళమీద లేచి నిలబడగలిగినప్పుడు, అతను వాళ్ళని మంద సదస్సుకు తేవాలి. ఆ సదస్సు నెల నెలా పౌర్ణమినాడు జరుగుతుంది. అప్పుడు ఇతర తోడేళ్ళు వాళ్ళను పరిచయం చేసుకుంటాయి. ఆ లాంఛనం తీరాక పిల్లలు స్వేచ్ఛగా తిరగవచ్చు. మందకు చెందిన పెద్ద తోడే లేదైనా ఆ పిల్లలను చంపటం జరిగితే హంతకుడు దొరికిన పక్షంలో మరణశిక్షే.

తన బిడ్డలు అటూ ఇటూ పరిగెత్తే దశ రాగానే తోడేలయ్య వాళ్ళనూ, మౌగ్లీనీ, తన భార్యనూ తీసుకుని, సదస్సునాటి రాత్రి సదస్సు కొండకు వెళ్ళాడు. దాని శిఖరం మీద అసంఖ్యాకమైన రాళ్ళూ, బండలూ



ఉన్నాయి; వాటి మధ్య వందల కొద్దీ తోడేళ్ళు దాక్కోవచ్చు.

ఈ తోడేళ్ళమందకు నాయకుడు అకేలా అనే ఒంటరి తోడేలు బలంలోనూ, యుక్తిలోనూ మేటి. అతను శిఖరం మీద అడ్డంగా పడుకున్నాడు. కొంచెం దిగువగా నలభైకి పైగా తోడేళ్ళు, అన్ని సైజుల వాళ్ళూ, రంగుల వాళ్ళూ కూర్చున్నారు. వారిలో లేడిని ఒంటరిగా పట్టగల సమర్థులూ, పట్టగల మనుకునే మూడేళ్ళ ముగ్ధులూ కూడా ఉన్నారు. అకేలా ఒక ఏడాదిగా ఈ మందకు నాయకత్వం వహిస్తున్నాడు. అతను యౌవనంలో రెండు సార్లు తోడేలు బోనుల్లో చిక్కాడు, మరొకసారి చావుదెబ్బలు తిని, చచ్చి బతికాడు. అతనికి మనుషుల ఆచార వ్యవహారాలు క్షుణ్ణంగా తెలుసు.

సదస్సులో పెద్దగా ప్రసంగా లేవీ జరగవు. తల్లిదండ్రులు వలయంలో కూర్చుని ఉంటే, మధ్యలో పిల్లలు పిల్లిమొగ్గలు వేస్తూ ఆడుకుంటారు. ఉన్నట్టుండి ఒక తోడేలువృద్ధుడు చప్పుడు కాకుండా వెళ్ళి ఒక పిల్లని పరీక్షగా చూసి, తిరిగి యథాస్థానంలో వచ్చి కూర్చుంటాడు. ఒక్కొక్కసారి ఒక తల్లి తన బిడ్డను నలుగురూ బాగా గమనించ గలందుకు బాగా వెన్నెల పడే చోటికి తోస్తుంది. శిఖరం మీది నుంచి



అకేలా, "తోడేళ్ళలారా, బాగా చూడండి. మీకు చట్టం తెలుసుగద!" అంటాడు. తల్లులు కూడా ఆదుర్దాగా ఆ మాటలే తాము కూడా అంటారు.

చిట్టచివరకు మౌగ్లీకప్పాయిని పరిచయం చేసే సమయం వచ్చింది. తోడేలమ్మ మెడ మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి. తోడేలయ్య కప్పాయిని మధ్యలోకి తోశాడు. కప్పాయి అక్కడ కూర్చుని నవ్వుతూ, వెన్నెలలో మెరిసే గులకరాళ్ళతో ఆడుకోసాగాడు.

అకేలా తన పాదాల మీద ఆనించిన తల ఎత్తకుండానే, "బాగా చూడండి! బాగా చూడండి!" అన్నాడు.

గుట్టల వెనకాల నుంచి గాండ్రింపు అస్పష్టంగా వినిపించింది. తరవాత షేర్‌ఖాన్ గొంతు ఇలా అన్నది: "ఆ కూన నాది. దాన్ని నాకివ్వండి. స్వతంత్ర ప్రజలకు మనిషికూనతో ఏం పని?"

అకేలా తన చెవులను కూడా కదపలేదు. అతనన్నాడు: "తోడేళ్ళలారా, బాగా చూడండి! స్వతంత్ర ప్రజలకు, స్వతంత్ర ప్రజల ఉత్తరువులతోనే గాని, పైవాళ్ళ ఉత్తరువులతో పనేమిటి?"

అనేక కంఠాలు ఒక్క సారిగా గాండ్రించాయి. ఒక నాలుగేళ్ళవాడు, షేర్‌ఖాన్ ప్రశ్ననే అకేలాకు వేస్తూ, "స్వతంత్ర ప్రజలకు మనిషికూనతో ఏం పని?" అని అడిగాడు.

అరణ్యంలో మరొక నియమమున్నది. ఒక కూనను మంద ఆమోదించటం గురించి అభిప్రాయభేదం కలిగినప్పుడు, మందకు సంబంధించిన వారు ఇద్దరు శిఫార్సు చెయ్యాలి; అలా శిఫార్సు చేసే వారు కూన యొక్క తల్లిదండ్రులై ఉండరాదు.

"ఈ కూనను ఎవరు శిఫార్సు చేస్తారు?" అని అకేలా అడిగాడు. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 3

అకేలా ప్రశ్నకు ఎవరూ జవాబు చెప్పలేదు. తోడేలమ్మ లడాయి తప్పదనుకుని అందుకు సిద్ధమయింది. అంతలో ఎలుగుబంటు భాలూ, లేచి నిలబడి గొంతు సవరించుకున్నాడు. తోడేలు పిల్లలకు ఈ భాలూయే అరణ్య చట్టం ఉపదేశిస్తాడు. అతను తినేది కాయలూ, దుంపలూ, తేనె లాటి సాత్వికాహారమే గనక అతను సదస్సుకు యథేచ్ఛగా వస్తూ పోతూ ఉండవచ్చు.

"మనిషికూన! మనిషికూనను నేను శిఫార్సు చేస్తున్నాను. మనిషికూన వల్ల అపాయం ఏమీ లేదు. మందలోపడి తిరగనివ్వండి. నా శిష్యుడుగా ఉంటాడు," అన్నాడు భాలూ.

"భాలూ శిఫార్సు చేశాడు. అతను మన పిల్లలకు గురువు. మరెవరు ఎన్నిక చెయ్యబోతారు?" అని అడిగాడు అకేలా.

ఒక నల్లని నీడ వలయం మధ్యకు వచ్చింది. ఆ వచ్చినది బాఘీర అనే నల్ల చిరుతపులి. బాఘీరను అందరూ ఎరుగుదురు. అతని కెవరూ ఆగ్రహం తెప్పించరు. అతను జిత్తులకు తబకీకి తీసిపోడు, ధైర్యంలో అడవిఎనుమునూ, దుస్సాహసంలో గాయపడిన ఏనుగునూ పోలినవాడు. అతని మాట మహా మెత్తన, వంటి మీది రోమాలు పక్షినూగు కన్న కూడా మెత్తన.

"అకేలా, స్వతంత్ర ప్రజలారా! నాకు మీ సదస్సులో ఎలాటి స్థానమూ లేదు. కాని అరణ్య చట్ట ప్రకారం ఒక కూన గురించి సందేహం ఏర్పడినప్పుడా కూనను వెల ఇచ్చి కొనవచ్చును. కాని ఎవరు కొనవచ్చుననేది స్పష్టంగా చెప్పబడలేదు. నే నన్నది నిజమేనా?" అని బాఘీర అడిగాడు.

అట్ట చివరి బొమ్మ



"నిజమే. ఎవరైనా కూనను కొనవచ్చు," అని అనేకమంది యువకులు జవాబిచ్చారు.

"అసహాయంగా ఉన్న కూనను చంపటం అన్యాయం. అదీగాక పెరిగాక అతను మీ వేటకు మరింత బాగా ఉపకరించ వచ్చు. భాలూ ఈ బిడ్డను శిఫార్సు చేశాడు. నేను మీ కొక బలిసిన ఎద్దును ఇస్తాను. ఇక్కడికి అరమైలు లోపు దూరాన ఇంతకు ముందే చంపాను. అది తీసుకుని మీరీ మనిషి కూనను స్వీకరించండి. అది సాధ్యం కాదా?" అన్నాడు బాఘీర.

అందరూ తలా ఒకమాటా అన్నారు. ఇంతలో మునిగిం దేమిటి? కూనగాడు శీతాకాలపు వానలకు చావనే చస్తాడు. లేదా ఎండలకు ఎండుతాడు. కప్పాయి వల్ల వచ్చి పడే ప్రమాద మేమిటి? ఎద్దు ఎక్కడ? తీసుకుందాం.

"బాగా చూడండి తోడేళ్ళలారా, బాగా చూడండి!" అని అకేలా హెచ్చరింపు వినపడింది.

మౌగ్లీ గులకరాళ్ళతో ఆడుకోవటంలో నిమగ్నుడై, తోడేళ్ళు తన వద్దకు వచ్చి పరిశీలించటం గమనించనే లేదు. తోడేళ్ళన్నీ చచ్చిన ఎద్దు కోసం కొండ దిగి చక్కా పోయాయి. చివరకు అకేలా, బాఘీరా, భాలూ, మౌగ్లీ, వాడి తాలూకు తోడేళ్ళూ మాత్రమే మిగిలారు. షేర్‌ఖాన్ గాండ్రింపు వినపడుతూనే ఉంది. మౌగ్లీని తన కివ్వలేదని అతనికి చాలా కోపంగా ఉంది.

"అలాగే గాండ్రిస్తూ ఉండు. ఎప్పుడో ఈ కూన నీ చేత మరొక లాగా గాండ్రింప జెయ్యకపోడులే," అన్నాడు బాఘీర.

"మంచి నిర్ణయమే జరిగింది. మనుషులూ, వాళ్ళ కూనలూ జ్ఞానం గల వాళ్ళు. వీడి వల్ల కాలక్రమాన చాలా లాభం కలగ వచ్చు," అన్నాడు అకేలా.

"అవసరం కలిగినప్పుడు లాభం ఎంతైనా ఉంటుంది. ఏ ఒకరూ మందకు శాశ్వత

నాయకత్వం వహించలేరు గద," అన్నాడు బాఘీర. అకేలా మాట్లాడలేదు. ప్రతి మంద నాయకుడికీ ఒక సమయం వస్తుంది: అతని శక్తి ఉడిగిపోతుంది; అప్పుడతన్ని తోడేళ్ళు చంపేస్తారు; కొత్తనాయకుడు వస్తాడు—కాలక్రమాన వాణ్ణీ చంపేస్తారు. అలాటి సమయం గురించి అకేలా ఆలోచించి, "భాలూ, వాణ్ణి తీసుకుపోయి, స్వతంత్ర ప్రజలకు అర్హమైన శిక్షణ ఇయ్యి," అన్నాడు.

ఆ విధంగా మౌగ్లీ సీయోనీ తోడేళ్ళ మందలో ప్రవేశించాడు. అందుకు భాలూ చేసిన శిఫార్సూ, ఒక ఎద్దు లంచమూ సహాయ పడ్డాయి.

*   *   *   *

పది పన్నెండేళ్ళు గడిచాయి. మౌగ్లీ తోడేళ్ళతో ఆ కాలమంతా ఎలా గడిపాడో, ఏమేమి వింతలు జరిగాయో ఊహించవలసిందేగాని, వివరించటం సాధ్యం కాదు. వాడు తోడేలు కూనలతోబాటే పెరిగాడు. అయితే వాడి బాల్యం ఇంకా వదలక ముందే తోడేలు కూనలు పెరిగి పెద్దవాళ్ళయారు. వాడు తోడేలయ్య దగ్గిర సకల విద్యలూ అభ్యసించి, అరణ్యంలో ఏది ఏమిటో తెలుసుకున్నాడు. ఎక్కడ ఏ గడ్డి కదిలినా, రాత్రివేళ ఏ పిల్లగాలి వీచినా, పైన



ఏ గుడ్లగూబ అరిచినా, ఏ గబ్బిలం కాలి గోరు చెట్టును గీరినా, ఏ చేపపిల్ల మడుగులో ఎగిరినా, వాడికి దాని అంతరార్థం అవగత మయేది.

విద్యాభ్యాసం లేని ఆటవిడుపు సమయాలలో వాడు ఎండపొడలో కూర్చుని కునుకు తీసేవాడు. తిండి తినేవాడు, మళ్ళీ నిద్ర పోయేవాడు. ఒళ్ళు మురికిగా తోచినా, వేడెక్కినా అరణ్యం లోని మడుగుల్లో ఈదేవాడు. తేనె కావలిసివస్తే చెట్లెక్కేవాడు. వాడికి చెట్లెక్కటం బాఘీర నేర్పాడు. బాఘీర ఒక కొమ్మ మీద సాగి పడుకుని, "రా, తమ్ముడూ," అని పిలిచేవాడు. మౌగ్లీ

మొదట్లో కొమ్మలను పట్టుకుని ఎంతకూ విడిచిపెట్టేవాడు కాడు, కాని త్వరలోనే, కోతి లాగా ఒక కొమ్మ నుంచి మరొక కొమ్మకు ఊగటం నేర్చాడు.

కొండ మీద మంద సమావేశమైనప్పుడు మౌగ్లీ కూడా సమావేశాలలో పాల్గొనేవాడు. ఆ సమయంలో ఒక చిత్రం కనిపెట్టాడు: వాడు ఏ తోడేలు కేసి గాని తేరిపార చూస్తే, ఆ తోడేలు కళ్ళు వాలిపోయేవి. అందుచేత వాడు అల్లరికి తోడేళ్ళను తేరిపార జూసే వాడు. ఇతర సమయాలలో వాడు తన తోడేలు మిత్రుల పాదాలలో గుచ్చుకునే పాడుగైన ముళ్ళను తీసేసేవాడు. తోడేళ్ళకు ముళ్ళబాధ జాస్తి.

రాత్రివేళ మౌగ్లీ కొండ దిగి సేద్యపు భూములు ప్రవేశించి, అక్కడి గుడిసెలలో నివసించే మనుషులను వింతగా గమనించే వాడు. అయితే వాడికి మనుషు లంటే చాలా అనుమానం. ఒకనాడు బాఘీర వాడికి ఒక బోను చూపించాడు. అది అరణ్యంలో చాలా యుక్తిగా అమర్చి ఉండి, పెట్టెలాగున్నది; మౌగ్లీ అందులోకి వెళ్ళి నంత పని చేశాడు కూడా.

బాఘీర వెంట చీకటిగా ఉండే కీకారణ్యం మధ్యకు వెళ్ళి, పగలల్లా నిద్రపోయి, రాత్రివేళ బాఘీర వేటాడుతూంటే చూడటం వాడికి అన్నిటి కన్న ఆనందంగా ఉండేది. బాఘీర ఆకలిగా ఉన్నప్పుడు ఎడాపెడా మృగాలను చంపేవాడు. మౌగ్లీ కూడా అలాగే చంపేవాడు. అయితే వాడికి బాఘీర ఒక్క అంక్ష పెట్టాడు: "ఒక ఎద్దు ప్రాణానికి నిన్ను మంద కొన్నది. అందుచేత పశువును మాత్రం చంపకు. ఈ అరణ్యమంతా నీదే. నీ బలం చాలిన మేరకు మరే జంతువునైనా చంపు, కాని ఏ వయసులో ఉండే పశువునూ చంపకు, తినకు. అది అరణ్య శాసనం," అన్నాడు బాఘీర. మౌగ్లీ దాన్ని మీరలేదు. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 4

మౌగ్లీ చాలా బలాఢ్యుడుగా పెరిగాడు. ఎందుకు పెరగడూ? ఎప్పుడూ తిండి గురించి తప్ప మరి దేన్ని గురించీ ఆలోచించని ఏ పిల్లవాడైనా బలాఢ్యుడుగానే తయారవుతాడు.

"షేర్‌ఖానును మాత్రం నమ్మకు. ఏనాటికైనా వాడు నీ చేత చావాలి," అని తోడేలమ్మ మౌగ్లీకి ఒకటి రెండు సార్లు చెప్పింది. కాని మౌగ్లీ మనిషి కావటం చేత మరిచాడు. అదే తోడేలైతే మరవక పోను. కాని చిత్రమేమంటే తాను తోడేలు కానన్న భావం వాడికి లేదు.

తోడేళ్ళ నాయకుడు అకేలా వృద్ధుడవుతున్నకొద్దీ కుంటిపులి షేర్‌ఖాన్‌కు మంద లోని యువక తోడేళ్ళతో దోస్తీ బాగా జాస్తి అయింది. వాళ్ళు కబళాల కోసం పులి వెంట తిరగసాగారు. అకేలా ధైర్యంచేసి తన అధికారాన్ని పూర్తిగా అమలు చేసి నట్టయితే ఇలా జరిగిఉండకపోను. కుక్కల్లాగా తనను ఆశ్రయించి తిరిగే యువక తోడేళ్ళను మాటలతో ఉబ్బేసి, అంత చక్కని మందును ఒక ముసలితోడేలూ, ఒక మనిషి కూనా నడపటమేమి టనేవాడు, షేర్‌ఖాన్. "సమావేశాలప్పుడు మీలో ఎవరూ వాడి కళ్ళ కేసి చూడలేరని విన్నాను," అనే వాడు. యువక తోడేళ్ళు అవమానంతో గుర్రుపెట్టే వాళ్ళు.

బాఘీరకు అంతటా కళ్ళే, అంతటా చెవులే. అతనికి ఈ సంగతి తెలియ వచ్చింది. అతను మౌగ్లీతో, "షేర్‌ఖాన్ ఎప్పుడో నిన్ను చంపేస్తాడు," అని హెచ్చరించాడు. కాని మౌగ్లీ నవ్వి, "నాకు మంద ఉన్నది, నువు ఉన్నావు. భాలూ ఉన్నాడు- అయన మహాబద్ధకస్తుడే అయినా, నా కోసం

అట్ట చివరి బొమ్మ



చెయ్యిచేసుకోక పోడు. నే నెందుకు భయపడాలి?" అని అడిగాడు.

"షేర్‌ఖాన్ నీ శత్రువని ఎన్నిసార్లు చెప్పాను?" అన్నాడు బాఘీర.

"ఆ చెట్టు మీద ఎన్ని కొబ్బరికాయలున్నాయో అన్నిసార్లు చెప్పావు. చెబితే చెప్పావులే, బాఘీరా! నాకు నిద్రవస్తోంది. ఆ షేర్‌ఖాన్‌కు పెద్ద తోకా, పెద్ద గొంతూ తప్ప ఇంకేమీ లేదు," అన్నాడు మౌగ్లీ.

"నిద్ర కిదా సమయం? ఈ సంగతి భాలూకు తెలుసు, నాకు తెలుసు, మంద కంతకూ తెలుసు, తబకీ కూడా నీకు చెప్పాడు," అన్నాడు బాఘీర.

"అహహ్హా! ఆ తబకీగాడు ఈ మధ్య నా దగ్గిరికొచ్చి, నేను మనిషికూన ననీ, నాకు వేరుశనగకాయలు తవ్వటం కూడా చాతకాదనీ వదిరాడు. వాడికి కాస్త మర్యాద నేర్పుదా మని, జల్లితోక పట్టుకుని, కొబ్బరి చెట్టు కేసి రెండు ఉతుకులు ఉతికాను," అన్నాడు మౌగ్లీ.

"అదే పొరబాటు! తబకీ తంపులు పెట్టేవాడే అయినా, నీకు అవసరమైన విషయాలు కొన్ని చెప్పి ఉండేవాడు. కాస్త కళ్ళు తెరు తమ్ముడూ. షేర్‌ఖాన్‌కు నిన్ను అరణ్యంలో చంపటానికి దమ్ములేదు. కాని, మరిచిపోకు, అకేలా చాలా వృద్ధు. అతను లేడిని కొట్టలేని రోజు త్వరలోనే వస్తుంది. నిన్ను మొదటిసారి సమావేశానికి తెచ్చినప్పుడు చూసిన తోడేళ్ళందరూ ముసలివాళ్ళయారు. చిన్నకారు తోడేళ్ళకు షేర్‌ఖాన్ మాటలంటే గురి. మనిషికూనకు మందలో స్థానం లేదని వాడు వాళ్ళకు నూరిపోశాడు. త్వరలోనే నువు మనిషివి కాబోతున్నావు," అన్నాడు బాఘీర.

"మనిషి అయితే తన సహోదరులతో కలిసి పరిగెత్తరాదా? నేను అరణ్యంలో పుట్టాను. అరణ్యశాసనాలను శిరసావహించాను. నా చేత కాలిముళ్ళు పీకించుకోని

తోడేలు లేదు. అందరూ నా సోదరులేనే!" అన్నాడు మౌగ్లీ.

బాఘీర తన శరీరాన్ని నిగడ చాచి పడుకుని, కళ్ళు అరమోడ్చి, "తమ్ముడూ, నా దవడ కింద తడివి చూడు," అన్నాడు.

మౌగ్లీ తడివి చూసి ఒకచోట బొచ్చులేని మేర ఉండటం గ్రహించాడు.

"నా వంటిన ఆ మెడపట్టీ గుర్తున్న సంగతి అరణ్యంలో ఒక్క పురుగుకైనా తెలియదు. తమ్ముడూ, నేను మనుషుల మధ్య పుట్టాను. మా అమ్మ మనుషుల మధ్య—ఉదయపూరు రాజభవనంలో ఉండే బోనులో—ప్రాణాలు వదిలింది. అందుకే నువు పసికూనగా ఉన్నప్పుడు నీకు వెల ఇచ్చి కొన్నాను. నేను మనుషుల మధ్యనే పుట్టాను. నాకు అరణ్యం తెలీదు. నన్ను కటకటాలలో ఉంచి, ఇనప బొచ్చెలో తిండి అందించేవారు. ఒకనాటి రాత్రి నాకు బాఘీర ననే భావం బలంగా కలిగింది, నేను మనుషుల ఆటవస్తువును కాననిపించింది. ఒక్క పంజా వేటుతో వెధవతాళాన్ని విరగ్గొట్టి, వచ్చేశాను. నాకు మనుషుల పద్ధతులు తెలును కనకనే అరణ్యంలో షేర్‌ఖాన్ కన్న భయంకరుణ్ణిగా తిరగగలుగుతున్నాను," అన్నాడు బాఘీర.



"అవును. ఒక్క మౌగ్లీకి తప్పిస్తే అరణ్యంలో అందరికీ బాఘీర అంటే హడల్," అన్నాడు మౌగ్లీ.

నేను అరణ్యానికి తిరిగివచ్చినట్టే, నువు చివరకు మనుషుల మధ్యకు తిరిగి పోతావు—ఈలోపల సమావేశంలో నువు చావకుండా ఉంటే," అన్నాడు బాఘీర.

"దేనికి? ఎవరికిగాని నన్ను చంపాలని ఎందు కనిపించాలి?" అన్నాడు మౌగ్లీ.

"నాకేసి చూడు," అన్నాడు బాఘీర. మౌగ్లీ బాఘీర కళ్ళకేసి తేరి పారచూశాడు. నల్లచిరుత తల పక్కకు తిప్పేసుకుని, "అందుకే! మనుషుల మధ్య పెరిగిన నేనే

నీ కళ్ళలోకి చూడలేను. నువంటే నాకు అపేక్ష, తమ్ముడూ. కాని మిగిలినవాళ్ళకు ఈర్ష్య. ఎందుకంటే, వాళ్ళు నీ కళ్ళలోకి చూడలేరు, నువు తెలివిగలవాడివి, వాళ్ళ కాళ్ళలో గుచ్చుకున్న ముళ్ళు లాగిపెట్టావు. అన్నిటినీ మించి నువు మనిషివి," అన్నాడు. మౌగ్లీకి ఈ విషయాలేవీ తెలీవు.

"కొట్టి మరీ మాట్లాడటం అరణ్యపు ఆనవాయితీ. నీ నిర్లక్ష్యాన్నిబట్టే నువు మనిషివని వాటికి తెలుస్తుంది. నాకేమని పిస్తున్నదంటే, అకేలా ఈసారి జింకను పట్టలేకపోయిన తరవాత కొండ మీద సభ చేస్తారు—ఆ తరవాత—ఉండు, నాకు తట్టింది! నువు వెంటనే లోయలోకి దిగి పోయి, మనుషుల గుడిసెల నుంచి ఎర్ర పువ్వు పట్టుకురా!" అన్నాడు బాఘీర.

బాఘీర ఎర్రపువ్వు అన్నది నిప్పు. అరణ్యంలో ఉండే ఏ ప్రాణీ నిప్పును నిప్పు అని పిలవదు. ప్రతి ప్రాణికీ అదంటే హడలు, అందుచేత దాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. "చీకటిపడేటప్పుడు గుడిసెల బయట పూసే ఎర్ర పువ్వేనా? తీసు కొస్తాను," అన్నాడు మౌగ్లీ.

"మనిషికూన అనదగిన మాట అన్నావు! అది చిన్న పిడతలలో పెరుగుతుంది, జ్ఞాపకం ఉంచుకో. ఒక పిడతతెచ్చి దగ్గిర పెట్టు కున్నావంటే అవసరానికి పనికొస్తుంది," అన్నాడు బాఘీర.

మౌగ్లీ బాఘీర మెడచుట్టూ ప్రేమగా చెయ్యివేసి, ముఖంలోకి చూస్తూ, "ఇదంతా షేర్‌ఖాన్‌గాడి పనేనంటావా, బాఘీరా?" అని అడిగాడు.

"నేను పగలగొట్టిన తాళం తోడు!" అన్నాడు బాఘీర.

"అందుకు వడ్డీతో సహా షేర్‌ఖాన్‌గాడికి అప్పుజెప్పి తీరుతాను, నన్నుకొన్న ఎద్దు తోడు!" అంటూ మౌగ్లీ బయలుదేరాడు.

—(ఇంకా వుంది)





# అరణ్యపురాణం

## 5

మౌగ్లీ ఒకే పరుగున అరణ్యం దాటి, సాయంకాలసందె చీకట్లు కమ్ముకుంటూండగా గుహకు చేరుకుని, లోయలోకి చూశాడు. పిల్లతోడేళ్ళు వేట కోసం బయటికి వెళ్ళారు.

గుహలోపల ఎక్కడో పని చూసుకుంటున్న తోడేలమ్మ మౌగ్లీ ఊపిరి చప్పుడు విని, తన కప్పాయి నేదో వేధిస్తున్నదని గ్రహించి, "ఏమిటది, నాన్నా?" అన్నది.

"ఏవో గబ్బిలాలు షేర్‌ఖాన్ గురించి వదురుతున్నాయి. ఈ రాత్రి వేటకు పొలాల మధ్యకు పోతున్నాను," అంటూ మౌగ్లీ కొండ దిగువకు లంఘించి పరిగెత్తి, దిగువన లోయలో ఉండే వాగును చేరి, అంతలో మంద వేటాడే ధ్వనులు వినిపించే సరికి నిలిచిపోయాడు. దుప్పిరంకె వినపడింది. అది తప్పించుకోలేని ఇరుకులో పడినట్టుగా ముక్కింది. యువకతోడేళ్ళ కేకలు వినిపించాయి: "అకేలా! అకేలా! అకేలా తన బలం చూపుతాడు. నాయకుడికి దారి తొలగండి! దూకు, అకేలా!"

అకేలా దూకి దుప్పిని పట్టుకోలేకపోయినట్టు స్పష్టమైంది. అకేలా పళ్ళు కరుచుకున్న చప్పుడయింది. దుప్పి ముంగాళ్ళతో గట్టిగా ఒక్కతన్ను తన్నేసరికి అకేలా ఆర్తనాదం చేశాడు.

మౌగ్లీ ఇంకేమీ వినదలచక ముందుకు పరుగుతీశాడు. మంద చేసే కోలాహలం అంతకంతకూ అస్పష్టమైపోయింది. మౌగ్లీ పొలాల మధ్య ఉండే గుడిసెల దగ్గిరికి చేరుకున్నాడు. వాడు ఒక కిటికీ సమీపంలో ఉన్న గడ్డికుప్పలో దూరి, "బాఘీర నిజం చెప్పాడు. నాకూ, అకేలాకూ రేపు ఒకే రకమైన రోజు," అనుకున్నాడు.

అట్ట చివరి బొమ్మ



అతను లేచి త్వరలోనే చేల మధ్య ఉండే గ్రామాలను చేరాడు, అయితే అక్కడ ఆగలేదు. ఎందుచేతనంటే అవి అరణ్యానికి సమీపంలోనే ఉన్నాయి; తనకు అరణ్యంలో కనీసం ఒక ప్రబల శత్రువున్నాడు. అతను లోయ కుండా పోయే ఎగుడుదారి వెంట అలుపులేని పరుగున దాదాపు ఇరవై మైళ్ళు వెళ్ళి తనకు అపరిచితమైన ప్రాంతం చేరుకున్నాడు.

అక్కడితో లోయ ముగిసి, విశాలమైన మైదానం వచ్చింది. దానిమీద అంతటా చిన్న చిన్న గుట్టలూ, బీటలూ ఉన్నాయి. మైదానం ఒక చివర ఒక గ్రామం ఉన్నది. రెండవ చివర చిట్టడవి ఉన్నది. మైదానం అంతటా ఆవులూ, గేదెలూ మేస్తున్నాయి. వాటిని కాసే కుర్రాళ్ళు మౌగ్లీని చూస్తూనే పెద్దగా కేకలుపెట్టి, పారిపోయారు. ఊర కుక్కలు అతన్ని చూసి మొరుగుతూ, వెంటబడ్డాయి.

ఆకలి దహించుకు పోతూండటం చేత మౌగ్లీ గ్రామంకేసి నడిచాడు. గ్రామ ద్వారం దగ్గిర ఒక పెద్ద ముళ్ళపొద కనిపించింది. చీకటి పడేవేళ దాన్ని ద్వారానికి అడ్డంపెట్టి, పగటివేళ పక్కకు తోస్తారు.

"ఆఁ హాఁ! ఇక్కడి వాళ్ళకు కూడా అరణ్య వాసులంటే బెదురేనన్నమాట!" అనుకుంటూ మౌగ్లీ గ్రామద్వారం వద్ద కూర్చున్నాడు.

ఎవరో గ్రామం నుంచి బయటికి వచ్చారు. మౌగ్లీ లేచి నిలబడి, నోరు తెరిచి, తనకు ఆహారం కావాలని వేలితో నోటిని చూపిస్తూ సంజ్ఞ చేశాడు.

ఆ మనిషి మౌగ్లీ కేసి నిర్ఘాంతపోయి చూసి, పురోహితుణ్ణి పేరు పెట్టి గట్టిగా పిలుస్తూ, వీధి వెంట పరిగెత్తాడు.

గ్రామ పురోహితుడు చాలా ఒడ్డూ, పొడుగూ మనిషి. నుదుట పసుపు పచ్చ బొట్టూ, కుంకం బొట్టూ పెట్టుకున్నాడు.

తెల్లని బట్టలు కట్టుకున్నాడు. కనీసం వంద మందిని వెంట బెట్టుకుని ఆయన గ్రామ ద్వారం చేరాడు. ఆయన వెంట ఉన్న వారిలో కొందరు మౌగ్లీ కేసి గుడ్లు పెట్టుకుని చూశారు, కొందరు మాట్లాడారు. కొందరు గట్టిగా అరిచి మాట్లాడారు.

"ఈ మనుషులకు కొంచెం కూడా మర్యాదలు తెలియవు. కొండముచ్చు లిలాగే ప్రవర్తిస్తాయి," అనుకుంటూ మౌగ్లీ, జుట్టు వెనక్కు పడేలాగా తల విదిలించి, గ్రామస్థుల కేసి కొరకొరా చూశాడు.

"భయపడటాని కేముంది? వాడి కాళ్ళ మీదా, చేతుల మీదా ఆ మచ్చలు చూడండి. తోడేళ్ళు కరిచాయి. వాడు తోడేలు మనిషి. అరణ్యం నుంచి పారిపోయి వచ్చాడు, అంతే," అన్నాడు పురోహితుడు.

ఆయన అన్నమాట నిజమే. మౌగ్లీతో ఆడుకునేటప్పుడు తోడేలు కూనలు అనుకోకుండా కాస్త గట్టిగా కరిచాయి. వాడి చేతుల మీదా, కాళ్ళ మీదా తెల్లనిమచ్చ లనేకం ఉన్నాయి. కాని మౌగ్లీ వాటిని కాట్లుగా భావించలేదు. నిజమైన కాటు ఎలా ఉండేదీ వాడికి తెలుసును.

"అయ్యో, అయ్యో! పాపం, వాణ్ణి తోడేళ్ళు కరిచాయా? చూడటానికి చక్కగా



ఉన్నాడు. నీ కొడుకుని పులి పట్టుకు పోయింది - చూడు, మేస్సువా? అచ్చు అలాగే ఉన్నాడు," అన్నారు ఇద్దరు ముగ్గురు స్త్రీలు.

చేతులకూ కాళ్ళకూ బరువైన రాగి కడియాలు తొడిగిన ఒక స్త్రీ, "ఏదీ, చూడనీ," అంటూ ముందుకు వచ్చి, కళ్ళకు చెయ్యి అడ్డం పెట్టుకుని మౌగ్లీని పరికించి చూసి, "వాడు కాదులే. ఇంకా బక్కగా ఉన్నాడు, కాని అంతా అదే పోలిక," అన్నది.

పురోహితుడు తెలివిగల పిండం. మేస్సువా మొగుడు గ్రామానికి పెద్ద షావుకారు. అందుచేత పురోహితుడు క్షణం సేపు

ఆకాశాని కేసి చూసి, "అరణ్యం పుచ్చు కున్నది అరణ్యమే తిరిగి ఇచ్చేసింది. అబ్బాయిని తీసుకో చెల్లెమ్మా. అందరి భవిష్యత్తూ ఎరిగిన పురోహితుడి మాట మరిచేవు," అన్నాడు.

ఇదంతా చూస్తూంటే మంద చేసే పరీక్ష గుర్తు కొచ్చింది మౌగ్లీకి. కాని తాను మనిషి అయినప్పుడు మనిషి లాగా తయారుకాక తప్పేది లేదు.

జనం దారి ఇచ్చిన మీదట ఆ స్త్రీ మౌగ్లీని తన యింటికి తీసుకుపోయింది. అక్కడ ఒక ఎర్రలక్క పూసిన మంచమూ, అరడజను రాగి వంటపాత్రలూ, ఒక గూట్లో దేవుడి విగ్రహమూ, ధాన్యం పోసు కోవటానికి ఒక పెద్ద బానా, గోడ మీద ఒక పెద్ద అద్దమూ ఉన్నాయి.

ఆవిడ వాడికి తాగటానికి చాలా పాలూ, రొట్టే ఇచ్చింది, వాడి నెత్తి మీద చెయ్యి ఆనించి, వాడి కళ్ళలోకి చూసింది. పులి అరణ్యంలోకి ఈడ్చుకు పోయిన తన కొడుకే ఒకవేళ తిరిగి వచ్చాడేమో!

"నత్తూ! ఓరి నత్తూ!" అని ఆమె వాణ్ణి పేరు పెట్టి పిలిచింది.

మౌగ్లీ ఆ పేరు ఎరిగినట్టు కనబడలేదు.

"నీ కావేళ కొత్తచెప్పులు కొన్నానే, జ్ఞాపకం ఉందిరా ?" అంటూ ఆమె వాడి పాదాలు ముట్టుకున్నది. అవి ఇంచుమించు గిట్టలంత గట్టిగా ఉన్నాయి.

"ఇవి చెప్పులు తొడిగిన కాళ్ళు కావు. నువు నత్తూవు కావు. కాని నువ్వింక నా కొడుకువే," అన్న దామె.

మౌగ్లీ అదివర కెన్నడూ చూరు కింద ఉండినవాడు కాడు. వాడికి ఇంట్లో ఉండటం అదోలా గున్నది. వాడు ఇంటి కప్పు కేసి చూసి, తాను పారిపోవాలంటే ఆ కప్పును ఛేదించటం తనకు అవలీల అని తెలుసుకున్నాడు. కిటికీలకు కూడా గడియలు లేవు.

—(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 6

మౌగ్లీ మనిషి భాష నేర్చుకోవటానికి నిశ్చయించుకున్నాడు. మనిషి అయాక మనిషి మాట అర్థం కాకపోతే లాభమేమిటి? అరణ్యంలో ఉన్నప్పుడు అతను అన్ని జాతుల భాషా నేర్చుకున్నాడు. మేస్సువా నోట ఏ మాట వచ్చినా మౌగ్లీ ఆ మాట తాను కూడా అనేవాడు. చీకటి పడేలోపుగా అతనికి ఆ గుడిసెలో ఉండే అనేక వస్తువుల పేర్లు నోటికి వచ్చాయి.

పడక విషయంలో పెద్ద పేచీ వచ్చింది. పులిబోను లాగున్న ఆ గుడిసెలో పడుకోవటం మౌగ్లీకి ఎంత మాత్రమూ సమ్మతం కాలేదు. వాళ్ళు తలుపు మూసేస్తే, అతను కిటికీ గుండా బయటికి వెళ్ళాడు.

"వాడి ఇష్ట ప్రకారమే పోనీ. ఇప్పటి దాకా వాడు పక్కపైన పడుకుని ఎరగడన్నది గుర్తుంచుకో. వాడు మన పిల్లవాడికి బదులు పంపబడ్డవాడే అయితే మనని విడిచి ఎక్కడికీ పోడు," అన్నాడు మేస్సువా భర్త. మౌగ్లీ వెళ్ళి, పొలం పక్కన స్వచ్ఛమైన పచ్చికనేల మీద పడుకున్నాడు.

అతనికి జరిగిన సంగతులన్నీ స్మరణకు వచ్చాయి. ఆనాడు బాఘీర ఎర్రపువ్వు తెమ్మన్నప్పుడతను కొండ కిందికి వెళ్ళి ఒక ఇంటి నుంచి కొంత నిప్పును ఒక చట్టిలో తస్కరించి అరణ్యానికి తిరిగి వెళ్ళాడు. గతరాత్రి అకేలా వేటలో పరాభవం పొందాడు. అతను మంద ఇచ్చే శిక్షకు పాత్రుడయాడు. మంద మౌగ్లీ కోసం ఆ రాత్రంతా వెతికిందట, బాఘీర చెప్పాడు. మౌగ్లీ ఆ రోజల్లా ఎండుకొమ్మలతో చట్టిలోని నిప్పును రాజ చేస్తూ వచ్చాడు. ఆ రాత్రే కొండశిఖరాన మంద సమవేశమయింది. షేర్‌ఖాన్ మాట్లాడాడు. షేర్‌ఖాన్‌కు మంద



నాయకత్వం గురించి మాట్లాడే అధికారం లేదని మౌగ్లీ ఆక్షేపించాడు. కాని మంద అతని ఆక్షేపణను తిరస్కరించి, "నోరు ముయ్యరా, మనిషికూనా!" అన్నది. ఆ మనిషికూన తనదని షేర్‌ఖాన్ అన్నాడు. మంద ఉద్రేకం చెంది మౌగ్లీని చంప సిద్ధ పడింది. మౌగ్లీ లేచి నిలబడి తన నిప్పుల చట్టిని మంద మధ్యకు విసిరాడు. విసిరే ముందు ఎండుకొమ్మను చట్టిలో పెట్టాడు. అది భగ్గున మండింది. మంటలూ, నిప్పులూ చూసి మంద హడలిపోయింది. షేర్‌ఖాన్ బొచ్చు కాలింది. మౌగ్లీ అతన్ని సమీపించి, "లేచి నిలబడు, కుక్కా!" అంటూ కాలితో నిప్పులను ఎగదన్నాడు. ఆ తరవాత మౌగ్లీ తన తోడేలమ్మ కుటుంబానికి వీడ్కోలు చెప్పి వచ్చేశాడు.

అతను కళ్ళు మూసేలోపల అతని గడ్డం కింద మెత్తని ముక్కు తగిలింది.

ఆ వచ్చినది పెద్దన్న-అంటే తోడేలమ్మ పెద్ద కొడుకు.

"ఛీ! ఛీ! నీ కోసం వెతుక్కుంటూ ఇరవై మైళ్ళు వచ్చినందు కిదా ఫలితం? నీ ఒళ్ళు కట్టెల పొగ వాసనా, పశువుల కంపూ కొడుతున్నది. అప్పుడే మనిషి అయి పోయావు. లే, బుల్లి తమ్ముడూ, నీకో వార్త తెచ్చాను," అన్నాడు పెద్దన్న.

మౌగ్లీ వాణ్ణి కౌగలించుకుని, "అరణ్యంలో అంతా కులాసా?" అని అడిగాడు.

"ఎర్రపువ్వు కాలినవాళ్ళు తప్ప అంతా కులాసాయే. విను, షేర్‌ఖాన్ బొచ్చు బాగా కాలింది కాదూ? అది తిరిగి పెరిగేదాకా ఇంకెక్కడో వేటాడబోయాడు. తిరిగి వచ్చాక నీ దుమ్ములు వాయిన్‌గంగలో కలుపుతానని శపథం చేశాడు," అన్నాడు పెద్దన్న.

"దానికేంలే? నేనూ చేశానొక శపథం. కాని వార్తలు తెలియటం అవసరం. నువు మటుకు ఎప్పటి వార్త లప్పుడు చెబుతూ ఉండు—నా కిప్పుడు నిద్ర ముంచు కొస్తు

న్నది, పెద్దన్నా. కొత్త విషయాలు అలవ గొట్టాయి," అన్నాడు మౌగ్లీ.

"నువ్వు మనుషుల మాయల్లో పడి తోడేలు నన్న సంగతి మరిచేవు సుమా?"

"ఎలా మరుస్తాను? నిన్నూ, మన గుహలో వాళ్ళనూ ఒక్కనాటికి మరవను. నన్ను మంద నుంచి వెళ్ళగొట్టా రన్నది కూడా మరవను."

"నిన్ను మళ్ళీ మరొకమంద నుంచి వెళ్ళ గొట్టకుండా చూసుకో. మనుషులు మను షులే. వాళ్ళు మాట్లాడుతుంటే చెరువులో కప్పలు బెకబెక లాడినట్టుంటుంది. నే నీ సారి వచ్చినప్పుడు పచ్చికబీడు చివర వెదుళ్ళ పొదలో నీ కోసం వేచి ఉంటాను," అని పెద్దన్న వెళ్ళిపోయాడు.



ఆ తరవాత మూడు నెలలపాటు మౌగ్లీ దాదాపు గ్రామద్వారం దాటి వెళ్ళలేదని చెప్పవచ్చు. అతను మనుషుల పద్ధతులు అలవరుచు కోవటంలో నిమగ్నుడయాడు. మొట్టమొదట అతని మొల కొక బట్ట చుట్టారు; అది చాలా దుర్భరమనిపించింది. తరవాత డబ్బు గురించి తెలుసు కోవలిసొచ్చింది; అది చచ్చినా అర్థం కాలేదు. అలాగే పొలం దున్నటం వల్ల ప్రయోజనమేమిటో అంతుబట్ట లేదు.

ఊరి పిల్లకారు అతనికి చాలా కోపం తెప్పించారు. అరణ్యంలో పెరిగినవాడు గనక అతను తన కోపాన్ని సులువుగా నిగ్రహించుకున్నాడు—అరణ్యంలో ప్రాణమూ, తిండీ దక్కించుకోవాలంటే ఆవేశం కూడదు. కాని ఊరిపిల్లలు, తాను ఆటలకు రాడనీ, గాలిపటా లెగరెయ్యడనీ ఎద్దేవా చేసినా, తన మాటల ఉచ్చారణ చూసి వెటకారం చేసినా, చీల్చి చెండాడాలనిపించేది. కూనలను చంపటం అనుచితమని ఊరుకునేవాడు. తన కెంత బలం ఉన్నదో మౌగ్లీకి కొంచెం కూడా తెలీదు. అర ణ్యంలో తన కన్న చాలా బలం గల

జంతువులుండేవని అతనికి తెలుసు. గ్రామంలోవాళ్ళు మాత్రం అతనికి ఎద్దుకున్నంత బలం ఉన్నదనేవాళ్ళు.

మనుషుల్లో ఉండే కుల వ్యత్యాసాలు మౌగ్లీకి బొత్తిగా తెలీవు. కుమ్మరివాళ్ళ గాడిద అడుసుగుంటలోకి జారిపడితే, మౌగ్లీ దాన్ని తోకపట్టి పైకిలాగి, సంతకు పోతున్న కుండలను సర్ది అమర్చటానికి సాయం చేశాడు. అది చాలా తప్పు. కుమ్మరి తక్కువ కులంవాడు. గాడిద మాట వేరే చెప్పేదేమిటి? పురోహితుడు మౌగ్లీని గట్టిగా మందలించాడు.

"నిన్ను కూడా ఆ గాడిద మీద కుండలతో బాటు ఎక్కిస్తాను," అన్నాడు మౌగ్లీ పురోహితుడితో.

పురోహితుడు మెస్సువా మొగుడి దగ్గిరికి వెళ్ళి, "కుర్రవెధవను సాధ్యమైనంత త్వరలో ఏదైనా పనిలో పెడితే మేలు," అని చెప్పాడు.

గ్రామపెద్ద మౌగ్లీని పిలిచి, "రేపటి నుంచీ నువు గేదెల వెంట వెళ్ళి వాటిని మేపుకు వస్తూ ఉండు," అన్నాడు. మౌగ్లీకి అంతకంటె కావల్సిందేమిటి? తానిప్పుడు ఒక విధంగా గ్రామోద్యోగి అయాడు గనక అతను ఆ సాయంకాలం రావిచెట్టు కింద జరిగే సమావేశానికి వెళ్ళాడు. అది రచ్చబండ. గ్రామపెద్దా, తలారీ, మంగలీ, షికారీవాడు బలదేవుడూ అక్కడ చేరేవాళ్ళు, పొగ తాగేవాళ్ళు. చెట్టుకొమ్మల్లో కోతులు చేరి మాట్లాడుకునేవి. చెట్టు కింది అరుగు కలుగులో తాచుపాముండేది. అది పవిత్రమైనది కావటంచేత దానికి ప్రతీరాత్రీ పాలు ముట్టేవి. పెద్దలు చెట్టు చుట్టూ చేరి, హుక్కా తాగుతూ, చాలా పొద్దుపోయినదాకా మాట్లాడుకునేవాళ్ళు. వాళ్ళు దేవతలను గురించీ, మనుషులను గురించీ, దయ్యాలను గురించీ అద్భుతమైన విషయాలు చెప్పుకునేవాళ్ళు. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 7

బలదేవుడు అరణ్యమృగాలను గురించి అద్భుతమైన విషయాలు చెప్పేవాడు. దూరంగా కూర్చుని ఆ విషయాలు వినే పిల్లలకు కళ్ళు వెళ్ళుకొచ్చేవి: ఆ గ్రామం అరణ్యాన్ని అనుకునే ఉండటంచేతా, లేళ్ళూ, అడవిపందులూ పొలాలలోపడి ధ్వంసం చేసేవి గనకా, సందెచీకట్లో ఎప్పుడైనా పులి వచ్చి ఎవడో మనిషిని ఈడ్చుకుపోవటం జరుగుతూ ఉండటంచేతా, అరణ్యమృగాలను గురించే చెట్టు కింద విశేషంగా కబుర్లు సాగుతూండేవి.

బలదేవుడు తన తుపాకీని తొడల మీద అడ్డంగా పెట్టుకుని ఒకదాన్నిమించి మరొకటిగా అద్భుతమైన కథలు చెప్పేస్తుంటే మౌగ్లీకి పొట్ట చెక్కలైపోయేది ; తాను నవ్వుతున్నట్టు తెలియరాకుండా అతను ముఖానికి చేతులు అడ్డం పెట్టుకునేవాడు.

బలదేవుడు చెప్పేశాడు : మెన్నవాకొడుకు నెత్తుకుపోయినది దయ్యపు పులిట. కొన్ని సంవత్సరాల క్రితం చచ్చిపోయిన వడ్డీ వ్యాపారస్థుడొకడు, దుర్మార్గుడు, దయ్యమై పులిని ఆవేశించాడట.

"ఇందులో అబద్ధమేమీ లేదు. ఆ పురన్దాసుగాడి ఖాతాపుస్తకాలు తగలబెట్టినప్పుడు దొమ్మీ జరిగింది చూశారూ? ఆ దొమ్మీలో దెబ్బతగిలి వాడి కాలొకటి కుంటి అయిపోయింది. నేను చెప్పిన పులి ఉంది చూశారూ? అదీ కుంటిదే. ఎందుకంటే దాని కాలి గుర్తులన్నీ ఒకటిగా లేవు," అన్నాడు బలదేవుడు.

"ఇకనేంమరీ?" అంటూ ముసలాళ్ళంతా తల లాడించారు.

"మీరు చెప్పుకునే కబుర్లన్నీ ఇంత ఆకాశపాకాశవేనా? ఆ పులి పుట్టటమే

అట్ట చివరి బొమ్మ



కుంటిదిగా పుట్టింది. ఈ మాట అందరికీ తెలుసు. నక్కపాటి ధైర్యం కూడా లేని జంతువులో వడ్డీవ్యాపారి దయ్యం ఉన్న దనటం వట్టిపిచ్చిమాట," అన్నాడు మౌగ్లీ.

ఆశ్చర్యంతో బలదేవుడి నోట మాట రాలేదు. గ్రామపెద్ద పరకాయించి చూసి, "ఎవరదీ? ఓహో, ఆడివికుంకా? అంత తెలిసినవాడివైతే దాని చర్మం పట్టుకురా. పట్టుకొచ్చిన వాళ్ళకు నూరురూపాయలు బహుమతీ ఇస్తామని సర్కారువారు ప్రకటించారు. ఏమైనా నువు పెద్దవాళ్ళ సంభాషణలో కలగజేసుకోకుండా ఉంటే మేలు," అని సలహాయిచ్చాడు.

మౌగ్లీ లేచి నిలబడి, "ఇందాకట్నుంచీ వింటున్నాను. బలదేవుడు ఒకటి రెండు సార్లు తప్ప, పక్కనే ఉన్న అరణ్యం గురించి ఒక్కముక్క నిజం చెప్పలేదు. ఆయన చూశాననే దయ్యాల కబుర్లూ, దేవుళ్ళ కబుర్లూ, పిశాచాల కబుర్లూ ఎలా నమ్మటం?" అంటూ వెళ్ళిపోయాడు.

బలదేవుడు చిర్రుబుర్రులాడాడు.

"ఆ అబ్బాయిని గొడ్ల వెంట త్వరగా పంపటం మంచిది," అన్నాడు గ్రామపెద్ద.

గ్రామానికి చెందిన కుర్రాళ్ళు తెల్లవారుతూనే పశువులను తోలుకుని ఊరి బయటికి వెళ్ళి, రోజల్లా వాటిని మేయనిచ్చి, చీకటివేళకు ఇళ్ళకు తిరిగి వస్తారు. పిల్లలు పశువుల మంద వెంట ఉన్నంతకాలమూ వారికి అపాయం లేదు. ఎందుకంటే, పులి కూడా మందగా ఉన్న పశువుల చాయలకురాదు. కాని పిల్లలు ఏ పూలగుత్తులు కొయ్యటానికో, తొండలను తరుముతూనో మందకు దూరం వెళ్ళితే వారికి అడవి జంతువుల వల్ల భయం ఏర్పడుతుంది.

తెల్లవారగానే మౌగ్లీ "రాముడు" అనే దున్నపోతు మీద ఎక్కి బయలుదేరేవాడు. గేదెలు ఒక్కటొక్కటే లేచి అతని వెనకగా బయలుదేరేవి.



పశువులు మేసే ప్రదేశం నిండా తుప్పలూ, రాళ్ళూ ఉండేవి. అది ఎగుడు దిగుడుగా ఉండేది. పశువులు పల్లాలలోకి ప్రవేశించి కంటికి కనిపించకుండా పోయేవి.

మౌగ్లీ తన మందను అరణ్యం సమీపానికి, వాయిన్‌గంగ ఒడ్డుదాకా తోలుకుపోయి, "రాముడి"మీది నుంచి దిగి, అక్కడి వెదుళ్ళలో ప్రవేశించాడు. అక్కడ అతని కోసం "అన్న" వేచి ఉన్నాడు.

"నీ కోసం ఎన్నో రోజులుగా కాచుకుని ఉన్నాను. ఈ పశువుల కాపరి పనేమిటి నీకు?". అని అన్న మౌగ్లీని అడిగాడు.

"అలా ఏర్పాటయింది. కొంతకాలం నేను పశువులు కాయాలి. షేర్‌ఖాన్ ఏం చేస్తున్నాడు?" అని మౌగ్లీ అడిగాడు.

"వాడు మళ్ళీ ఈ ప్రాంతాలకు తిరిగి వచ్చి, నీ కోసం మహా చూశాడు. కాని ఇక్కడ వేట సాగక మళ్ళీ ఎటో వెళ్ళాడు. వాడు నిన్ను చంపాలనే ఉన్నాడు," అన్నాడు అన్న.

"సరే, షేర్‌ఖాన్ తిరిగి వచ్చేదాకా నువు గాని, మరో అన్నగాని ఆ కనిపించే మిట్ట మీద కూర్చుని, పొద్దున నేను పశువులను తోలుకుని వచ్చేటప్పుడు నాకు కనబడుతూ ఉండండి. వాడు తిరిగి రాగానే, మైదానం మధ్యనుండే కందకంలో నన్ను నువు కలుసుకో. వాడి ఆ చూకీ నాకు తెలుస్తూ ఉండటం అవసరం," అన్నాడు మౌగ్లీ.

అన్నను పంపేసి అతను చెట్టునీడ చూసుకుని, పడుకుని నిద్ర పోయాడు. చుట్టూ పశువులు మేస్తున్నాయి.

గొడ్ల కాయుట మంత తీరిక పని మరొకటి ఉండదు. గొడ్ల కాసే పిల్లలకు రోజల్లా ఏమీ పనిలేదు. పశువులు మేత మేస్తూ, కదులుతూ, మళ్ళీ మేస్తూ రోజల్లా గడిపేస్తాయి. అవి అరవనన్నా అరవవు. గేదెలు మేసినంతసేపు మేసి, ఏ నీటి గుంటో, బురద గుంటో చూసుకుని, అందులో పడుకుని

ముట్టెలు మాత్రమే బయటికి పెడతాయి. గొర్ల కాసే పిల్లలకు ఎప్పుడైనా ఒక్కసారి గద్ద కేక ఆకాశంలో నుంచి అస్పష్టంగా విని పిస్తుంది. ఏ గొడ్డయినా చచ్చి దాని కళ్ళ పడిందో, ఆ గద్ద రివ్వున నేల కేసి వస్తుంది. దాన్ని గమనించి అనేక ఇతర గద్దలు అనేక మైళ్ళ దూరంనుంచి వచ్చి, చచ్చిన గొడ్డు మీద వాలి, అన్నీ కలిసి గొడ్డు కళేబరాన్ని పీక్కు తింటాయి.

పిల్లలు కొంతసేపు నిద్రపోతారు. కొంత సేపు తుంగతో బుట్టలు అల్లుతారు. లేకపోతే అడివి కాయలు ఏరుకొచ్చి మాలలు కడ తారు. తొండలూ, పాములూ తిరుగుతుంటే వాటిని గమనిస్తారు. లేకపోతే మట్టితో ఇల్లు కడతారు, రాజులనూ, రాణులనూ, దేవత లనూ తయారు చేసినట్టు నటిస్తారు. పొద్దు వాలగానే పిల్లలు గొడ్లను కేక పెడతారు. అవి తామున్న చోటు నుంచి లేచి, కదిలి, పిల్లల వెంట గ్రామానికి తిరిగి పోతాయి.

మౌగ్లీ పశువులను తోలుకుని వచ్చే టప్పుడు ప్రతి ఉదయమూ మిట్టకేసి చూసే వాడు. అతని అన్నలలో ఎవడో ఒకడు దాని మీద కనిపించేవాడు; అంటే షేర్‌ఖాన్ ఇంకా తిరిగి రాలేదన్నమాట. అతను రోజూ నీడ పట్టున పడుకుని నిద్రపోయి, తన అరణ్య జీవితం గురించి కలలు కనేవాడు. షేర్‌ఖాన్ నిజంగానే వచ్చి ఉంటే, వాడు అరణ్యంలో ఏమూల తన కుంటి కాలుతో తప్పటడుగు వేసినా మౌగ్లీకి తెలిసి ఉండేదే ననుకోవచ్చు.

చిట్టచివరకు ఒక ఉదయం మౌగ్లీకి మిట్ట మీద తన అన్నలలో ఒకడూ కనిపించ లేదు. మౌగ్లీ తనలో తాను నవ్వుకుని ఆనాడు పశువులను కందకం పక్కన ఉన్న ఎర్ర తంగేడు చెట్టు కేసి తోలుకు పోయాడు. అక్కడ పెద్దన్న వేచి ఉన్నాడు. అతని ఒంటి పైన రోమాలన్నీ నిక్కబొడుచుకుని ఉన్నాయి. "షేర్‌ఖాన్ వచ్చాడు," అన్నాడు అన్న రొప్పుతూ. —(ఇంకా వుంది)





# అరణ్యపురాణం

## 8

"అన్న" వొంటి మీద రోమాలు నిక్క బొడుచుకుని ఉన్నాయి.

"నిన్ను మభ్యపెట్టటానికి షేర్‌ఖాన్ నెల రోజులపాటు ఎటో వెళ్ళాడు. వాడు తబకీని వెంటబెట్టుకుని నిన్ననే కొండలు దాటి నీ కోసం వెతుక్కుంటూ వచ్చాడు," అన్నాడు అన్న వగర్చుతూ.

మౌగ్లీ ముఖం చిట్లించి, "షేర్‌ఖాన్‌ను నేను ఖాతరు చెయ్యను. కాని తబకీ జిత్తుల మారివాడు," అన్నాడు.

అన్న పెదవులు నాక్కుంటూ, "భయ పడకు. తెల్లవారుజామున తబకీని కలిశాను. ఆ నక్కగాడు నాతో అంతా చెప్పేశాడు. అంతా విన్నాక వాడి నడుము విరగ్గొట్టేశా నులే. ఇవాళ సాయంకాలం నువు గ్రామా నికి తిరిగి వెళ్ళేటప్పుడు గ్రామద్వారం వద్ద కాపు వెయ్యాలని షేర్‌ఖాన్ ఆలోచనట. వాడిప్పుడు వాయిన్‌గంగ పెద్ద కనుమలో ఉన్నాడు," అన్నాడు.

"వాడివాళ తిండి తిన్నాడా, లేక పర గడుపున వేటాడుతున్నాడా?" అని అడి గాడు మౌగ్లీ.

ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. దాని సమాధానం పైన మౌగ్లీ చావు బతుకు లాధారపడి ఉన్నాయి.

"తెల్లారుజామునే ఒక పందిని చంపాడు. పూటుగా తిన్నాడు, తాగాడు. షేర్‌ఖాన్ గాడి సంగతి నీకు తెలీదా? పగబట్టి నప్పు డైనా ఒక పూట పస్తుండలేడు, వెధవ," అన్నాడు అన్న.

"వెధవ, చవట వెధవ! కూన కన్న కూడా అన్యాయం! తిని తాగాడూ? తాను నిద్రపోయి లేచేదాకా నేను కనిపెట్టుకుని ఉంటాననా వాడి ఉద్దేశం? ఇప్పు డెక్కడ

అట్ట చివరి బొమ్మ



పడుకుని ఉన్నాడు? మనం పదిమందిమి ఉంటే వాడి అంతు తేల్చేపని! వాడి వాసన తగిలితే తప్ప ఈ దున్నలు వాడి మీదికి పోవు. నాకేమో వాటి భాష తెలిసి చావదు. వీటికి వాడి వాసన తగిలేటట్టు తోలుకు పోగలమా?" అన్నాడు మౌగ్లీ.

"వాసన తెలియరాకుండా వాయిన్‌గంగ ప్రవాహం వెంబడి చాలాదూరం ఈదుకు పోయాడు," అన్నాడు అన్న.

"అది తబకీగాడి ఆలోచన అయి ఉండాలి. షేర్‌ఖాన్ మొహానికి అంత తెలివి తేటలు కూడానా?" మౌగ్లీ నోట్లో వేలు వేసుకుని కొంచెంసేపు ఆలోచించాడు. "ఈ పెద్ద కనుమకొస మైదానం మీదుగా పోతే అర మైలు దూరంలో ఉన్నది. మందను అరణ్యంకుండా కనుమ తల దగ్గిరికి తీసుకు పోయి, కనుమలోకి తోలగలను. కాని షేర్ ఖాన్ రెండో చివర నుంచి చల్లగా జారుకుంటాడు. ఈ చివరను ఎలాగైనా అడ్డాలి. అన్నా, నీవు మందను రెండుగా చీలదీయలేవా?" అన్నాడు.

"అది నావల్ల అయేపని కాదులే. అందుకు తగినవాణ్ణి తెచ్చాగా?" అంటూ అన్న పరిగెత్తుకుంటూ వెళ్ళి ఒక గుంటలోకి దూకాడు.

అందులో నుంచి ఒక పెద్ద తల బయటికి వచ్చింది. ఆ క్షణంలోనే వేటాడే తోడేలు పిలుపు కూత చుట్టూ ప్రతిధ్వనించింది.

"అకేలా! అకేలాయే!" అంటూ మౌగ్లీ ఆనందంతో చప్పట్లు చరిచాడు. "నువు నన్ను మరిచిపోవని తెలుసు, అకేలా. ఇప్పుడు మనకు చేతినిండా బోలెడు పని! ఈ మందను రెండుగా చీలదియ్యి, అకేలా. ఆడపశువులనూ, దూడలనూ ఒక మందగానూ, ఎద్దులనూ, దున్నలనూ ఒక మందగానూ వేరు చెయ్యి," అన్నాడు.

అకేలా, అన్నా మంద మధ్యగా పరిగెత్తుతూ, మౌగ్లీకి కావలసినట్టుగా మందను

రెండుగా విడగొట్ట సాగారు. ఒక మందలో అడపశువులూ, దూడలూ ఉన్నాయి. అడ పశువులు కళ్ళు పెద్దవిచేసి, కాళ్ళతో నేలను గోరాడుతున్నాయి. తోడేళ్ళలో ఏ ఒకటి ఒక్క క్షణం కదలకుండా నిలబడినా, కాళ్ళతో మట్టగించి చంపటాని కవి సిద్ధంగా ఉన్నాయి. రెండో మందలోని ఎద్దులూ, దున్నలూ ముక్కులతో బుసలు కొడుతూ మరింత భయంకరంగా ఉన్నాయి. కాని నిజాని కవి అడపశువులంత అపాయకర మైనవి కావు. దూడల ప్రాణాలకు తమ ప్రాణాలను అడ్డంవేసే అడపశువులే నిజంగా రౌద్రమైనవి.

త్వరలోనే మందలు చక్కగా విడిపోయాయి. అరుగురు గొడ్లకాసే పిల్లలైనా ఈ పని ఇంత చక్కగా చేసి ఉండరు.

"తరవాత ఏమిటి? మందలు మళ్ళీ కలిసి పోగలవు," అన్నాడు అకేలా.

"మగపశువుల మందను ఎడమ పక్కగా తోలు, అకేలా," అంటూ మౌగ్లీ "రాముడి" మీద ఎక్కి కూర్చుని, "అన్నా, మా మంద వెళ్ళాక రెండో మందను కనుమ దిగువకు తోలు," అన్నాడు.

"కనుమలోకి ఎంతదూరం తోలమన్నావు?" అని అన్న అడిగాడు.



"కనుమ గోడలు షేర్‌ఖాన్ దూకలేనంత ఎత్తుండే చోటికి మందను చేర్చి, మేము అవతల చివర నుంచి వచ్చేదాకా వాటిని అక్కడే ఉంచు," అన్నాడు మౌగ్లీ.

అకేలా మగపశువుల ముందు నిలబడి అరిచే సరికి, అవి అకేలా మీదికి పరుగు తీశాయి. అకేలా వాటికి అందకుండా ముందు పరిగెత్తుతూ వాటిని చుట్టు దారిన కనుమ తలవేపు తీసుకుపోయాడు. ఈలోపుగా అన్న అడపశువుల మందను కనుమ దిగువ చివరకు చేర్చాడు.

షేర్‌ఖాన్ కనుమలో నిద్రపోతున్నాడు. అసలే పిరికి ప్రాణి, తిని తాగి ఉన్నాడేమో

పోరాడటం అతనికి సాధ్యంకాదు. కనుమ ఎగువ నుంచి దిగువకు వాలుగా ఉంటుంది. కనుమ దిగువన ఆడపశువుల మందను అడ్డం ఉంచి, పై నుంచి మగపశువుల మందను దూకుడుగా పరిగెత్తించినట్టయితే, షేర్‌ఖాన్ మధ్య నలిగి చస్తాడు. వాడు మగ పశువుల పాదఘట్టనకు చాపక ఆడపశువుల మంద కేసి వెళ్ళాడో, అవి వాణ్ణి కొమ్ములతో చీల్చి చంపేస్తాయి.

ఇదే మౌగ్లీ ఆలోచన.

మౌగ్లీ ఎక్కి ఉన్న "రాముడు"తో సహా, మగపశువులమంద, చుట్టు దారిన కొండ ఎక్కి కనుమ పై చివరను చేరుకున్నది. ఇంకా పశువులకు షేర్‌ఖాన్ వాసన తగల లేదు. మౌగ్లీ కనుమ గోడలను పరిశీలించాడు. అవి నిటారుగా ఉన్నాయి. వాటి పైకి లతలు ఎగబాకుతున్నాయి. షేర్‌ఖాన్‌కు ఆ గోడలను ఎగబాకటం అసాధ్యం. వాడు కనుమలో చిక్కిపోయాడు.

"మనం వచ్చినట్టు షేర్‌ఖాన్‌కు చెబుదాం," అంటూ మౌగ్లీ పెద్దగా నవ్వి, మూతికి చేతులు అడ్డం పెట్టి, కనుమ దిగువ కేసి కేకపెట్టాడు.

ఆ కేక కనుమ వెంబడి ఉండే ప్రతి కొండరాతి నుంచీ ప్రతిధ్వనించింది.

షేర్‌ఖాన్ మత్తుగా ఆవలించి, "ఎవరా పిలిచేది?" అన్నాడు.

"నేనే, మౌగ్లీని. శిఖరాన సమావేశానికి వేళయింది పద!" అంటూ మౌగ్లీ, "అకేలా, మందను దిగువకు తరుము. రాముడూ, దౌడుతియ్యి," అని తొందర చేశాడు.

మగపశువులమంద మహాప్రవాహం లాగా కనుమ వెంబడి పరుగు ప్రారంభించింది. అకేలా వేటకేకలు వేశాడు. మందల పాద ఘట్టనకు రాళ్ళూ, ఇసుకా చిందరవందరగా లేచాయి. దిగువకు పోతున్నకొద్దీ వాటి వేగం హెచ్చింది. రాముడికి పులివాసన తగిలి గట్టిగా రంకెపెట్టింది. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 9

కొరుదున్నల మంద శిలాపాతంలాగా కనుమ ఎగువ నుంచి దిగువకు దూకుతూ రాసాగింది. దాని ముందు ఎంతటి పులీ నిలవలేదు. బలహీన మైన దున్నలు పక్కలకు నెట్టివేయ బడ్డాయి. అవి లతలను తెంచుకుంటూ దిగువకు పరిగెత్తాయి.

దున్నల పదఘట్టన షేర్‌ఖాన్‌కు విన బడింది. షేర్‌ఖాన్ లేచి కనుమ దిగువ కేసి ఒళ్ళు అడించుకుంటూ పోతూ, తప్పించు కునే మార్గం కోసం చూడసాగాడు. కాని కనుమ పక్కలు చాలా నిటారుగా ఉండటం చేత అతను ముందుకే పోవలసి వచ్చింది. భుక్తాయాసమూ, తాగిన మత్తూ ఇంకా దిగి పోలేదు. తిరగబడి పోట్లాడే ఇచ్ఛ షేర్ ఖాన్‌లో కొంచెం కూడా లేదు. ఒకవేళ పోట్లాడవలిసే వస్తే దూడలతో ఉన్న అడ పశువులను ఎదుర్కొనే కన్న దున్నలను ఎదుర్కోవటమే హెచ్చు క్షేమమని షేర్ ఖాన్‌కు తెలియకపోలేదు.

ఇంతలో "రాముడి" కాళ్ళకింద ఏదో మెత్తగా పడి నలిగింది. దాని వెనక వచ్చిన దున్నలలో బలహీనమైనవి కాలు నిలుప లేక, ఒరిగిపోవటం కూడా జరిగింది.

దున్నలన్నీ, అడపశువులతో సహా కనుమ దిగువనున్న మైదానం మీదిగి వచ్చేశాయి. మౌగ్లీ "రాముడి" వీపు మీది నుంచి కిందికి జారి, ఎడాపెడా ఉన్న దున్నలను చెదర గొట్టుతూ, "అకేలా, వాటిని వేగం చెదర గొట్టు, లేకపోతే తమలో తాము కుమ్ము లాడుకుంటాయి," అని కేకపెట్టాడు. అతను "హే! హే!" అంటూ పశువులను శాంత పరిచాడు.

షేర్‌ఖాన్‌ను మరి తొక్కించ వలసిన పని లేదు. అతను అప్పుడే ప్రాణాలు వదిలాడు.

అట్ట చివరి బొమ్మ

అతని కళేబరం కోసం అప్పుడే గద్దలు వచ్చేస్తున్నాయి.

తిరిగి కనుమ ఎగువకు ఉరకటానికి సిద్ధంగా ఉన్న పశువుల ఉద్రేకాన్ని అకేలా, అన్నా కలిసి తగ్గించారు. వాళ్ళు పశువుల కాళ్ళను చిన్నగా కొరికారు.

"షేర్‌ఖాన్ కుక్కచావు చచ్చాడు. వాడి తోలు తీసుకుపోయి రచ్చబండ దగ్గిర తగిలిస్తే రంజుగా ఉంటుంది," అంటూ మౌగ్లీ, తన మెడలో ఎప్పుడూ పొదితోబాటు వేళ్ళాడే కత్తిని పైకి తీశాడు.

మనుషుల మధ్య పుట్టిపెరిగిన కుర్రాడెవడూ ఒంటరిగా పులిచర్మం ఒలచగలిగి ఉండడు, కాని జంతువు మీద చర్మం ఎలా అమరి ఉండేదీ మౌగ్లీకి తెలుసు. తోడేళ్ళు రెండూ చర్మాన్ని అతను కోరినప్రకారం పక్కలకు లాగి సహాయం చేస్తూంటే, మౌగ్లీ ఒక గంటసేపు చాలా శ్రమపడి ఆ చర్మాన్ని ఒలుస్తూపోయాడు.

ఇంతలోనే ఎవరిదో చెయ్యి అతని భుజాన పడింది. అతను తల ఎత్తి చూసేసరికి, తుపాకితో సహా బలదేవుడు కనిపించాడు. దున్నల దౌడు గురించి గ్రామంలోని కుర్రాళ్ళు బలదేవుడికి వార్త అందించారు. పశువులను కాయటంలో అశ్రద్ధ చేస్తున్నందుకు మౌగ్లీని మందలింతామని బలదేవుడు



బయలుదేరి వచ్చాడు. మనిషి రాక పసి కట్టగానే తోడేళ్ళు రెండూ అక్కణ్ణించి చల్లగా జారుకున్నాయి.

"నీకేమన్నా మతి ఉందా లేదా? ఒంటరిగా పులి చర్మాన్ని ఒలుద్దామనే? దున్నలు దీన్ని ఎక్కడ చంపాయి? ఇదా కుంటి పులేనే! దాన్ని చంపిన వాళ్ళకి నూరు రూపాయలు బహుమానం ఇస్తారు కూడానూ. దీని తోలు తీసుకుపోయి [illegible] వారాలో చూపి, బహుమానం తెచ్చినప్పుడు అందులో నీకొక రూపాయి ఇస్తాలే. పశువులను దౌడు తీయనిచ్చినందుకు ఈసారికి నిన్ను క్షమిస్తాం," అన్నాడు బలదేవుడు.

మౌగ్లీ పులిచర్మం కొయ్యటం కానిస్తూనే తనలో తాను గొణుక్కున్నాడు. "అలాగా? నువు చర్మం పట్టుకుపోయి నూరు రూపాయలు పుచ్చుకుని అందులో ఒకటి నాకిస్తావూ? నాకు ఈ చర్మంతో వేరేపని ఉన్నదే మరీ!" అనుకున్నాడు.

పులి చావగానే దాని ఆత్మ తనను వేధించకుండా దాని మీసాలు కాల్చటం షికారీలకు అలవాటు. బలదేవుడు పులిమీసాలు కాల్చబోతే మౌగ్లీ కసిరాడు.

బలదేవుడు కోపంగా, "ఒరే, ఎవరినో తెలుసా? గ్రామానికి పెద్ద వేటగాణ్ణి. అదృష్టం కలిసొచ్చి, దున్నలు పులిని



తొక్కేశాయి. నేను నీకు బహుమానంలో అణా కూడా ఇవ్వను సరేగదా, మెత్తగా తన్నిస్తాను. ముందా పులిని వదిలిపెట్టి ఇవతలికిరా!" అని గద్దించాడు.

"ఈ పందు కోతితో నాకేమిటి? అకేలా, ఈ మనిషి, చూడు, నన్ను చికాకుపెడుతున్నాడు," అని మౌగ్లీ కేకపెట్టాడు. అతను చర్మం ఒలవటం ఇంకా కాలేదు.

మరుక్షణమే బలదేవుడు నేల మీద బోర్లాపడి ఉన్నాడు. ఒక తోడేలు అతని మీద నిలబడి ఉన్నది. మౌగ్లీ పళ్ళు బిగబట్టి, "నువ్వన్నది నిజమే, బలదేవ్. నీ నుంచి నాకు ఒక అణా కూడా రాదు. ఈ పులికీ నాకూ మధ్య పాత పగ—చాలా పాత పగ—ఉన్నది. చివరికి నేను నెగ్గాను," అన్నాడు.

పదేళ్ళ క్రితం బలదేవుడు అకేలాకు అలా లొంగి ఉండకపోను. అదీగాక, పులి మీద పగబట్టిన మనిషికి సహాయపడే తోడేలు నెలా ప్రతిఘటించాలో అతనికి అంతుబట్ట లేదు. అతని కిదంతా కనుకట్టులాగున్నది.

"మహారాజా, నేను వయసు మళ్ళిన వాణ్ణి. మిమ్మల్ని మామూలు గొడ్లకాపరి కింద జమకట్టటం పొరపాటే. నేను లేచి వెళ్ళిపోతాను. మీ నౌకరు నన్ను చీల్చి చెండాడదుగద?" అన్నాడు బలదేవుడు.

"వెళ్ళు. మరోసారి నా వేటలో జోక్యం కలిగించుకోకు. అతన్ని వెళ్ళిపోనీ, అకేలా!" అన్నాడు మౌగ్లీ.

బలదేవుడు లేచి సాధ్యమైనంత శీఘ్రంగా గ్రామానికి వెళ్ళిపోయాడు. మౌగ్లీ బ్రహ్మరాక్షసిగా మారిపోతాడేమో నన్నట్టుగా అతను తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళాడు. అతను గ్రామంలోకి వెళ్ళి చెప్పిన భూత ప్రేత ఇంద్రజాల కథ విని పూజారి నిశ్చేష్టుడైపోయాడు.

పులి చర్మం ఒలవటం పూర్తి అయేసరికి చీకటి పడుతున్నది. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 10

మౌగ్లీ పులి చర్మం ఒలవటం పూర్తి చేసి, "దీన్ని మనం ఎక్కడన్నా దాచి, మంద లను మళ్ళించుకుపోవాలి. కాస్త సహాయం చెయ్యి, అకేలా!" అన్నాడు.

సంజెచీకట్లలో మంద మళ్ళింది. వాళ్ళు గ్రామాన్ని సమీపించే సరికి దివిటీలు కని పించాయి, గుడి నుంచి గంటలమోతా, శంఖాలమోతా వినిపించింది. ద్వారం వద్ద గ్రామస్థులలో సగంమంది అతనికోసం నిరీక్షిస్తూ నిలబడ్డారు.

"నేను షేర్‌ఖాన్‌ను చంపాను కాదూ? అందుకై ఉంటుంది, జనం యింతమంది చేరారు," అనుకున్నాడు మౌగ్లీ.

కాని అతని మీద రాళ్ళ వర్షం కురిసింది. "మాయావి! తోడేలు కొడుకు! అడవి పిశాచం! వెళ్ళిపో! త్వరగా పోకపోయావో నిన్ను పూజారి మళ్ళీ తోడేలుగా మార్చే స్తాడు. కాల్చు, బలదేవ్, తుపాకీపేల్చు!" అని గ్రామస్థులు కేకలు పెట్టారు.

బలదేవుడి తుపాకి ఢామ్మని పేలింది. ఏదో దూడ బాధతో ఆక్రోశించింది.

"చూశావా? గారడీ! వాడు తుపాకీ గుళ్ళను పక్కకు తప్పించగలడు, బలదేవ్. అది నీ దూడే," అన్నారు గ్రామస్థులు.

"ఏమిటిదంతా?" అన్నాడు మౌగ్లీ.

"ఈ నీ సోదరులకూ, తోడేళ్ళమందకూ ఆటే తేడా లేదు. దీనికంతా అర్థమేమంటే వీళ్ళు నిన్ను బహిష్కరించబోతున్నారు," అన్నాడు అకేలా.

పూజారి చేతిలో తులసిమండ ఒకటి పట్టుకుని ఊపుతూ, "ఒరే, తోడేలూ! తోడేలుకూనా! వెళ్ళిపో!" అని అరిచాడు.

"మళ్ళీనా? లోగడ మనిషి నని వెళ్ళ పొమ్మన్నారు. ఈసారి తోడేలు నని వెళ్ళ

అట్ట చివరి బొమ్మ

పొమ్మంటున్నారు. పోదాం పద, అకేలా,'' అన్నాడు మౌగ్లీ. ఒక స్త్రీ మంద కేసి పరిగెత్తు కుంటూ వచ్చింది. ఆ మనిషి మెస్సువా.

''నాయనా! నా తండ్రీ! నువు మంత్ర గాడివిట; తలుచుకుంటే జంతువుగా మార తావుట—వాళ్ళు అంటున్నారు. నేను నమ్మను. అయినా వెళ్ళిపో, లేకపోతే వాళ్ళు నీ ప్రాణం తీస్తారు. నువు నథూ చావుకు పగ తీర్చావని నాకు తెలుసు,'' అన్నదామె.

''వెనక్కురా, మెస్సువా! లేకపోతే నిన్ను కూడా రాళ్ళతో కొడతాం,'' అని జనం కేకలు పెట్టారు.

ఒక రాయి వచ్చి మౌగ్లీ మూతి మీద తగిలింది. అతను వికృతంగా నవ్వి, ''వెనక్కుపో, మెస్సువా. ఇది సాయంకాలం పూట చెట్టు కింద చేరి వాళ్ళు చెప్పుకునే పిచ్చి కథల లాంటిది. సెలవియ్యి. నేను మందను అతి వేగంగా తోలబోతున్నాను గనక నువు వెనక్కు దౌడుతియ్యి, నేను మంత్రగాణ్ణి మటుకు కాను. సెలవు, మెస్సువా!'' అన్నాడు.

తరవాత, మందను తోలమని అతను అకేలాను హెచ్చరించాడు.

గేదెలు ఇల్లు చేరుకోవాలనే తొందరలోనే ఉన్నాయి. అకేలా అరుపు అవసరం లేకుం



డానే అవి సుడిగాలి లాగా ద్వారంకుండా దౌడు తీశాయి. పూజారి పక్కకు పారిపోతూ కేకలు పెట్టాడు. జనం చిందరవందరగా చెదరిపోయారు.

"నేను ఒకటీ అరా కాజేశానేమో, లెక్క పెట్టుకుని చూసుకోండి. ఇక నేను మీ గేదెల్ని కాయబోను. పిన్నలకూ, పెద్దలకూ అందరికీ—సెలవు. మెస్సువాను చూసి ఊరుకున్నాను గాని, లేకపోతే తోడేళ్ళ మందను తెచ్చి మీ వీధులలోనే మిమ్మల్ని వేటాడి ఉందును," అంటూ మౌగ్లీ గిర్రున వెనక్కు తిరిగి, అకేలా వెంట నడుస్తూ బయలు దేరాడు.

ఆకాశం కేసి నక్షత్రాలను చూస్తే అతనికి ఆనందం కలిగింది. "ఇక మనుషుల బోనుల్లో పడుకునే గతి నాకు లేదు. షేర్ ఖాన్ చర్మం తీసుకుని వెళ్ళిపోదాం...వద్దు, గ్రామం జోలికి మనం పోవద్దు. మెస్సువా యిన్నాళ్ళూ నన్ను చాలా దయగా చూసింది," అన్నాడు మౌగ్లీ.

ఇంతలో చంద్రోదయమై, మైదానమంతటా పిండి అరబోసినట్టు వెన్నెల ప్రసరించింది. ఆ వెన్నెలలో గ్రామస్థులకొక విచిత్ర దృశ్యం కనబడింది: మౌగ్లీ నెత్తిన ఏదో పెట్టుకుని నడుచుకుంటూ పోతున్నాడు, అతని వెనకగా రెండు తోడేళ్ళు



నడుస్తున్నాయి. అది చూసి వెళ్ళి గ్రామస్థులు గుడి గంటను మరింత గట్టిగా వాయించి, శంఖాలను మరింత బలంగా ఒత్తారు. మెస్సువా ఏడ్చింది. బలదేవుడు తన అరణ్యానుభవాలకు చిలవలూ, పలవలూ కల్పించి చెబుతూ, చివరకు తాను, అకేలా వెనక కాళ్ళ మీద నిలబడి మనిషి లాగా మాట్లాడడం స్వయంగా చూశాననే దాకా వెళ్ళాడు.

మౌగ్లీ, రెండు తోడేళ్ళనూ వెంట బెట్టుకుని, మంద సమావేశమయే శిఖరాన్ని చేరే సరికి చంద్రుడు అస్తమించుతున్నాడు. వాళ్ళు శిఖరం పక్కనే వున్న తోడేలమ్మ గుహ వద్ద ఆగారు.

"మనిషి మంద నుంచి నన్ను తరిమేశారమ్మా. షేర్‌ఖాన్ చర్మం తెచ్చాను," అన్నాడు మౌగ్లీ.

తోడేలమ్మ లేచి వచ్చి, చర్మం కేసి తృప్తిగా చూసి, "నీ కోసం వాడొచ్చిన ఆ నాడే ఆ మాట చెప్పారా, కప్పాయ్. మంచి పని చేశావు," అన్నది.

"బాగా చేశావు, తమ్ముడూ. నువు లేక పోతే మా కేమీ తోచలేదు," అంటూ పొదలలో నుంచి బాఘీర వచ్చాడు.

మౌగ్లీ పలకరాతి మీద పులిచర్మాన్ని పరిచి, నాలుగుపక్కలా నాలుగు వెదురు శీలలు గుచ్చాడు. అకేలా వచ్చి దాని మీద పడుకుని, మౌగ్లీని మొదటిసారి తెచ్చినప్పుడులాగే, "చూడండి, తోడేళ్ళలారా! బాగా చూడండి!" అన్నాడు.

అకేలా నాయకత్వం తొలగాక మంద చాలా దెబ్బ తిన్నది. మిగిలిన తోడేళ్ళు అకేలాతో బాటు మౌగ్లీని కూడా తమకు నాయకత్వం వహించమని కోరారు.

"నన్ను మనిషి మంద నుంచీ, తోడేళ్ళ మంద నుంచీ కూడా పంపేశారు. నేను ఒంటరిగానే వేటాడతాను," అన్నాడతను.

—(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 11

మౌగ్లీ మనుషుల చేత వెళ్ళగొట్టబడి అరణ్య జీవితానికి తిరిగి వచ్చి, మంద సమావేశమయే కొండశిఖరం మీద షేర్‌ఖాన్ చర్మం గుచ్చి, తాను ఇకముందు మందతో కలిసి వేటాడననీ, తన నలుగురు తోడే లన్నలతో కలిసి మాత్రమే వేటాడతాననీ, ప్రకటించాడు.

తరవాత అతను తన ఇల్లయిన పాత గుహకు వెళ్ళి ఆ రాత్రీ, మర్నాడు పగలూ నిద్రపోదా మనుకున్నాడు. కాని ఆ కార్య క్రమం అనుకున్నట్టు జరగలేదు. అతను తోడేలమ్మకూ, తోడేలయ్యకూ తన అను భవా లన్నిటినీ వారికి అర్థమయేటంత వరకు చెప్పాడు. షేర్‌ఖాన్ చర్మం వొలవటానికి ఉపయోగించిన కత్తిని వాళ్ళకు చూపాడు. దున్నలమందను షేర్‌ఖాన్ మీదుగా పరి గెత్తించటానికి తా మెలా సహాయపడినదీ చెప్పారు అకేలా, పెద్దన్నా. ఈ కబుర్లు వినటానికి భాలూ కొండ ఎక్కి వచ్చాడు. మౌగ్లీ సాగించిన పోరాటం గురించి వింటూ బాఘీర ఆనందం పట్టలేక ఒళ్ళంగా బరుక్కున్నాడు.

సూర్యోదయం ఎప్పుడో అయింది. కాని ఎవరూ నిద్రపోయే ఆలోచనలో లేరు. ఒక చెంప కబుర్లు సాగుతుంటే మధ్యమధ్య తోడేలమ్మ మోర ఎత్తి, కొండ మీది నుంచి వచ్చే పులిచర్మం వాసన అఘ్రాణించి ఆనందించింది.

అంతా చెప్పి మౌగ్లీ చివరకు. "అకేలా, పెద్దన్నా సహాయం చెయ్యక పోయినట్టయితే నా వల్ల ఏమీ అయి ఉండేది కాదు. అమ్మా, దున్నలు కోనలో దూకుతూ దిగుతున్నప్పుడూ, అవి గ్రామద్వారం కుండా పరిగెత్తుతున్నప్పుడూ చూడకపోతివి!" అన్నాడు.

అట్ట చివరి బొమ్మ



"నీ మీద మనిషిమంద రాళ్ళు విసిరి నప్పుడా? నా బిడ్డలను అలాటి పనులు చేసి, నక్కలను తరిమినట్టు తరిమితే నే నూరుకుంటానా? ఆ మనిషి మంద నంతా వధ చేసి ఉండేదాన్ని—నీకు పాలిచ్చిన ఆ ఆడకూతుర్ని మాత్రం వదిలిపెట్టే దాన్ని!" అన్నది తోడేలమ్మ.

తోడేలయ్య బద్ధకంగా, "చాల్లేవే! మన కప్పాయ్ మళ్ళీ తిరిగి వచ్చాడు, చాలు. ఎంత తెలివి సంపాదించుకొచ్చాడు! మనుషుల ఊసెత్తమాకు!" అన్నాడు.

"మనుషుల ఊసెత్తమాకు," అన్నారు భాలూ, బాఘీరలు కూడా.

మౌగ్లీ తోడేలమ్మ డొక్క మీద తల ఆనించి, తృప్తిగా చిరునవ్వు నవ్వుతూ, తాను ఇక మీద మనుషులను చూడననీ, వాళ్ళ కంఠస్వరం విననసీ, వాళ్ళతో ఎలాటి సంబంధమూ పెట్టుకోననీ అన్నాడు.

"ఒకవేళ వాళ్ళే నీతో సంబంధం పెట్టుకుంటే ఏంచేస్తావు, బుల్లితమ్ముడూ?" అని అకేలా అడిగాడు.

"మేము అయిదుగురం ఉంటాం!" అన్నాడు పెద్దన్న.

"ఆ వేటలో ఒక వేళ మనము కూడా ఉంటామేమో!" అన్నాడు బాఘీర తోక జోరుగా ఆడిస్తూ, భాలూ కేసి చూసి. తరవాత అకేలా కేసి తిరిగి, "ఇప్పుడు నీకు మనుషుల ఆలోచన ఎందుకు వచ్చింది, అకేలా?" అని అడిగాడు.

"ఎందుకా? చెబుతా విను," అంటూ అకేలా ఈ విషయం బయట పెట్టాడు:

మౌగ్లీ పులిచర్మాన్ని కొండ మీద గుచ్చినాక, అకేలా గ్రామం దాకా వెళ్ళి, అరణ్యవాసులు ఉపయోగించే మార్గం తెలియ రాకుండా చెరిపేసి వచ్చాడు. ఇంతలో గబ్బిలం చెట్ల మధ్యగా ఎగురుతూ వచ్చి, "మనిషిమంద ఉండే గ్రామం తేనెపట్టులాగా హడావుడిగా ఉంది," అన్నాడు.

"నువ్వు ఏం చూశావేం?" అని అకేలా అడిగాడు.

"గ్రామ ద్వారం దగ్గిర ఎర్ర పువ్వు పూసింది. దాని చుట్టూ మనుషులు తుపాకులు పట్టుకు కూర్చున్నారు," అన్నాడు గబ్బిలం.

అకేలా ఈ సంగతి చెప్పి, "మనుషులు సరదా కోసం తుపాకులు చేత బట్టరు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. చూస్తూండు, బుల్లితమ్ముడూ! త్వరలోనే మనిషి తుపాకీతో సహా మన దారి పట్టి రాబోతాడు—వస్తున్నాడేమో కూడానూ!" అన్నాడు.

"ఎందుకని? మనుషులు నన్ను వెళ్ళగొట్టారు గద! వాళ్ళ కింకేం పని?" అన్నాడు మౌగ్లీ కోపంగా.

"బుల్లితమ్ముడూ, నువ్వు మనిషివి. నీ జాతివాళ్ళు ఏం చేస్తారో, ఎందుకు చేస్తారో నీకే తెలియాలి!" అన్నాడు అకేలా.

మరుక్షణం మౌగ్లీ కత్తి మెరిసి నేలలో దిగబడింది. అకేలా చప్పున తన కాలు లాగేసి వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు.

"ఈసారి నన్నూ, మనుషుల్నీ కలిపి మాట్లాడేవు!" అన్నాడు మౌగ్లీ.

"ఫ్! మహా వాడి కోర!" అన్నాడు అకేలా, నేలలో కత్తి దిగబడిన చోటు



మూచూసి. "మనుషుల మధ్య ఉండి నీ దృష్టి మందగించింది, తమ్ముడూ. నువ్వు కత్తితో పొడిచే లోపల నేను ఏకంగా జింకనే పట్టి ఉందును."

బాఘీర చప్పున లేచి నిలబడి మోర సాగినంత ఎత్తు చాచి, మూచూసి, కొయ్య బారినట్టయి పోయాడు. పెద్దన్న బాఘీర ఎడమ పక్కకు చేరి, తాను కూడా అలాగే చేశాడు. అకేలా గాలికి యాభైగజాలు ఎదురు పరిగెత్తి తాను కూడా బిగుసుకు పోయాడు. వాళ్ళకు గల ఘ్రాణశక్తి మౌగ్లీకి ఏనాడూ లేదు. అతని కున్నది మామూలు మనుషుల కున్నదాని కన్న హెచ్చే అయినా,

మూడుమాసాలు మనుష్యుల మధ్య ఉండి పొగ కలిసిన గాలి పీల్చటంతో కొంత మందగించింది.

"బలదేవుడు. మన దారి పట్టి వస్తున్నాడు. అదుగో అతని తుపాకీ మెరుపు," అన్నాడు మౌగ్లీ కూచుంటూ.

"మనుషులు వస్తారని నాకు ముందే తెలుసు," అన్నాడు అకేలా.

మౌగ్లీ అన్నలు నలుగురూ పొట్టల మీద పాకుతూ కొండ దిగి వెళ్ళి పొదల కింద అదృశ్య మయారు.

"మీ రెక్కడికి?" అని మౌగ్లీ కేక పెట్టాడు.

"శ్! మధ్యాన్నం లోపున వాడి పుర్రె దొర్లించు కొస్తాం," అన్నాడు పెద్దన్న.

"వెనక్కు రండి! మనిషి మనిషిని తినడు," అన్నాడు మౌగ్లీ.

"ఇంతకు ముందు తోడేలు నన్నవారెవరు? మనిషి అన్నందుకు నన్ను కత్తితో పొడవబోయిన దెవరు?" అని అకేలా ఎద్దేవా చేశాడు.

అన్నలు అయిష్టంగా తిరిగి వచ్చేశారు.

"నేను చేసే ప్రతిదానికీ సంజాయిషీ చెప్పుకోవాలా?" అన్నాడు మౌగ్లీ రౌద్రంగా.

"అదే మనిషంటే! మనిషి మాటంటే! ఉదయపూరులో బోనుల దగ్గిర మనుషులిలాగే మాట్లాడేవాళ్ళు," అని బాఘీర తనలో తాను గొణుక్కుని, పైకి గట్టిగా, "ఈ సారి మనిషికూన చెప్పేది నిజం. మనుషులు మందగా వేటాడతారు. మిగిలిన వాళ్ళందరూ ఏం చేస్తారో తెలుసుకోకుండా వారిలో ఒకణ్ణి చంపటం చేతగాని వేట అవుతుంది. ఆ మనిషి ఉద్దేశం ఏమిటో ముందు తెలుసుకుందాం," అన్నాడు.

"మేము రాం, నువొక్కడివే వేటాడుకో, తమ్ముడూ. ఈ పాటికి వాడి పుర్రె మాకు దొరికి ఉండేది," అన్నాడు పెద్దన్న.

—(ఇంకా వుంది)





# అరణ్యపురాణం

## 12

మౌగ్లీ తన మిత్రు లందరినీ చూశాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అతను తన అన్నలను సమీపించి, ఒక కాలి మీద మోకరించి, "ఏం చెయ్యాలో నాకు తెలి యదా? నా కేసి ఒకసారి చూడండి!" అన్నాడు. వాళ్ళు అతని కేసి చూడలేక పోయారు. "చెప్పండి, మన అయిదుగురిలో నాయకు డెవరు?" అని మౌగ్లీ వాళ్ళ నడిగాడు.

"నువే, బుల్లితమ్ముడూ," అంటూ పెద్దన్న మౌగ్లీ పాదం నాకాడు.

"అయితే నా వెంట రండి," అంటూ మౌగ్లీ దారితీశాడు. మిగిలిన నలుగురూ తోకలు ముడిచి అతని వెనకాలే నడిచారు.

"అరణ్య శాసనాన్ని మించిన శాసనా లొచ్చాయి, భాలూ," అంటూ బాఘీర వాళ్ళ వెనకగా బయలుదేరాడు.

మౌగ్లీ నిశ్శబ్దంగా, బలదేవుడు వచ్చే దారికి అడ్డంగా దారితీసి కొంత దూరం వెళ్ళాడు. అతను పొదలను చేతితో అడ్డం తొలగించే సరికి, భుజాన తుపాకీ పెట్టుకుని బలదేవుడు వస్తూ కనబడ్డాడు.

మౌగ్లీ గ్రామం నుంచి వచ్చేటప్పుడు షేర్‌ఖాన్ చర్మం బరువు మోస్తూ ముందు నడిచాడు. అకేలా, అన్నా అతని వెనకగా నడిచారు. ముగ్గురి పాదాల గుర్తులూ స్పష్టంగా తెలిశాయి. అయితే అకేలా ఆ గుర్తులను కలగాపులగం చేసిన చోటికి చేరేసరికి బలదేవుడికి అయోమయమై పోయింది. ఆ ముసలాడు ఒక చోట కూర్చుని దగ్గి, గొంతు సవరించుకుని, దారి కోసం అటూ ఇటూ చూడసాగాడు. రాయి వేటు దూరంలో తనను పన్నెండుకళ్ళు గమనిస్తున్న సంగతి బలదేవు డెరగడు.

అట్ట చివరి బొమ్మ



కావాలంటే తోడేలు ఎంత నిశ్శబ్దంగా నైనా మసలగలదు. తోడేళ్ళ దృష్టిలో మౌగ్లీకి ఆశక్తి లేకపోయినా, అతను కూడా నీడ కదిలినంత నిశ్శబ్దంగా కదల గలడు. మౌగ్లీ, తోడేలన్నలూ బలదేవుడికి అయిదు పక్కలా చేరి యథేచ్ఛగా మాట్లాడుకున్నారు. వాటి కంఠధ్వని మనిషికి వినిపించదు.

బలదేవుడు ముందుకు వంగి, తొంగి తొంగి చూస్తూ, ఏదో గొణిగాడు.

"ఏమి టంటాడు, వాడు?" అన్నాడు పెద్దన్న మౌగ్లీతో.

"తన చుట్టూ తోడేళ్ళమంద నృత్యం చేసినట్టున్నదిట. ఇటువంటి జాడ తన జన్మలో ఎన్నడూ చూడలేదుట. తనకు ఎగరొప్పుగా ఉందిట," అన్నాడు మౌగ్లీ.

"జాడ చిక్కే లోపల ఎగరొప్పు దిగి పోతుందిలే. ఏమిటా బక్కవాడు చేస్తున్న పని?" అని బాఘీర అడిగాడు.

"ఏముంది? తినటమో పొగ పీల్చ టమో. మనుషుల నోళ్ళు క్షణం ఊరుకోవు," అన్నాడు మౌగ్లీ, బలదేవుడు తన పైపులో పొగాకు దట్టించటం చూసి.

అవసరమైతే బలదేవుణ్ణి పసిపట్టడం కోసం అందరూ ఆ పొగాకు వాసన మూ చూశారు.

ఇంతలో కొందరు బొగ్గుల వాళ్ళు అటుగావచ్చి, బలదేవుణ్ణి పలకరించారు. ఎందుకంటే, ఇరవైమైళ్ళ కైవారంలో బల దేవుడికి గొప్ప వేటగాడుగా ఖ్యాతి ఉన్నది. అందరూ కూచుని పొగతాగుతూంటే, బల దేవుడు వాళ్ళకు మౌగ్లీ అనే రాకాసి పిల్ల వాడి కథను, అనేక కల్పనలతో చెప్పాడు; ఇదంతా చూడటానికి బాఘీర మొదలైన వాళ్ళు మరింత దగ్గిరగా జరిగారు. షేర్ ఖాన్‌ను నిజంగా చంపినది బలదేవుడేట. అప్పుడు మౌగ్లీ తోడేలుగా మారిపోయి, గంటల తరబడి బలదేవుడితో హోరా హోరి పోరాడి, మళ్ళీ మనిషిగా మారి

పోయి, బలదేవుడి తుపాకికి మంత్రం వేశా డట. మంత్రం వేసే సరికి, మౌగ్లీకి గురి పెట్టిన తుపాకీ గుండు కాస్తా పక్కకు తిరిగి పోయి, బలదేవుడి గేదెనే కొట్టిందట. సీయోనీలో బలదేవుడి లాటి గుండెధైర్యంగల వేటగాడు మరి లేడుగదా అని, గ్రామస్థు లంతా కలిసి, మౌగ్లీని చంపి రమ్మని అతన్ని పంపారట. అంతటితో ఊరుకున్నారా? ఆ గ్రామస్థులు ఈ రాకాసి పిల్లాడి తల్లినీ, తండ్రినీ—అంటే, మెస్సువానూ, ఆమె భర్తనూ—వాళ్ళ గుడిసెలోనే ఖైదు చేసేశారట. చిత్ర హింసలు పెట్టి వాళ్ళ చేత నిజం చెప్పించి—అంటే వాళ్ళు కూడా మాయలూ మంత్రాలూ నేర్చిన వాళ్ళేనని ఒప్పించి—ఆ తరవాత సజీవంగా దహనం చెయ్యబోతున్నారట.

"ఎప్పుడు జరుగుతుంది, బాబయ్యా, ఈ సజీవ దహనం?" అని బొగ్గులవాళ్ళు అడిగారు. ఈ వినోదం కళ్ళారా చూడాలని వాళ్ళ ఆశ.

"ముందీ అడివి వెధవ చావాలి. అందు చేత, నేను తిరిగి వెళ్ళేదాకా జరగదు," అన్నాడు బలదేవుడు. వాళ్ళను తగలేసి నాక, వాళ్ళ పొలాలూ, గేదెలూ ఊళ్ళో వాళ్ళు పంచుకుంటారనీ, మెస్సువా భర్తకు



దివ్యమైన గేదెలున్నాయనీ కూడా బలదేవుడు చెప్పాడు. "అయితే, బాబయ్యా, ఈ మాట ఇంగిలీషు వాళ్ళకు తెలిస్తే చిక్కేనేమో? ఆ ఇంగిలీషు వాళ్ళకు మతీసుతీ లేదుటగా? వాళ్ళు మాయదార్లని మంచిగా తగలెట్టినా ఊరుకోరంటారే?" అన్నారు బొగ్గుల వాళ్ళు.

"దాని కే ముందిలే? మెస్సువా, ఆమె మొగుడూ పాము కరిచి చచ్చారని గ్రామాధికారి రిపోర్టు రాసేస్తాడు. ఆ ఏర్పాటంతా ఏనాడో అయింది. మిగిలి ఉన్నదల్లా ఈ రాకాసి పిల్లాణ్ణి చంపటమే. అలాటి వాడు మీకేమైనా కనిపించాడా?" అన్నాడు బలదేవుడు.

బొగ్గుల వాళ్ళు భయంగా చుట్టూ కలియజూసి, "దేవుడి దయవల్ల మేం చూడలేదు. కాక పోయినా, బాబయ్యా, నీ బోటి ధైర్యశాలికి వాడు కనిపించ కెక్కడికి పోతాడులే! మేం మీ గ్రామానికి పోయి ఆ మాయలమారి దాన్ని చూస్తాం," అన్నారు.

"ఆ రాక్షసివెధవను చంపటం నా తక్షణ కర్తవ్యమే ననుకోండి. అయినా మీ లాంటి నిరాయుధులు తోడు లేకుండా అడవి దాటటం అంత క్షేమం కాదు. ఆ తోడేలు పిశాచం ఏ క్షణాన అయినా మీ ముందు ప్రత్యక్షం కావచ్చు. అందుచేత నేను మీ వెంట వస్తాను. ఆ రాక్షసివెధవ గాని ఎదురు పడ్డట్టాయెనా, సీయోనీలో కెల్లా గొప్ప వేటగాడైనవాడు ఆ పరిస్థితిలో ఏం చేస్తాడో మీరు కళ్ళారా చూడవచ్చు. నాకు ఎలాటి అపాయమూ రాకుండా ఆ బ్రాహ్మడు మహత్తరమైన తాయెత్తు ఒకటి నా కిచ్చాడుగా," అన్నాడు బలదేవుడు.

"ఏమిటంటాడు? ఏమిటంటాడు? ఏమిటంటాడు?" అని తోడేళ్ళు క్షణక్షణమూ అడుగుతూనే ఉన్నారు. మౌగ్లీ వాళ్ళకు తాను వినేదంతా చెప్పాడు. మాయలమారి అనే దేమిటో అతనికి అంతు చిక్కలేదు. తనను పోషించిన భార్యాభర్తలు బోనులో పడ్డారని అతను వాళ్ళకు చెప్పాడు.

"మనిషికి మనిషి బోను పెట్టటమా?" అన్నాడు బాఘీర.

"ఏమో మరి, అలాగే అంటున్నాడు. నా కా సంభాషణ పూర్తిగా అర్థంకావటం లేదు. మెస్సువాకూ, ఆమె భర్తకూ నాతో ఏం సంబంధమని వాళ్ళను బోనులో బంధించినట్టు? ఎర్రపువ్వు ప్రసక్తి ఎందుకొస్తున్నది? ఏమైనా బలదేవుడు తిరిగి వెళ్ళిన దాకా మెస్సువాను ఏమీ చెయ్యరుట. కనక—" అంటూ, మౌగ్లీ తన కత్తి పిడిని వేళ్ళతో నిమురుతూ తీవ్రంగా ఆలోచించాడు. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 13

బలదేవుడూ, బొగ్గులవాళ్ళూ ఒకరి వెనక ఒకరుగా బారులో నడుస్తూ వెళ్ళిపోయారు.

"నేను వెంటనే మనిషిమందను చేరాలి," అన్నాడు మౌగ్లీ చివరకు.

"మరి వీళ్ళ మాటేమిటి?" అన్నాడు పెద్దన్న, వెళ్ళిపోతున్న బొగ్గులవాళ్ళ కేసి ఆకలిగా చూస్తూ.

"చీకటి పడే దాకా వాళ్ళు గ్రామ ద్వారం చేరకుండా నువ్వు ఆపగలవా?" అన్నాడు మౌగ్లీ.

"వాళ్ళను గానుగెద్దుల్ని తిప్పినట్టు గుండ్రంగా ఒకే దారిలో నడిపించమంటే నడిపించనూ?" అన్నాడు పెద్దన్న.

"అదేమీ అవసరం లేదు గాని, కాస్త పాట పాడి కొంచెం ఉత్సాహం ఇస్తే చాలు. పాట అటే ఇంపుగా ఉండ పనిలేదు. బాఘీరా, నువు కూడా వాళ్ళ వెంట ఉంటావు కదూ? చీకటి పడ్డాక నన్ను గ్రామం సమీపంలో కలవండి. ఆ చోటు పెద్దన్నకు తెలుసు," అన్నాడు మౌగ్లీ.

అరణ్యం కుండా పరిగెత్తుతూ మౌగ్లీ తన ముందు నడిచే నలుగురు బొగ్గుల వాళ్ళనూ, భుజాన పెట్టుకున్న తుపాకీ గొట్టం అన్నివైపులకూ ఊపుకుంటూ నడిచే బలదేవుణ్ణీ చూశాడు. అతని వెనకనుండి అతని మిత్రులు "పాట" ప్రారంభించారు. బాఘీర తల వంచి అరణ్యమంతా దద్దరిల్లే టట్టు పెడబొబ్బ పెట్టాడు. అన్నలు వెయ్యి తోడేళ్ళకు సమంగా పెట్టిన కేకలు అరణ్యం అన్ని వైపుల నుంచీ ప్రతిధ్వనించాయి.

బొగ్గులవాళ్ళూ, బలదేవుడూ అదిరి పోయి, ఎండి పోయిన మండలను పెళ పెళా తొక్కుకుంటూ అందిన చెట్లెక్కి శారు. బలదేవుడు మంత్రాలు చదివాడు.

అట్ట చివరి బొమ్మ



మౌగ్లీ ఒక్కొక్క మైలే గడిచి ముందుకు పోతున్నాడు. మెస్సువానూ, ఆమె భర్తనూ నిర్బంధం నుంచి తప్పించాలన్న ఆలోచన తప్పిస్తే అతని తలలో మరేదీ లేదు.

మునిమాపు వేళకు అతను పశువులు మేసే బీళ్ళు చేరుకున్నాడు. అతనికి మనిషి జాతి పైన ఆగ్రహం ఉన్నప్పటికీ, గ్రామంలోని ఇళ్ళ కప్పులు చూసే సరికి అతని గుండె గొంతులో కొట్టుకున్నది. ఇవాళ గ్రామస్థులందరూ రోజు కన్న చాలా పెందలాడే పొలాల నుంచి గ్రామానికి తిరిగి వచ్చి వంటలూ, వార్పులూ చూసుకోక, అందరూ చెట్టు కింద చేరి తెగ వాగుతున్నారు.

"ఈ మనుషులకు మనుషులను వేటాడకపోతే తోచదు. నిన్న నన్ను వేటాడారు. ఇవాళ మెస్సువానూ, ఆమె భర్తనూ బోనులో పెట్టారు. రేపు మళ్ళీ నా కోసం ఉచ్చుపన్నుతారు," అనుకున్నాడు మౌగ్లీ.

అతను గోడ వెంబడే పాకుతూ వెళ్ళి, మెస్సువా ఉండే గుడిసె చేరుకుని, కిటికీ కుండా లోపలికి చూశాడు. మెస్సువా నేల మీద పడి ఉన్నది. ఆమె చేతులూ, కాళ్ళూ బంధించి, నోట గుడ్డలు కుక్కారు. ఆమె అతి కష్టం మీద ఊపిరి తీస్తూ, మూలుగుతున్నది. ఆమె భర్తను మంచాని కేసి కట్టారు. ఇంటి తలవాకిలి బంధించి ఉన్నది. దాని బయట ముగ్గురు నలుగురు మనుషులు కాపలా ఉన్నారు.

గ్రామస్థుల అలవాట్లూ, ఆచారాలూ మౌగ్లీకి బాగా తెలుసు. తినటమూ, వాగటమూ, పొగ తాగటమూ సాగినంత కాలమూ వాళ్ళు మరే పనీ తల పెట్టరు. తిండి తిన్నాక వాళ్ళు అపాయకరంగా తయారవుతారు. కొంతసేపటికి బలదేవుడు వచ్చి చేరుతాడు.

మౌగ్లీ కిటికీ కుండా లోపల ప్రవేశించి మెస్సువానూ, ఆమె భర్తనూ కట్లు విప్పి, పాలేమైనా ఉన్నాయేమోనని చూశాడు. అతను చప్పున నోరు ముయ్యకపోతే

మెస్సువా కేక పెట్టి ఉండేదే. ఆమెకు బాధతో మతి సగం పోయి ఉన్నది. ఆ ఉదయం గ్రామస్థు లామెను కర్రలతోనూ, రాళ్ళ తోనూ తీవ్రంగా కొట్టారు. ఆమె భర్త కోపం లోనూ, సంభ్రమంలోనూ ఉన్నాడు.

"నాకు తెలుసు — వస్తాడనుకుంటూనే ఉన్నాను. నిశ్చయంగా నా కొడుకే!" అని వెక్కుతూ, మెస్సువా మౌగ్లీని గట్టిగా కౌగలించుకున్నది. అంతదాకా నిశ్చలంగా ఉన్న తనకు ఒళ్ళంతా వొణుకు పుట్టటం చూసుకుని మౌగ్లీ ఆశ్చర్యపోయాడు.

"ఈ కట్లన్నీ ఏమిటి? వాళ్ళు నిన్నెందుకిలా బంధించారు?" అని అతను అడిగాడు.

"ఇంకెందుకు? నిన్ను నా కొడుకును చేసుకున్నామని మమ్మల్ని చంపటానికి! చూడు, రక్తం!" అన్నాడు మెస్సువా భర్త ఉసడింపుగా.

మెస్సువా ఏమీ అనలేదు. అతను ఆమె గాయాలే పరీక్షించాడు. రక్తం చూసి అతను పళ్ళు కొరకటం భార్యాభర్త లిద్దరికీ వినిపించింది.

"ఇది ఎవరు చేసిన పని? ఈ బాకీ చెల్లు వేసి తీరాలి," అన్నాడు మౌగ్లీ.

"ఊరంతా కలిసే చేశారు. నేను మరీ ధనికుణ్ణి. నాకు మరీ చాలా పశువులున్నాయి.



అందుకని, నీ కాశ్రయం ఇచ్చి అదీ, నేనూ మాయలమారి వాళ్ళ మయాం," అన్నాడు మెస్సువా భర్త.

"నా కేమీ అర్థం కాలేదు. జరిగిన దేమిటో మెస్సువాను చెప్పనీ," అన్నాడు మౌగ్లీ.

"నేను నీకు పాలిచ్చాను, జ్ఞాపకం ఉందా, నత్తూ? ఆ పులి పట్టుకు పోయిన నా కొడుకువు నువు. నువ్వంటే నాకు ప్రాణం. అందుకని, నేను దయ్యానికి తల్లిననీ, చంపెయ్యాలిసిందేననీ అన్నారు, వాళ్ళు," అన్నది మెస్సువా.

"చావంటే ఏమిటో నాకు తెలుసు. దయ్యమంటే ఏమిటి?" అని మౌగ్లీ అడిగాడు.

మెస్సువా భర్త తల ఎత్తి విచారంగా చూశాడు. కాని మెస్సువా నవ్వి, తన భర్తతో, "చూశావా? నే నెరుగుదును. వీడు మాయ దారికాడు—నా కొడుకే!" అన్నది.

"కొడుకో, మాయదారో, ఏమైతే మనకేం వొరిగింది? మనం చచ్చిన వాళ్ళ కింద జమే," అన్నాడు మెస్సువా భర్త.

మౌగ్లీ కిటికీలో నుంచి చూపిస్తూ, "అదే అరణ్యానికి దారి. మీ కాళ్ళకూ, చేతులకూ స్వేచ్ఛ వచ్చింది. వెళ్ళిపొండి," అన్నాడు.

"నీకు తెలిసినట్టుగా మాకు అరణ్యం తెలీదురా, బాబూ. నే నెక్కువ దూరం నడవగలనని తోచదు," అన్నది మెస్సువా.

"అదీగాక ఊళ్ళో ఉన్న ఆడా మగా మా మీద విరుచుకుపడి, మమ్మల్ని తిరిగి తెస్తారు," అన్నాడు ఆమె భర్త.

మౌగ్లీ తన కత్తి మొనతో అరిచేతిని గీరుతూ, "ఎవరినీ ఏమీ చెయ్యాలనే ఉద్దేశం నాకు లేదులే — ఇప్పుడప్పుడే! అయినా మిమ్మల్ని ఎవరూ అడ్డగిస్తారను కోను. అదీగాక, త్వరలోనే వాళ్ళకు బోలె డంత ఇతర పని తగులుతుంది," అని అతను తల ఎత్తి, వెలపల కోలాహలం ఆల కించి, "ఓహో, మా వాళ్ళు బలదేవుణ్ణి వదిలేశారన్నమాట!" అన్నాడు.

"నిన్ను చంపమని ఉదయం అతన్ని పంపారు. నీకు కనిపించాడా ఏం?" అన్నది మెస్సువా ఆదుర్దాగా.

"ఆ, కనిపించాడు. అతనొక విచిత్రమైన కథతో వచ్చి ఉంటాడు. ఆ కథ పూర్తి అయేలోపుగా మనం చెయ్యవలిసింది బోలె డున్నది. నేను వెళ్ళి జనం ఏం చెయ్య దలిచారో తెలుసుకుని వస్తాను. ఈలోగా మీరు ఎక్కడికి వెళ్ళదలిచినదీ నిశ్చయించు కుని, నాకు చెప్పండి," అని మౌగ్లీ బయటికి పోయి, గ్రామప్రాకారం వెంబడి పాకుతూ, చెట్టు కింద జనం చెప్పేది వినిపించే దూరంలో ఆగాడు. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 14

బలదేవుడు నేల మీద పడుకుని దగ్గుతూ, మూలుగుతున్నాడు. అందరూ అతని పైన ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అతని జుట్టు భుజాల మీదికి వేళ్ళాడుతున్నది. చెట్టెక్కటంలో అతని చేతులూ, కాళ్ళూ దోక్కుపోయాయి. సరిగా మాట కూడా రావటం లేదు. కాని తన ప్రాముఖ్యం బాగా అర్థం చేసుకున్నాడతను. అతను సూచన ప్రాయంగా భూతాలను గురించీ, దయ్యాల పాట గురించీ, ఇంద్రజాలం గురించీ పొడి మాటలు చెప్పి, వినేవాళ్ళ ఆసక్తిని తెగ రెచ్చగొట్టి, చివరకు మంచినీళ్ళు అడిగాడు.

మౌగ్లీ, "బలదేవుడి కథ చెవుల్లో వేసుకున్నదాకా మెస్సువాకు కాపలా ఉండే పని ఎవరికీ పట్టదు," అనుకుని, గుడిసెకు తిరిగి వచ్చాడు. అతను కిటికీ దగ్గరికి చేరుకునే సరికి, అతని కాలిని ఎవరో నాకినట్టయింది. అతనికి తోడేలమ్మ స్పర్శ బాగా తెలుసు.

"నువా, అమ్మా? ఇక్కడేం చేస్తున్నావు?" అన్నాడతను.

"బిడ్డలు అరణ్యంలో పాటలు పాడటం వినపడింది. నా కప్పాయిని వెతుక్కుంటూ వచ్చాను. సరే కాని, నీకు పాలిచ్చిన ఆ ఆడ మనిషిని ఒకసారి చూడాలనుందిరా," అన్నది తోడేలమ్మ.

"ఆమెను కట్టి బంధించి, చంపటానికి సిద్ధం చేశారు. నేను కట్లు కోసేశాలే. ఆమే, ఆమె మొగుడూ అరణ్య మార్గాన వెళ్ళిపోతారు," అన్నాడు మౌగ్లీ.

"సరే, నేనూ వెంట వస్తాను. పెద్దదాన్నయాననుకో, ఇంకా పళ్ళూడలేదుగా!" అంటూ తోడేలమ్మ వెనక కాళ్ళ మీద లేచి, కిటికీ కుండా లోపల చీకట్లోకి చూసింది.

అట్ట చివరి బొమ్మ



మౌగ్లీ తిరిగి కిటికీ కుండా లోపల ప్రవేశించి, "ప్రస్తుతం అందరూ బలదేవుడి చుట్టూ మూగి ఉన్నారు. వాడు చెప్పే భూతప్రేతాలకథలు పూర్తికాగానే వాళ్ళు నిప్పు తెచ్చి మిమ్మల్ని తగలేస్తారుట. ఆ తరవాత?" అన్నాడు.

"నేను మా అయనతో మాట్లాడాను. ఖాన్హివారా ఇక్కడికి ముప్పై మైళ్ళు. అక్కడ మాకు ఇంగ్లీషు వాళ్ళు తగల వచ్చు—" అన్నది మెస్సువా.

"వాళ్ళేజాతి మంద?" అన్నాడు మౌగ్లీ.

"నాకు తెలీదు. తెల్లగా ఉంటారుట. దేశమంతా ఏలుతున్నారుట. ఈ రాత్రి అక్కడికి చేరామా, బతుకుతాం. లేకపోతే చస్తాం," అన్నది మెస్సువా.

"అయితే బతకండి. ఈ రాత్రి నర మానవుడన్నవాడు గ్రామద్వారం దాటడు.... అయన ఏమిటి చేస్తున్నాడు?" అని మౌగ్లీ అడిగాడు. మెస్సువా భర్త మోకరించి కూర్చుని, గుడిసెమూల తవ్వుతున్నాడు.

"దాచుకున్న డబ్బు. ఇంకేమీ వెంట పట్టుకుపోలేం," అన్నది మెస్సువా.

మెస్సువా భర్త మౌగ్లీ కేసి చూసి, "ఈ డబ్బుతో ఒక గుర్రం కొనవచ్చు. ఇంకో గంటలో గ్రామస్థులు వెంట తగులుతారు," అన్నాడు.

"నేను తలుచుకున్నదాకా వాళ్ళు మీ వెంట పడరని నేను చెబుతున్నాను. అయినా గుర్రం ఆలోచన మంచిదే. మెస్సువా డస్సి ఉన్నది," అన్నాడు మౌగ్లీ.

మెస్సువాభర్త రూపాయలన్నీ తీసుకుని, లేచి నిలబడి, వాటిని తన బొడ్డులో దోపుకున్నాడు. మౌగ్లీ మెస్సువాను పట్టుకుని, కిటికీ కుండా బయటికి రప్పించాడు. బయటి చల్లని గాలికి ఆమె ప్రాణం లేచి వచ్చింది.

"ఖాన్హివారాకు దారి తెలుసునా?" అని మౌగ్లీ రహస్యంగా అడిగాడు. వాళ్ళు తెలుసునన్నట్టు తలలు ఆడించారు.



"భేష్, మీకు వచ్చిన భయమేమీలేదు. తాపీగానే వెళ్ళండి. అయితే ఒకటి—మీకు ముందూ, వెనకా కొంత పాట వినిపించ వచ్చు," అన్నాడు మౌగ్లీ.

"ప్రాణాలతో మమ్మల్ని తగలబెట్టేస్తారన్న భయమే లేకపోతే ఈ నిశిరాత్రివేళ అరణ్యంలోకి అడుగుపెట్టే వాళ్ళ మనుకుంటున్నావా? మనుషుల చేతిలో చచ్చే కన్న క్రూరమృగాల చేత చావటం నయం," అన్నాడు మెస్సువాభర్త.

"నేను చెబుతున్నానుగద, అరణ్యంలో మీకు ఎలాటి ప్రమాదమూ జరగదు. ఖాన్హివారా కనుచూపు మేరలోకి వచ్చేదాకా మీకు రక్షణ ఉంటుంది; ఒక మనిషి భయంగాని, జంతువు భయంగాని ఉండదు, నింపాదిగా వెళ్ళండి. ద్వారం మూసే ఉన్నది," అన్నాడు మౌగ్లీ.

మెస్సువా మౌగ్లీ కాళ్ళమీద పడింది. మౌగ్లీ శరీరం ఒక్కసారి జలదరించింది. అతను ఆమెను లేవనెత్తాడు. మెస్సువా అతని మెడ వాటేసుకుని, వైన వైనాలుగా దీవించింది.

ఆమె భర్త తన పొలాల కేసి ఈర్ష్యగా చూస్తూ, "మనం ఖాన్హివారా చేరి, ఇంగ్లీషు వాళ్ళతో మాట్లాడాలేగాని, బ్రాహ్మడి మీదా, బలదేవుడి మీదా ఎలాటి వ్యాజ్యం తెస్తానంటే, గ్రామమంతా దివాలా తీయవలిసిందే. నా పొలాల మీద రాని ఫలసాయానికీ, తిండికి మాడిన నా గేదెలకూ రెట్టింపు విలవ రాబట్టనూ. నాకు గొప్ప న్యాయం జరుగుతుంది," అన్నాడు.

మౌగ్లీ నవ్వి, "న్యాయమంటే ఏమిటో నాకైతే తెలీదుగాని, వచ్చే తొలకరికి వచ్చి, ఇక్కడ ఏం మిగులుతుందో మీరే చూడండి," అన్నాడు.

వాళ్ళు అరణ్యం కేసి బయలుదేరారు. తోడేలమ్మ తాను దాక్కున్న చోటునుంచి చెంగున దూకింది.

"వీళ్ళ వెంట వెళ్ళు. ఈ ఇద్దరికీ ఏ అపాయమూ రాగూడదని అరణ్యమంతకూ తెలుపు. అవసరమైతే కేకలు వెయ్యి. బాఘీరను పిలవటం మంచిది," అన్నాడు మౌగ్లీ తోడేలమ్మతో.

ఒక దీర్ఘమైన కూత క్రమంగా హెచ్చి మళ్ళీ తగ్గింది. మెస్సువా భర్త ఆ కేక వింటూనే ఉలిక్కిపడి చూసి, ఇంటికి పరిగెత్తే వాలకం కనబరిచాడు.

"పదండి, పదండి. కొద్దిగా పాట ఉంటుందని చెప్పానుగద. ఖాన్హివారా దాకా మీకీ పాట వినిపిస్తూనే ఉంటుంది, అది అరణ్యం యొక్క అభయం," అన్నాడు మౌగ్లీ.

మెస్సువా తన భర్తను తొందరచేసి ముందుకు నడిపించింది. వాళ్ళతోబాటు తోడేలమ్మ కూడా చీకటిలో అదృశ్యమయింది. ఆ క్షణంలోనే బాఘీర, ఎప్పుడక్కడికి వచ్చాడో ఏమో, మౌగ్లీ కాళ్ళ దగ్గిర ప్రత్యక్షమయాడు.

"అన్నలు నలుగురూ ఏరీ? ఈ రాత్రి ఒక్క మనిషి కూడా గ్రామద్వారం దాటి పోరాదు," అన్నాడు మౌగ్లీ.

"దానికి నేను చాలనా, తమ్ముడూ?" అన్నాడు బాఘీర.

"ఆ చెట్టు కింద సంభాషణ ఎంతకూ తేలకుండా ఉంది. వాళ్ళు గుడిసెకు వచ్చి ఆ భార్యాభర్తలను తగలబెట్టటానికి చాలా తొందరపడుతున్నారు. వాళ్ళు వచ్చి చూసేసరికేముంటుందీ? గుడిసె ఖాళీ! ఆహాహా!" అంటూ మౌగ్లీ నవ్వాడు.

"వాళ్ళు వచ్చేసరికి నన్నిక్కడ ఉండనీ, తమ్ముడూ. నన్ను చూశాక ఎవరూ ఇళ్ళు దాటి రారు. నన్ను తాళ్ళతో కట్టెయ్యరులే," అంటూ బాఘీర గుడిసెలో దూరాడు. బాఘీర మంచం మీద పడుకుని మౌగ్లీని కూడా తన పక్కన కూర్చోమన్నాడు. కాని మౌగ్లీ మనుషుల కంట పడదలచలేదు.

—(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 15

ఊరి చివర చెట్టు కింద సమావేశమైన జనం యొక్క కోలాహలం అంతకంతకూ హెచ్చి పోతున్నది. అది అట్టహాసంగా పెడబొబ్బలతో ముగిసింది. కర్రలూ, బొంగులూ, కొడవళ్ళూ, కత్తులూ పట్టుకున్న స్త్రీలూ, పురుషులూ, బలదేవ, పూజారీల వెంట వీధివెంబడి బయలుదేరి మెస్సువా వాళ్ళ ఇంటికి వచ్చారు.

గుడిసె తలుపు కొంచెం చిక్కుపెట్టి, తెరుచుకోలేదు. జనం తలుపు పడతన్నారు. కాగడాల వెలుగు గుడిసెలో ప్రసరించింది. మంచం మీద నల్లగా బాఘీర, పంజాలు మంచంపట్టె మీదుగా వేళ్లాడవేసి, పడుకుని ఉండటం కనబడింది. ఒక్క అరనిమిషం పాటు నిశ్శబ్దం. ముందుండిన జనం ప్రాణాల కోసం పెనగులాడుతూ, వెనక ఉన్నవాళ్లను తోసుకుని బయటపడ యత్నించారు. ఈ అరనిమిషం లోపల బాఘీర తలయెత్తి, నోరంతా తెరిచి, తాపీగా, తృప్తిగా ఆవలించాడు.

మరుక్షణం వీధిలో ఒక్క పురుగు లేదు. బాఘీర కిటికీలో నుంచి బయటికి దూకి మౌగ్లీ చెంత నిలబడ్డాడు.

"ఇక తెల్లవారితే గాని వాళ్లు ఇళ్ళనుంచి బయటికి రారు. ఇప్పు డిక ఏమిటి?" అన్నాడు బాఘీర.

"మంచిపని చేశావు. తెల్లవారిన దాకా వాళ్ళను ఒక కంట కనిపెట్టి ఉండు. నేను నిద్రపోవాలి," అని మౌగ్లీ అరణ్యంలోకి పరిగెత్తి, ఒక చట్టాయి పైన పడుకుని గొడ్డు నిద్రలో పడ్డాడు. అతను ఆ రాత్రీ, తరవాత పగలూ అలాగే నిద్రపోయి, తిరిగి రాత్రి అయాక లేచాడు. అతను లేచేసరికి అతని పక్కన బాఘీర ఉన్నాడు.

అట్ట చివరి బొమ్మ



బాఘీర నివ్వెరపోయి, "ఆయన అరణ్యా నికి అధిపతి. మనం రా, పో అనటం భావ్యంగా ఉంటుందా?" అన్నాడు.

"ఒక్క మాట చెవిని వేశావంటే ఆయన తప్పక వస్తాడు. ఆ మాట ఏమిటంటే— భరత్‌పూర్ పొలాల దాడి. ఆ మాట చెప్పి రమ్మను, తప్పక వస్తాడు," అన్నాడు మౌగ్లీ.

బాఘీర, హాథీ ఏనుగునూ, అతని కొడుకు లనూ వెతుక్కుంటూ వెళ్ళాడు. మౌగ్లీ రమ్మన్నాడని చెబితే హాథీకి ఆగ్రహం రావచ్చు, అంతకంటె ఇంకేం జరుగుతుందీ?

మౌగ్లీ రక్తం ఉడికిపోతున్నది. అత నెన్నడూ మనిషిరక్తం వాసన చూసినవాడు కాడు. అలాటివాడు మెస్సువా రక్తం వాసన చూసి చీదరించుకున్నాడు. అతనిలో ప్రేమ భావం అంటూ ఏమైనా ఉంటే మెస్సువా పైన మాత్రమే ఉన్నది. ఆమెను తాళ్ళతో బధించినందుకు మానవుల పైన పగ తీర్చు కోవాలి. అందుకు హాథీ సహాయం అవ సరం. బలదేవుడు చెప్పిన ఒక కథ వల్ల మౌగ్లీకి ఈ ఆలోచన వచ్చింది.

మాటాపలుకూ లేకుండా హాథీ, అతని ముగ్గురు కొడుకులూ మౌగ్లీ ఉన్న చోటికి బాఘీర వెంట వచ్చారు. మౌగ్లీ చాలాసేపు ఏమీ అనక, చివరకు బాఘీర కేసి తిరిగి,

"ఆ మొగుడూ పెళ్ళాలు ఖాన్హివారా కను చూపు మేరలోకి క్షేమంగా చేరారు. తోడే లమ్మ కబురు పంపింది. అర్ధరాత్రి లోపలే వాళ్ళకు గుర్రం దొరికిందిట. ప్రయాణం సుఖంగా సాగిందిట. ఇవాళ బారెడు పొద్దె క్కినదాకా గ్రామంలో ఉండే మనిషిమంద ఇళ్ళు కదల్లేదు," అన్నాడు బాఘీర.

మౌగ్లీ ఏదో ఆలోచనలో పడ్డాడు. చెట్టు కింద బలదేవుడు చెప్పిన కథలలో ఒకటి అతనికి జ్ఞాపకం వచ్చింది. అతను తల ఎత్తి బాఘీరతో, "హాథీనీ, ఆయన ముగ్గురు కొడుకులనూ ఇక్కడి కొకసారి పిలుచు కొస్తావా?" అన్నాడు.

"నీ కొక గొప్ప ఏనుగు కథ చెబుతాను. చాలాకాలం క్రితం భరత్‌పూర్ వేటగాళ్ళు ఈ ఏనుగును ఒక గుంటలో మాటువేసి పట్టుకున్నారు. అప్పుడా ఏనుగు కాళ్ళలో ఒకటి గుంటలో ఉన్న గుంజ మూలంగా చీరుకుపోయి, తెల్లటి చార ఏర్పడింది. తరవాత వేటగాళ్లు అతన్ని గుంటలో నుంచి పైకి తీసుకు పోదామని వచ్చారు. కాని పరాక్రమం గల ఆ ఏనుగు కట్లు తెంచుకుని పారిపోయాడు. ఆయనకు ముగ్గురు కొడుకు లని జ్ఞాపకం," అన్నాడు.

వెన్నెలలో హాథీ అటూ ఇటూ మసిలే టప్పుడు అతని కాలిమీద తెల్లని చార మెరి సింది. మౌగ్లీ హాథీ కేసి తిరిగి, "ఆ పొలాలు నూర్చే తరుణం వచ్చేటప్పటికి ఏం జరిగింది హాథీ?" అని అడిగాడు.

"నేనూ, నా ముగ్గురు కొడుకులూ వాటిని నూర్చాం," అన్నాడు హాథీ.

"తరవాత పొలాల సాగేమయింది?"

"సాగలేదు."

"ఆ పొలాలమీద బతికే వాళ్లేమయారు?"

"పొలాలు వదిలిపెట్టి పోయారు."

"వాళ్ళ ఇళ్ళు?"

"వాటి కప్పులను మేం పీకేశాం. మట్టి గోడలను అరణ్యం మింగేసింది. అయిదు



గ్రామాలను అరణ్యంలో కలిపేశాం. ఈ భరత్‌పూర్ పొలాల దాడిని నేనూ, నా కొడుకులూ చేశాం. కాని, మనిషికూనా, నీ కీ కథ యింత వివరంగా ఎలా తెలిసింది?" అని హాథీ అడిగాడు.

"ఒక మనిషి చెప్పగా విన్నాను. ఆ దాడి చాలా బాగా జరిగింది. అలాంటి దాడి మరొకటి ఇప్పుడు జరగాలి. నన్ను వెలి వేసిన మనుషుల మంద ఉండే గ్రామం తెలుసు గదా? ఆ గ్రామాన్ని అరణ్యంలో చేర్చాలి, హాథీ!" అన్నాడు మౌగ్లీ.

"అందుకు చాలా ఆగ్రహం కావాలి. నా కా మనిషి మంద మీద ఆగ్రహం లేదే!

ఏం చేసేటట్టు?" అన్నాడు హాథీ అను మానంగా.

"అరణ్యంలో శాకాహారివి నువేనా ఏమిటి? పొలాలు నాశనమయ్యేదాకా నువా చాయలకు పోనవసరం లేదు. నీ వాళ్లయిన లేళ్ళనూ, దుప్పులనూ, పందులనూ అటు కేసి పంపు," అన్నాడు మౌగ్లీ.

హాథీ తన కొడుకులతో వెళ్లిపోయాక బాఘీర భయంతో వణికిపోతూ, "అరణ్య ప్రభూ, అవసరం వచ్చినప్పుడు నన్నూ, భాలూనూ కనిపెట్టి ఉండు. నీ ముందు మేము కూనలం!" అన్నాడు.

ఎలా బయలుదేరిందో గాని అరణ్యంలో ఒక పుకారు బయలుదేరింది—ఫలాని లోయలో మంచి మేతా, శ్రేష్ఠమైన నీరూ ఉన్నదట! అటువంటి పుకారు ఊరికే పోదు. అరణ్యంలో ఎక్కడెక్కడో ఉండే అడివి దున్నలూ, లేళ్ళూ క్రమంగా ఒక దిక్కుగా బయలుదేరి మేస్తూ వెళ్ళాయి. వాటిని సరి అయిన మార్గంలో నడిపిస్తూ, ముందుకు పోయే ప్రోత్సాహం ఇచ్చిన జంతువు లెన్నో ఉన్నాయి. అంతా ఒక పథకం ప్రకారం సాగింది. గ్రామానికి పది మైళ్ళ కైవారంలోకి అసంఖ్యాకమైన అరణ్య మృగాలు మేయటానికి వచ్చాయి.

ఒకనాడు గ్రామస్థులు ఉదయం లేచి చూసేసరికి వాళ్ళ పొలాలు లేవు; వాళ్ళ పశువులకు గడ్డిపరకలు లేవు. ఆ రాత్రి ఏవో క్రూరమృగాలు గ్రామం ప్రవేశించి, అక్కడ ఉన్న నాలుగు పొట్టి గుర్రాలనూ చంపేసి పోయాయి. తరవాత ఏనుగులు రంగంలో ప్రవేశించి, ఇళ్ళ కప్పులు లాగేశాయి, మట్టిగోడలను కూలదోశాయి.

అప్పటికీ గ్రామస్థులు వెళ్లిపోవటానికి తాత్సారం చేశారు. ఇంతలో వానలు వచ్చాయి. గ్రామం ఖాళీ అయింది. ఈ విధంగా ఆ గ్రామంలోకి అరణ్యం ప్రవేశించటానికి కృషి ముగిసింది.





# అరణ్యపురాణం

## 16

మౌగ్లీ పసివాడుగా తోడేలమ్మ పెంపకం లోనే ఉండి, భాలూ వద్ద విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే అతనికి మరొక స్నేహితుడు దొరికాడు. ఆ స్నేహితుడు "కావా" అనే సర్పం....

భాలూకు ఎదురుగా కూర్చుని మౌగ్లీ పాఠాలు పప్పజెప్పేటప్పుడు ఎప్పుడైనా బాఘీర వచ్చి, తన తలను ఒక చెట్టుకు ఆనించి, గుర్రుపెడుతూ ఆలకించేవాడు.

మౌగ్లీ మనిషికూన కావటంచేత నేర్చు కోవలసినది చాలా ఉండేది. అతనికి అప్పటికే చెట్లెక్కటమూ, ఈదటమూ పరిగెత్తటమూ చాతనవును. ఒక కొమ్మ పుచ్చుదో కాదో ఎలా తెలుసుకోవాలి? అడవి తేనెటీగలను ఎలా పలకరించాలి? చెట్టు కొమ్మల మీద ఉండే గబ్బిలాయి మాంగ్‌కు నిద్రా భంగం కలిగించినప్పుడే మనాలి? నీటిలో దూకేముందు నీటిపాములకు ఎలాటి హెచ్చరిక ఇవ్వాలి? అన్నిటికన్నా ముఖ్యమైనది, ఇతర ప్రాంతాలలో వేటాడబోయేటప్పుడు అక్కడి వారికి ఏ విధమైన హెచ్చరిక ఇవ్వాలి? అందు కొక వేట కేక ఉన్నది. దాన్ని మనిషిభాషలో చెప్పాలంటే: "నాకు ఆకలిగా ఉన్నది కాబట్టి, వేటాడటానికి అనుమతి ఇవ్వండి," అని అవుతుంది. వేటకేకకు జవాబు కూడా వస్తుంది. దాని అర్థమేమిటంటే: "అయితే ఆహారం కోసం వేటాడు, కాని వినోదం కోసం వేటాడకు."

భాలూ శిక్షణ బాఘీరకు మరీ క్రూరమనిపించినప్పుడు, "ఎందుకు కుర్రవాణ్ణి మరీ అంతగా అరగదీస్తున్నావు?" అనేవాడు.

"నీకు తెలీదు. వీడు మనిషి కూన. మన అరణ్య సూత్రాలు ఒక్కటి కూడా తీరుపోకుండా అన్నీ నేర్చుకోవలసిందే.

అట్ట చివరి బొమ్మ



ఏ తోడేలు కూనో అయితే ఆ దారివేరు; తనకు సంబంధించినవే నేర్చుకుంటాడు, వీడు మనిషికూన!" అన్నాడు భాలూ.

భాలూ శిక్షణపట్ల మౌగ్లీ అప్పుడప్పుడూ అశ్రద్ధ చూపేవాడు. అప్పుడు భాలూ మౌగ్లీ నెత్తిన ఒక మొట్టికాయ వేసేవాడు. మౌగ్లీ అలిగి ఏ చెట్టుకొమ్మల్లోనో కూర్చుని దిగి వచ్చేవాడు కాడు. అయినప్పటికీ భాలూ శిక్షణ చాలా గొప్పది. అరణ్యంలో అనేక భాష లుంటాయి. అన్ని భాషలూ మౌగ్లీకి వచ్చాయంటే అది భాలూ సమర్థతే అనాలి. పాముభాష లాటివి భాలూకు పలకవు. అందుచేత భాలూ మౌగ్లీని హథీ వద్దకు తీసుకుపోయి, ఆయన ద్వారా పాముభాష నేర్పించాడు. "ఇలా అరణ్య భాషలన్నీ నేర్పటంచేత మౌగ్లీకి అరణ్యంలో ఏ జాతి నుంచీ భయం లేదు," అన్నాడు భాలూ.

"తన జాతినుంచి తప్ప," అనుకున్నాడు బాఘీర స్వగతం.

మౌగ్లీ ఒకసారి పెద్ద నేరం చేశాడు. అది భాలూకూ, బాఘీరకూ కూడా సహించ రానిది—అతను కోతులతో నేస్తం కట్టి వచ్చాడు. అది ఎలా జరిగిందంటే, భాలూ చేత మొట్టికాయ తిని మౌగ్లీ చెట్టుకొమ్మ లలో ఎత్తున కూర్చుని ఉండగా చెట్టుమీది నుంచి నల్ల మర్కటాలు దిగివచ్చి, అతని పైన సానుభూతి చూపి, అతనికి కాయలూ, పప్పులూ పెట్టి, చిటారు కొమ్మల మీదికి తీసుకుపోయి, "తోక లేకపోతేనేం? నువు మాకు సోదర జాతీయుడివి. ఎప్పటికైనా మా అందరికీ నాయకుడివి కావలిసిన వాడివి," అన్నారు.

మౌగ్లీ కోతి మూకతో మాట్లాడినట్టు అచూకీ తగలగానే భాలూ క్రోధావేశం వచ్చి, "నువు కోతి మూకతో మాటలు కలిపావా? అంతకన్న అవమానం ఉందా? వాళ్ళకే నియమాలూ లేవు, ఏదైనా తింటారు. కోతు లకు సానుభూతీ, ఎంతకు చల్లదనమూ

ఎక్కడన్నా కద్దా?" అంటూ అరిచాడు. మౌగ్లీ కంగారుపడి బాఘీర కేసి చూశాడు.

"మర్కటులు అబద్ధమాడారు. వాళ్లకు ఏనాడూ నాయకుడంటూ లేడు. వాళ్లెప్పుడూ నిజం చెప్పరు," అన్నాడు బాఘీర.

"వాళ్ళు నన్ను చాలా అపేక్షగా చూశారు. మళ్ళీ రమ్మన్నారు. నా లాగే వాళ్ళు కాళ్ల మీద నిలబడతారు. మొట్టికాయలు వెయ్యరు. రోజల్లా ఆటల్లోనే గడుపుతారు. నేను మళ్ళీ పోయి వాళ్ళతో ఆడుకుంటాను. నన్ను వదులు, భాలూ!" అన్నాడు మౌగ్లీ.

"ఓరి బుద్ధి తక్కువ మనిషికూనా! నీకు అరణ్య నియమాలన్నీ నేర్పాను. అరణ్యవాసు లందరిని గురించీ చెప్పాను - ఒక్క కోతులను గురించి తప్ప. కోతులకు నియమాలంటూ లేవు. వాళ్ళు వెలిపడ్డ వాళ్ళు. వాళ్ళకు సొంత భాష కూడా లేదు; వాళ్ళ భాషా వీళ్ళ భాషా దొంగిలించి ఉపయోగించుకుంటారు. వాళ్ళకు నాయకు లుండరు. వాళ్ళ దారి వేరు, మన దారి వేరు. వాటికి జాతిస్మరణే లేదు. తాము చాలా గొప్పజాతి అనీ, ఘనకార్యాలు చేయ పోతున్నామనీ గప్పాలు కొడతారు. ఇంతలో ఏ కాయో కింద రాలుతుంది. అందరూ వికవికా నవ్వి, చెబుతున్న దేమిటో కూడా



మరిచిపోతారు. వట్టి వెకిలి మూక. మన అరణ్యవాసులకు వాళ్ళతో ఎటువంటి సంబంధమూ లేదు; వాళ్ళు నీరు తాగే చోట మనం తాగం; వాళ్లు వేటాడే చోట మనం వేటాడం; ఆఖరుకు వాళ్లు చచ్చే చోట మనం చావను కూడా చావం. వాళ్లకు శుచీ, శుభ్రమూ లేదు, సిగ్గు లేదు. అరణ్య వాసుల దృష్టిని ఆకర్షించటానికి అడ్డమైన వేషాలూ వేస్తారు. కాని మనం వాళ్ళను చూడనైనా చూడం. కోతులు నీకు నిషిద్ధులు! నిషిద్ధులు!" అన్నాడు భాలూ తీవ్రంగా.

"భాలూ చెప్పేది అక్షరాలా నిజం. కాని కుర్రవాణ్ణి కోతులను గురించి ఏ నాడో

గట్టిగా హెచ్చరించి ఉండవలసింది," అన్నాడు బాఘీర.

"వీడు వెళ్ళి ఆ క్షుద్రులతో మాట్లాడతాడని నే నెలా అనుకోను?" అన్నాడు భాలూ.

మౌగ్లీ తాను చేసినపని తప్పని గ్రహించి, ఇక ఎన్నటికీ కోతులతో ఎలాటి సంబంధమూ పెట్టుకోరా దనుకున్నాడు. కాని కోతులు మాత్రం మౌగ్లీని వదిలిపెట్ట దలచలేదు.

పైన చెప్పిన సంభాషణ జరిగిన మధ్యాన్నం ఎండ వేళప్పుడు మౌగ్లీ పులికీ, ఎలుగుబంటికీ మధ్య పడుకుని, వాళ్ళతో బాటు కునుకు తీశాడు. అతనికి తిరిగి స్పృహ తెలిసేసరికి అతను చెట్టు పై కొమ్మలలో ఉన్నాడు. అనేక మర్కటాల చేతులు అతన్ని బలంగా పట్టుకుని ఉన్నాయి.

భాలూ నిద్రలేచి అరణ్యం దద్దరిల్లేటట్టు కేకలు పెట్టాడు. బాఘీర కోరలు బయట పెట్టి చెట్టుమాను ఎగబాకాడు. మర్కటులు విజయధ్వానాలు చేస్తూ పై కొమ్మలకు ఎక్కారు. బాఘీర అక్కడి దాకా ఎక్కలేరని వాళ్ళకు తెలుసు. "మనని బాఘీర చూశాడు! బాఘీర మనని చూశాడు!" అని మర్కటులు కోలాహలంగా, సంతోషంతో అరిచారు. ఆ తరవాత వాళ్ళు చెట్ల పై భాగాల మీదుగా ప్రయాణం సాగించారు—మౌగ్లీని పట్టుకుని.

కోతులకు చెట్ల మీద, భూమికి నూరడుగుల ఎత్తున రాస్తా లున్నాయి; చీలే దారులున్నాయి; దిగుడు దారులూ, ఎగుడు దారులూ, అడ్డదారులూ అనేకం ఉన్నాయి. వాటిని కోతులు మాత్రమే ఉపయోగించగలరు. ఆ దారుల వెంట వాళ్ళు అమిత వేగంగా ప్రయాణించగలరు. ఇప్పుడు మౌగ్లీని మోయవలసి రావటం చేత, వాళ్లు సగం వేగంతోనే ప్రయాణించవలసి వచ్చింది. కాని ఆ వేగం కూడా బాఘీరకూ, భాలూకూ అందుకునేటందుకు సాధ్యమైనది కాదు. —(ఇంకా వుంది)





# అరణ్యపురాణం

## 17

ఇద్దరు బలమైన మర్కటులు మౌగ్లీని తమ చంకల కింద గట్టిగా పట్టుకుని, చెట్ల పై భాగాల మీదుగా, తడవకు ఇరవయ్యేసి అడుగులు దూకుతూ పరిగెత్తుతున్నారు. మౌగ్లీ బరువు లేకపోతే వాళ్ళు రెట్టింపు వేగంతో వెళ్ళగలరు. ఆ వేగానికి మౌగ్లీకి తల తిరిగి పోతున్నది. అడుగున ఎక్కడో ఉన్న నేల కేసి చూస్తే గుండె గుబగుబలాడుతున్నది. కాని గాలిలో అతివేగంగా ఎగిరిపోతున్న ఆనందం లేకపోలేదు. ఒక్కొక్కసారి చెట్ల చిటారు కొమ్మలకు పోతూ, అవి తమ బరువు మోయలేనప్పుడు పెద్ద కేకపెట్టి, గద్దల్లాగా వాలి, మరొక చెట్టు కింది కొమ్మలను, కాళ్ళతోనో, చేతులతోనో; వీలునుబట్టి అందుకుంటూ మర్కటులు ప్రయాణిస్తున్నారు. ఒక్కొక్కసారి, ఎత్తయిన చిటారు కొమ్మల నుంచి మౌగ్లీకి అరణ్యం అనేకమైళ్ళు చుట్టూ విస్తరించి కనబడుతున్నది. పై కొమ్మల కెక్కుతూ, కింది కొమ్మలకు దూకుతూ, కేరింతాలు కొడుతూ, రంకెలు పెడుతూ, మౌగ్లీని బందీగా చిక్కించుకున్న వానరులు చెట్ల మీదుగా ఉండే తమ మార్గాన అతి వేగంగా పోసాగారు.

మౌగ్లీకి మొదట కలిగినది భయం— తనను మర్కటులు కింద జారవిడుస్తారేమోనని. తరవాత అతనికి ఆగ్రహం వచ్చింది; కాని తొందరపడి పెనుగులాడాడు కాదు. ఆ తరవాత అతను ఆలోచించ నారంభించాడు.

వెంటనే జరగవలిసిందేమంటే భాలూకూ, బాఘీరకూ వర్తమానం పంపటం. ఈ కోతుల వేగాన్ని వాళ్ళు అందుకోలేరు. వర్తమానం ఎవరు చేర

అట్ట చివరి బొమ్మ



వేస్తారు? కిందికి చూస్తే ఆకులూ, కొమ్మలూ తప్ప మరేమీ కనిపించటం లేదు. మౌగ్లీ నీలాకాశంలోకి చూశాడు. అరణ్యంలో ఏ ప్రాణి అయినా చస్తుందా అని చూస్తూ, డేగన్న ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాడు.

మర్కటులు దేన్నో చేర వేస్తూండటం డేగన్న చూడనే చూశాడు. చూసి, అది తిన టానికి పనికి వస్తుందేమోనని, కొన్ని వందల గజాలు దిగివచ్చాడు. దగ్గిరిగా వచ్చేసరికి మౌగ్లీ కనిపించాడు; డేగ భాషలో మౌగ్లీ, "మనమూ, మనమూ ఒకటే," అన్న పలక రింత కూడా వినపడింది. డేగన్న ఆశ్చ ర్యంతో కూత వేసి, మౌగ్లీని మోసుకు పోయే మర్కటుల మార్గాన్ని అనుసరించ సాగాడు. "నేను వెళ్ళే దారి గుర్తుంచుకుని, భాలూకూ, బాఘీరకూ, శిఖరం మీది మందకూ చెప్పు," అని మౌగ్లీ డేగభాషలో కేక పెట్టాడు.

"నీ పేరేమిటి, తమ్ముడూ?" అన్నాడు డేగన్న. అతనికి అప్పటి కింకా మౌగ్లీ పరి చయం కలగలేదు.

"మౌగ్లీ. అందరూ నన్ను కప్పాయ్ అని పిలుస్తారు," అన్నాడు మౌగ్లీ.

డేగన్న అవ్వాయిచువ్వా లాగా ఆకాశం లోకి లేచి చిన్న చుక్కలాగా కనిపిస్తూ, మర్కటులు వెళ్ళే దారి గమనించాడు.

ఈ లోపల భాలూ, బాఘీరా పొందిన ఆగ్రహం వర్ణనాతీతం. బాఘీర ఎన్నడూ ఎగబాకని ఎత్తులకు చెట్లు ఎగబాకాడు. అతని బరువు మొయ్యలేక కొమ్మలు పెళ పెళా విరిగాయి. అతని గోళ్ళ నిండా చెట్ల బెరడు ఇరుక్కున్నది. అతను తన ఆగ్ర హాన్ని భాలూ మీద వెళ్ళగక్కుతూ, "మౌగ్లీని ముందే ఎందుకు హెచ్చరించావు కావు?" అన్నాడు.

"త్వరగా! త్వరగా పోతే వాళ్ళను అందుకోగలమేమో!" అన్నాడు భాలూ రొప్పుతూ పరిగెత్తుతూ.

"నీ పరుగుకా? ఇంకో మైలు పరిగెత్తావంటే పండుపగిలినట్టు పగిలి పోగలవు! స్థిమితంగా కూర్చుని ఆలోచించు. కుర్రవాళ్ళను మొట్టికాయలు వేసినట్టు కాదు. మనం వెన్నంటామంటే వాళ్ళు వాణ్ణి జారవిడిచెయ్యగలరు!" అన్నాడు బాఘీర.

"అయ్యో, బాబోయ్! జార విడవటమే!" అంటూ భాలూ నెత్తిన చేతులు పెట్టుకుని, వేదనతో అటూ ఇటూ ఊగసాగాడు.

"ఊరుకో, భాలూ. అట్లా శోకాలు పెడితే చూసినవాళ్ళు ఏ మనుకుంటారు? నేనే నీలాగ రోదనం ప్రారంభించాననుకో—" అని బాఘీర మందలించాడు.

"ఎవ రే మనుకుంటే నాకేం? వాడీ పాటికే చచ్చిపోయాడేమో!" అంటూ భాలూ చేతులు వూపుతూ తనను తాను వైనవైనాలుగా తిట్టుకున్నాడు.

అంతలోనే భాలూ ఊగటం మానేసి నిటారుగా నిలబడ్డాడు. అతని కొక ఆలోచన వచ్చింది.

"మనం కొండచిలువ కావా దగ్గిరికి పోదాం. అతనంటే కోతులకు హడలు! అతను మర్కటులంత వేగంగానూ కదలగలడు, చెట్లెక్కగలడు. రాత్రివేళ వచ్చి వాళ్ళ పిల్లలను తినేస్తూ ఉంటాడు," అన్నాడు భాలూ.



"పాపిష్టి కళ్ళు! కాళ్ళు అసలే లేవు! మన జాతీకాదు—వాడు మనకేం సహాయం చేస్తాడు?" అన్నాడు బాఘీర అనుమానంగా.

"వాడు అనేక కాలాలు చూసినవాడు, మహా జిత్తులమారి. ఎప్పుడూ ఆకలి మీదనే ఉంటాడు. బోలెడన్ని మేకలను ఇస్తామందాం," అన్నాడు భాలూ.

"కడుపులో ఎత్తు పడితే నెలపాటు నిద్రపోతాడు. నిద్రలో ఉన్నాడేమో? ఒకవేళ మేలుకునే ఉన్నా, మీ మేకలు ఎవడికావాలి అంటే?" అన్నాడు బాఘీర అనుమానంగా.

నిజానికి బాఘీరకు కావా గురించి దాదాపు ఏమీ తెలీదు.

"నువ్వూ, నేనూ అంత చాతకాని వాళ్ళమా ఏమిటి?" అన్నాడు భాలూ, తన భుజాన్ని బాఘీర కేసి రుద్దుతూ.

ఇద్దరూ కలిసి కొండచిలువ కావాను వెతుక్కుంటూ బయలుదేరారు.

కావా వాళ్ళకు ఒక వేడెక్కిన రాతి మీద మధ్యాన్నపు ఎండలో పడుకుని కనిపించాడు. అతను గత పది రోజుల లోపల కుబుసం విడిచి, నిగనిగలాడే కొత్త చర్మంతో చాలా అందంగా ఉన్నాడు. ఆరు బారల నిడివి గల అతని శరీరం మెలికలు తిరిగిపోతున్నది. అతను ఆహారం గురించి ఆలోచిస్తూ పెదవులు నాక్కుంటున్నాడు.

భాలూ కావాను అంత దూరాన చూస్తూనే బాఘీరతో, "ఆకలి మీద ఉన్నాడు. ఇంకా కడుపులో ఎత్తు పడలేదు. జాగ్రత్త సుమా! కుబుసం విడిచిన కొత్తలో అతనికి దృష్టి సరిగా ఆనదు. దానితోబాటు తొందరపాటు కూడా హెచ్చు," అని హెచ్చరించాడు.

కావా విషసర్పంకాదు. విషసర్పాలు పిరికివాళ్ళని అతనికి వాళ్ళంటే ఏవగింపు కూడాను. అతనిలో అపాయకరమైనది అతని కౌగిలింత. ఆ కౌగిలింతకు చిక్కి బయటపడిన ప్రాణి లేదు.





# అరణ్యపురాణం

## 18

కావాకు కొంత దూరంలోనే గొంతు కూర్చుంటూ భాలూ, "వేట సాగాలి!" అన్నాడు. అరణ్యంలో వేటాడే మృగాలు ఒకదాన్ని ఒకటి అలాగే పలకరించు కుంటాయి.

"ఓహో, భాలూవా? వేట సాగాలి, బాఘీరా! ఆకలి దహించుకు పోతోంది. ఎక్కడన్నా తిండి దొరికేనా?" అన్నాడు కావా కొండచిలువ.

"మేము వేట పని మీదే ఉన్నాం," అన్నాడు భాలూ.

"అయితే నన్ను కూడా వెంట తీసుకు పోదురూ. మీ వేట క్షణాల మీద అయేది. నే నట్లా కాదే! ఏ కొమ్మకో చుట్టుకుని రోజులూ, వారాలూ వేచి ఉంటేగాని ఏ కోతి పిల్లో దొరకదు. కాకపోయినా ఈ కాలంలో ఏం చెట్లు? ఏం కొమ్మలు? చావ ఏడిస్తేగా? నా చిన్నతనంలో చెట్లకొమ్మలు ఎలా ఉండేవి!" అన్నాడు కావా.

"కాకపోతే మాత్రం నీ బరువు కాస్త కూస్తానా?" అన్నాడు భాలూ.

కావా కాస్త గర్వంగా, "బారు బాగానే ఉన్నాననుకో. అయినా ఇప్పుడు కొత్తగా పెరిగే చెట్లు ఎందుకూ పనికిరావు. కిందటి మాటు నేను వేట మీద ఉన్నప్పు డేమయిం దనుకున్నారు? పడ్డంత పని చేశాను. కొమ్మ మీది నుంచి ఒళ్లు జారసాగింది. ఆ చప్పు డుకు మర్కటులు మేలుకున్నారు. వాళ్లు నన్ను తిట్టిన తిట్లు ఇన్నీ అన్నీ కావు," అన్నాడు కావా.

"కాళ్ళు లేని పచ్చపురుగనా అన్నారు?" అన్నాడు బాఘీర.

"నన్ను వానరులు అంత మాట అన్నా రుగా? బుస్!" అన్నాడు కావా రోషంతో.

అట్ట చివరి బొమ్మ.



"నోటికి వచ్చిందల్లా అంటారు. నీ దంతాలన్నీ ఊడాయట! నువు చిన్న చిన్న మేక పిల్లల్ని తప్ప ఇంకే పెద్ద జంతువు ఎదటా పడలేవుట! మేకపోతు కొమ్ములంటే నీకు చచ్చే భయంట! వాళ్ళ నోటికి సుద్దా, బుద్దా?" అన్నాడు బాఘీర.

కావా ఎంతో వయసుగల సర్పం. అలాటి వాడిలో ఆగ్రహం కలిగితే ఒకంతట పైకి తెలీదు. కాని కావా కండరాల కదలికను బట్టి అతనికి బాగా ఆగ్రహం వచ్చినట్టు భాలూ, బాఘీరా తెలుసుకున్నారు.

"మర్కటులు తమ నివాసస్థలం మార్చారు. ఇంతకు ముందు నేను ఎండ పొదలోకి వచ్చినప్పుడు చెట్ల చివరల వాళ్ళ పెడ బొబ్బలు విన్నాను," అన్నాడు కావా.

"మేము మర్కటులనే వేటాడుతున్నాం," అన్నాడు భాలూ.

"మీ ఇద్దరిలాటి మహాయోధులు మర్కటుల వెంట పడటానికి విశేషకారణం ఏదో ఉండాలే!" అన్నాడు కావా.

"నా దేముందిలే. నేను తోడేళ్ళ పిల్లలకు శాస్త్రం చెప్పేవాణ్ణి," అంటూ భాలూ నీళ్ళు నమిలాడు.

బాఘీర అతనికి అడ్డం వచ్చి, "కావా, అసలు విషయం ఏమిటంటే, కాయలు దొంగిలించే కిచకిచగాళ్ళు, మా మనిషి కూనను ఎత్తుకుపోయారు. నువు వాణ్ణి గురించి వినే ఉండవచ్చు," అన్నాడు.

"ఒక మనిషి కూన తోడేళ్ళ మందలో చేరినట్టు విన్నాను గాని, నమ్మలేదు," అన్నాడు కావా.

"ఆ మాట నిజమే, కావా. అలాటి మనిషి కూనను ఎక్కడా చూడం. ఎంత తెలివి! ఎంత ధైర్యం! వాడి మూలంగా నాకెంత కీర్తి రానున్నది! మాకు వాడంటే ప్రాణం!" అన్నాడు భాలూ.

"ప్రేమంటే ఏమిటో నాకూ తెలుసు. మీకు ఎన్ని గాథలనైనా చెప్పగలను—" అని

కావా ఆరంభించే సరికి, బాఘీర చప్పున అడ్డుతగిలి, "కడుపులు నిండినాక రాత్రల్లా కూర్చుని ఆ కథలు చెప్పుకుందాం. ప్రస్తుతం మా మనిషి కూన మర్కటుల చేతికి చిక్కాడు. కావా అంటే మర్కటులకు హడలుగదా!" అన్నాడు.

"వాళ్ళకు నేనంటేనే భయం. మూర్ఖులు వదరుబోతులు, వాగుడుకాయలు. నన్ను పచ్చచేప అన్నారు కదూ?" అన్నాడు కావా.

"చేపకాదు, పురుగు-పురుగు! ఆ ఒక్కటేనా? ఇంకా ఎంతేసి మాటలన్నారు! నాకు చెప్పటానికూడా నోరు రావటం లేదు."

"ఫుస్! వాళ్ళకి కాస్త బుద్ధి చెప్పాలి. పిల్లవాణ్ణి తీసుకుని వాళ్ళు ఎటుగా వెళ్ళారు?" అని కావా అడిగాడు.

"సూర్యాస్తమయం కేసి వెళ్ళినట్టు తోస్తుంది. వాళ్ళ జాడ నీకే తెలుస్తుం దను కున్నామే," అన్నాడు భాలూ.

"నాకా? ఎలా తెలుస్తుంది? నేను మర్కటులనూ, కప్పలనూ, కంగాళీ వాటినీ వేటాడనే. నా దగ్గిరికి వస్తే పట్టుకుంటాను," అన్నాడు కావా.

ఇంతలో ఆకాశం నుంచి, "భాలూ! ఇలా చూడు! పైకి, పైకి!" అన్న కేక కీచుగా వినిపించింది.



అది డేగన్న కేక. అతను భాలూ కోసం అరణ్యమంతా తెగతిరిగి, ఇప్పటికి పట్టు కోగలిగాడు.

"మర్కటుల వెంట మౌగ్లీని చూశాను. మీకు తన జాడ చెప్పమన్నాడు. మర్కటులు నది దాటి, మర్కటనగరానికి అతన్ని తీసుకుపోయారు—శిథిలా లుండే చోటికి. రాత్రంతా గబ్బిలాయిలను చూస్తూండమని చెప్పాను. కింద ఉన్న మీ అందరికీ వేట బాగా సాగాలి. చీకటి పడుతున్నది, వస్తా," అన్నాడు డేగన్న.

"కడుపు నిండా తిండీ, కంటి నిండా నిద్రా కలగాలి, డేగన్నా! ఈసారి నేను

చంపే జంతువు తల పూర్తిగా నీకే వది లేస్తా!" అన్నాడు బాఘీర.

"నేను చేసిందాన్లో విశేష మేముంది? నా భాషలో పలకరించి పని చెప్పాడు. చెయ్యటం నా విధి," అంటూ డేగన్న రివ్వున పైకి లేచి, గుండ్రంగా తిరుగుతూ వెళ్ళిపోయాడు.

"సమయానికి పక్షిభాష జ్ఞాపకం పెట్టు కున్నాడు! వాడిది ఏం తెలివి!" అంటూ భాలూ గర్వంతో పొంగిపోయాడు.

"మొట్టికాయలతో తల లోకి ఇంకి ఉంటుందిలే. పదండి, మనం ఇప్పుడు శిథిలాల కేసి పోవాలి," అన్నాడు బాఘీర.

ఆ శిథిలాలు ఎక్కడ ఉండేదీ ముగ్గురికీ తెలుసు. "మేము నీ కోసం ఆగం. నేనూ, కావా వేగంగా పోతాం. నువు వెనకగా రా, భాలూ," అన్నాడు బాఘీర.

"కాళ్ళుండనీ, లేకపోనీ, నేను నీ అంత వేగంగానూ కదలగలను," అన్నాడు కావా.

భాలూ గబగబా నాలుగడుగులు వేసి, రొప్పు వచ్చి, చతికిల బడ్డాడు. మిగిలిన ఇద్దరూ వేగంగా ముందుకు సాగారు. బాఘీర ఎంత వేగంగా దూకుతూ పరిగెత్తినా కావా అతనితో సమంగా పాకగలిగాడు. దారిలో ఒక చిన్న వాగు వచ్చినప్పుడు బాఘీర దాని మీదిగా దూకేశాడు. కావా ఈదవలసి రావడంచేత కాస్త వెనకపడ్డాడు.

"ఏమిటో అనుకున్నాను, కావా! నీది యమవేగమే!" అన్నాడు బాఘీర.

"ఆకలి మీద ఉన్నాలే. నన్ను చుక్కల కప్పని అన్నారు కదూ?" అన్నాడు కావా.

"చుక్కల కప్ప కాదు. పచ్చ పురుగు!" అన్నాడు బాఘీర.

"ఏదైనా ఒకటే! పద, పద!"

కావా కళ్ళు నిశ్చలంగా దారి మీదనే ఉన్నాయి. అతని శరీరం దారి వెంట పాదరసం లాగా ప్రవహిస్తూ అతి వేగంగా ముందుకు పోతున్నది.





# అరణ్యపురాణం

## 19

మర్కటులు మౌగ్లీని శిథిలాలకు చేర్చి, చాలా ఘనకార్యం చేశామని మహా మురిసి పోయారు. వాళ్ళకు మౌగ్లీ మిత్రులను గురించిన ఆలోచనే రాలేదు. మౌగ్లీ ఎన్నడూ నగరాన్ని చూసినవాడు కాదు. ఈ నగరం పూర్తిగా శిథిలమైనప్పటికీ అతనికి చూస్తుంటే మహా ముచ్చటగా ఉన్నది. చాలా కాలం క్రితం ఎవరో ఒక మహారాజు ఆ నగరాన్ని ఒక గుట్ట మీద నిర్మించాడు. నగర ద్వారానికి వెళ్ళే దారి ఆనవాళ్ళింకా ఉన్నాయి. ద్వారం తలుపులు మాత్రం శిథిలమై, విరిగి పోయిన చెక్కలు తుప్పుపట్టిన బందుల కింకా వేళ్ళాడుతున్నాయి. రాతిగోడల నుంచి చెట్లు మొలిచాయి. బురుజు గోడలు విరిగి పడిపోయాయి. బురుజు గవాక్షాల నుంచి అడవి లతలు బయటికి వచ్చి వేళ్ళాడుతున్నాయి.

గుట్ట శిఖరాన ఉన్న రాజభవనం మీద కప్పు లేదు. ఆవరణలోనూ, జలయంత్రాల వద్దా ఉండిన చలువరాళ్ళు బద్దలైపోయి, ఎర్రగానూ, పచ్చగానూ అయిపోయాయి. నాపరాళ్ళ మధ్యగా గడ్డి, మొక్కలూ మొలుచుకొచ్చాయి. రాజభవనం నుంచి చూస్తే కప్పులు లేని ఇళ్ళవరసలు, నల్లగా, తేనె పట్టులోని గదుల్లాగా కనబడతాయి. నాలుగురోడ్లు కలిసే కూడలిలో ఉన్న విగ్రహానికి ఇప్పుడే ఆకారమూ లేదు. రోడ్ల పక్కన ఉండిన బావులు గోతుల్లాగా అయి పోయాయి. శిథిలమైన ఆలయాల గోపురాల మధ్యగా అడివి అత్తిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి.

మర్కటులు దాన్ని తమ సొంత నగరంగా భావించి, అరణ్యంలో నివసించే ప్రాణులను నిరసనగా చూసేవాళ్ళు. కాని

అట్ట చివరి బొమ్మ



వాళ్ళకు ఆ ఇళ్ళు ఎందుకు కట్టినవో, వాటిని ఎలా వాడుకోవాలో తెలీదు. వాళ్ళు రాజుగారి దర్బారు భవనంలో గుండ్రగా కూచుని, శరీరాలు గోక్కుంటూ, తాము మనుషులమన్నట్టు నటించేవాళ్ళు. లేక పోతే, కప్పులు లేని ఇళ్ళలోకీ, బయటికీ పరిగెత్తుతూ, రాళ్ళూ రప్పలూ ఏరి, ఒక మూల భద్రం చేసి, వాటిని ఎక్కడ దాచుకున్నదీ మరిచిపోయేవాళ్ళు. తమలో తాము పోట్లాడుకుని కేకలు పెట్టి, దొమ్మి చేసుకుని, రాజుగారి ఉద్యానంలోకి పరిగెత్తి, అక్కడి చెట్లను ఊపి, పూలూ కాయలూ రాల్చి, ఆనందించేవాళ్ళు. రాజభవనంలోని చీకటి కోణాలూ, చీకటి నడవలూ వెతుకుతూ తిరిగేవాళ్ళు. కాని తాము చూసినదేమిటో వాళ్ళకు గుర్తుండేది కాదు. "మనం అచ్చు మనుషులల్లేనే జీవిస్తున్నాం కాదూ?" అని ఒకరినొకరు ప్రశ్నించుకునేవాళ్ళు. మడుగుల్లో నీళ్లు తాగి, నీటిని కెలికి, తమలో తాము చచ్చేట్టు పోట్లాడుకుని, మందలు మందలుగా పరిగెత్తుతూ, "మర్కటులంత వివేకమూ, మంచి తనమూ, తెలివీ, బలమూ, మర్యాదా గల వాళ్లు అరణ్యంలో ఎవరూ లేరు," అని కేకలు పెట్టేవాళ్ళు. చిట్టచివరకు నగర జీవితం విసుగెత్తినప్పుడు వాళ్లు అరణ్యంలో చెట్ల మీదికి వెళ్ళి, అరణ్యవాసుల దృష్టి ఆకర్షించటానికి నానా అగచాట్లూ పడేవాళ్లు.

అరణ్య సంప్రదాయాలు తెలుసుకున్న మౌగ్లీకి ఇదేం జీవితమో అర్థం కాలేదు, నచ్చలేదు కూడా. పొద్దువాలే సమయానికి మర్కటులు మౌగ్లీని శిథిలాలకు చేర్చి, దీర్ఘ ప్రయాణం అనంతరం అతణ్ణి అలవాటు ప్రకారం నిద్ర అయినా పోనివ్వకుండా, చుట్టూ వలయంగా నిలబడి, చేతులు చేతులు పట్టుకుని పిచ్చి పాటలు పాడుతూ నృత్యం చేశారు. ఒక మర్కటుడు ఉపన్యాసం ఇచ్చాడు; మౌగ్లీని

పట్టుకు రావటం మర్కటుల చరిత్రలో ఒక సువర్ణ ఘట్టమన్నాడు; మౌగ్లీ తమకు కర్రలతోనూ, తడపలతోనూ చాప అల్లటం నేర్పుతాడనీ, అందువల్ల తమకు వర్షం నుంచి రక్షణ ఉంటుందనీ తెలిపాడు.

మౌగ్లీ కొన్ని లతలు తెచ్చి అల్లటం ఎలాగో చూపాడు. మర్కటులు కొంత సేపు తాము కూడా అతనిలాగే చేయ యత్నించారు. కాని వాళ్ళకు త్వరలోనే విసుగెత్తింది. ఆ తరవాత వాళ్ళు ఒకరి తోకలు ఒకరు లాగటమూ, "ఖో, ఖో!" అని అరుస్తూ నాలుగు కాళ్ళ మీద ఎగరటమూ ప్రారంభించారు.

"నాకు ఆకలిగా ఉన్నది. నా కీ ప్రాంతపు అరణ్యం తెలియదు. నాకు తిండి తీసుకు రండి, లేదా ఇక్కడ వేటాడటానికి అనుమతి అయినా ఇవ్వండి," అన్నాడు మౌగ్లీ.

అతనికి కాయలూ, పళ్ళూ తీసుకు రావటానికి ఇరవై, ముప్పై మంది మర్కటులు బయలుదేరారు. అయితే దారిలో వాళ్ళు యుద్ధం ఆరంభించి, తెచ్చే పళ్ళు పూర్తిగా ధ్వంసం చేశారు.

మౌగ్లీకి ఆకలితోపాటు ఆగ్రహం కూడా దహించుకు పోతున్నది. అతను వేటనినాదాలిస్తూ ఆ శిథిల నగరం అంతా తిరిగాడు. కాని అతని కేకలకు ఎలాటి జవాబూ రాలేదు.



''ఇంత పాపిష్టి చోటు ఎక్కడా ఉండదు. మర్కటులను గురించి భాలూ చెప్పిన దంతా అక్షరాలా నిజం. వీళ్ళకొక సంప్రదాయం లేదు, వేట పిలుపులు లేవు. నాయకత్వం లేదు. అర్థం లేని మాటలూ, దొంగ బుద్ధులూ వీళ్ళూనూ! నే నిక్కడ తిండికి మాడినా, హత్య అయినా తప్పంతా నాదే.. ఎలాగైనా అరణ్యానికి తిరిగి పోగలిగితే బాగుండును—భాలూ చేత దెబ్బలు పడితే పడతానుగాక!'' అనుకున్నాడు మౌగ్లీ.

అతను ప్రాకారం దాకా వెళ్లాడో లేదో, మర్కటులు అతన్ని పట్టుకుని వెనక్కు లాక్కొచ్చి, ''నీ సుఖం కూడా నీకు తెలీదేం?'' అంటూ గిచ్చారు. మౌగ్లీ పళ్ళ బిగువున సహించాడు.

రాజసౌధం ఆవరణలో చలవరాతి మండపం ఒకటి ఉన్నది. నూరేళ్ళ క్రితం అంతఃపుర స్త్రీలు నేల అడుగున ఉన్న సొరంగం కుండా అక్కడికి వచ్చి వెన్నెల విహారాలు చేసేవారు. మండపం చుట్టూ చిత్రపు పని చేసి రత్నాలు తాపిన చలువ రాతి పలకలుండేవి. వాటి సందులలో నుంచి వెన్నెల లోపలికి వచ్చేది. ఇప్పుడు ఆ మండపం కప్పు సగం కూలి, సొరంగ ద్వారాన్ని మూసేసింది. మర్కటులు మౌగ్లీని ఇక్కడి మిద్దె మీదికి తెచ్చి, అతని చుట్టూ మూగి, ''మే మెంత గొప్పవాళ్లం! ఎంత జ్ఞానులం! ఎంత బలవంతులం! ఎంత మంచివాళ్ళం! మా నుంచి పారిపోతావే! మా సంగతి నువు అరణ్యంలో అందరికీ చెప్పాలి,'' అని కోలాహలంగా మాట్లాడారు.

''నిశ్చయంగా వీళ్ళను పిచ్చి సక్కరిచినట్టున్నది. వీళ్ళకు పిచ్చే, సందేహం లేదు. అదుగో చంద్రుడికి చిన్న మేఘం అడ్డొస్తున్నది. అదే మరింత పెద్ద మేఘమైతే హాయిగా తప్పించుకు పోదును గద!'' అనుకున్నాడు మౌగ్లీ. —(ఇంకావుంది)





# అరణ్యపురాణం

## 20

ప్రాకారం కింద ఉన్న, శిథిలమైన అగడ్తలో కూర్చుని కావా, బాఘీరా ఆ మేఘాన్నే చూస్తున్నారు. మందగా ఉన్న మర్కటులతో తలపడటం అపాయమని ఆ ఇద్దరికీ తెలుసు.

"నేను పడమటి గోడ వద్దకు పోయి నేల వాలున జారి వస్తాను. మర్కటులు నా మీద వందల సంఖ్యలో పడే అవకాశం లేదు. అయితే—" అన్నాడు కావా.

"నాకు తెలుసు. భాలూ ఇక్కడ ఉంటే ఎంతో బాగుండేది. కాని ఏం చేస్తాం? చంద్రుడికి ఆ మబ్బు అడ్డం రాగానే నేను మిద్దె మీదికి పోతాను," అన్నాడు బాఘీర.

"వేట సాగాలి," అంటూ కావా పడమటి గోడ కేసి పాకుతూ వెళ్లిపోయాడు.

చంద్రుడికి మబ్బు అడ్డొచ్చింది. బాఘీర చడీ చప్పుడూ కాకుండా మిద్దె మీదికి ఎక్కి వచ్చి, మౌగ్లీ చుట్టూ మూగిన కోతుల మీద పడి, ఎడాపెడా బాదసాగాడు.

మర్కటులు కోపంతోనూ భయంతోనూ హాహాకారాలు చేశారు.

"ఒక్కడే ఉన్నాడు! చంపండి, చంపండి!" అని ఒక మర్కటుడు కేక పెట్టాడు. కోతులు తుట్టెలు తుట్టెలుగా బాఘీర మీద వచ్చిపడి, రక్కటమూ, కొరకటమూ, పీకటమూ, లాగటమూ ప్రారంభించారు. అయిదారుగురు మర్కటులు మౌగ్లీని గట్టిగా పట్టుకుని, చలవరాతి మంటపం కప్పు మీదికి ఈడ్చుకుపోయి, అందులోని కంత నుంచి లోపలికి తోసేశారు.

"అక్కడే ఉండు. నీ మిత్రులను చంపేసి వచ్చి నీతో ఆడుకుంటాం— ఈ లోపుగా విషపు పురుగులు నిన్ను

అట్ట చివరి బొమ్మ



చంపెయ్యకుండా ఉంటే!" అన్నారు మర్కటులు మౌగ్లీతో.

మౌగ్లీ పాము భాషలో, "మనమూ మనమూ ఒకటే!" అన్నాడు. మండపం లోపల ఉండే చెత్తాచెదారం మధ్యగా ఏవో పాకుతున్న చప్పుడూ, బుసకొడుతున్న చప్పుడూ వినవచ్చింది.

"పడగలు దించండి!" అని ఒక అర డజను పాముకంఠాలు పలికాయి. "కదలకు, తమ్ముడూ, మమ్మల్ని తొక్కగలవు!" అన్నాయా కంఠాలు మౌగ్లీతో.

చెక్కడపు గోడల రంధ్రాలలో నుంచి బయటికి చూస్తూ, వీలయినంత నిశ్చలంగా నిలబడి, బయట బాఘీరతో సాగే యుద్ధాన్ని ఆలకించాడు మౌగ్లీ. మర్కటులు మూకుమ్మడిగా వచ్చి బాఘీర మీద పడి అరుస్తూ, గుంజుతూ కిచకిచలాడుతూ పెనగులాడుతున్నారు. బాఘీర మెలికలు తిరిగి పోతూ తన శత్రువుల నుంచి తనను కాపాడుకొనటానికి ప్రాణాలరచేత పెట్టుకుని పోరాడుతున్నాడు.

బాఘీర ఒంటిగా రాడనీ, భాలూ ఎక్కడో సమీపంలోనే ఉండాలనీ మౌగ్లీ అనుకున్నాడు. అతను గొంతెత్తి, "నీళ్ళ తొట్టెల కేసి దొర్లు, బాఘీరా. నీళ్ళ తొట్టెల్లోకి దూకెయ్యి," అని కేక పెట్టాడు.

మౌగ్లీ కేక పెట్టటం వినగానే, అతను క్షేమంగా ఉన్నాడని తెలిసి, బాఘీరకు కొత్త ధైర్యం వచ్చింది. అతను ఎడా పెడా దెబ్బలు తీస్తూ, ఒక్కొక్క అంగుళమే నీళ్ళ తొట్టెల కేసి పోసాగాడు.

ఇంతలో, అరణ్యానికి సమీపంగా ఉన్న గోడ శిథిలాల దగ్గిర నుంచి భాలూ యుద్ధ హుంకారం వినబడింది. భాలూ, పాపం, తనకు సాధ్యమైనంత వేగంగానే వచ్చి చేరాడు. "వచ్చేశాను, బాఘీరా! పైకెక్కేస్తున్నాను! ఈ వెధవ రాళ్ళు కాళ్ళ కింద నిలవకుండా ఉన్నాయి! ఆగండిరా, మర్క

టాధములారా!" అంటూ భాలూ మిద్దె మీదికి వచ్చేశాడు.

అతను పైన కనబడటమే వ్యవధానంగా మర్కటులు మబ్బులాగా అతన్ని కమ్మేసి, మాయం చేశారు. భాలూ దొరికిన మర్కటుణ్ణల్లా తన ఇనప కౌగిట్లో నొక్కేశాడు.

నీటిలో ఏదో పెద్దరాయి పడిన చప్పుడయింది. బాఘీర నీటి తొట్టెలోకి దూకేసినట్టు మౌగ్లీ అర్థం చేసుకున్నాడు. మర్కటులు అతన్ని ఇక అందుకోలేదు. వాళ్ళు నీళ్ళమడుగు చుట్టూ మూగి, తల మాత్రం నీటి పైకి పెట్టి ఆయాసంతో రొప్పుతున్న బాఘీర కేసి చూస్తున్నారు—బాఘీర భాలూకు సాయం వచ్చే పక్షంలో అంతు కనుక్కోవాలని!

కావా ఆఖరు క్షణంలో పారిపోయినట్టు అనుమానం తగిలి బాఘీర పాములను అభయం కోరసాగాడు. ఆ కేక విని భాలూకు, ఒక వంక మర్కటులతో సతమతమవుతున్నా కూడా, నవ్వాగ లేదు.

అయితే కావా పారిపోలేదు. పడమటి గోడ పై భాగానికి చేరటానికి అతనికి ఇంత సేపు పట్టింది. అతను గోడ పై అంచును అందుకుని, అతి భారమైన తన శరీరాన్ని పైకి చేదుకొనేటప్పుడు గోడలోని గండశిల



వదులై కిందికి పడిపోయింది. ఆ గోడ పై భాగం నుంచి కోతులున్న చోటికి వాటమైన పల్లుడు! కావాకు అది ఎంతో ఉపయోగం. కావా తన శరీరం ప్రతి అంగుళమూ సరయిన పొంకంలో ఉన్నదీ లేనిదీ చూసుకునేటందుకు ఒకటి రెండుసార్లు తల నుంచి తోక దాకా మెలికలు తిప్పి, చాచి చూసుకున్నాడు.

భాలూతో యుద్ధం చేసే మర్కటులు యుద్ధం చేస్తున్నారు. బాఘీర ఉన్న నీళ్ల తొట్టె చుట్టూ ఉన్న మర్కటులు కోలాహలంగా అరుస్తున్నారు. గబ్బిలాయి "మాంగ్" పైన ఎగురుతూ, కింద జరిగే

దంతా అరణ్యవాసులకు వ్యాఖ్యానించి చెబుతున్నాడు. అరణ్యవాసులు యుద్ధ వివరాలను ఆసక్తితో ఆలకిస్తున్నారు. హాథీ గట్టిగా ఘీంకారం కూడా చేశాడు. అరణ్యంలో అక్కడక్కడా ఉండే మర్కటులు నిద్ర లేచి, మూకలు మూకలుగా చెట్లమార్గాల, శిథిలాలలో ఉన్న తమ వారికి అండగా పోరాటంలో పాల్గొనటానికి బయలుదేరి వస్తున్నారు. చుట్టుపక్కల అనేక మైళ్ళ మేర నిద్రపోయే పక్షులు మేలుకున్నాయి.

కావా తానున్న ఎత్తు నుండి బాణంలాగా దూకుతూ వచ్చాడు. అతను తలతో ఏ ప్రాణిని గాని మీటినప్పుడు అతని బరువైన శరీరం ఆ దెబ్బకు అంతులేని శక్తి నిస్తుంది. అది గునపం పోటే. నాలుగైదు అడుగుల కొండచిలువ మనిషి రొమ్మును తలతో మొటించిందంటే మనిషి అమాంతం కూలి పడిపోతాడు. కావా ముప్పై అడుగుల నిడివి గల కొండచిలువ!

కావా మొదటి పోటు ఖాలూ పైన మూగిన మర్కటుల మధ్య తగిలింది. మరి రెండో పోటుకు అస్కారమే లేదు. "కావా! కావా! పరిగెత్తండి! పరిగెత్తండి!" అని కేకలు పెడుతూ మర్కటులు చెల్లా చెదరుగా పారిపోయారు.

కావా ఏ నాటివాడు! అతన్ని గురించి ఎన్నో తరాల మర్కటులు పెద్దవాళ్ళ నుంచి ఎన్నో కథలు విన్నారు. కావా చీకటి దొంగ! వాడు నిశ్శబ్దంగా కొమ్మ వెంబడి పాకి వచ్చి, ఎంత లావు మర్కటుణ్ణయినా పొట్టన బెట్టుకోగలడు! చెట్టు మీద ఒక ఎండు కొమ్మలాగా ఉండిపోయి, మోస గించ గలడు! వాడి శక్తికి అవధి ఏమిటో తెలిసిన మర్కటుడు గాని, వాడికి దొరికి ప్రాణాలతో బయటపడిన మర్కటుడు గాని లేడు. అందుచేత మర్కటులు చెల్లాచెదురుగా పారిపోయి, గోడలూ, గొబ్బెలూ, ఇళ్ళ కప్పులూ ఎక్కారు.





# అరణ్యపురాణం

## 21

మర్కటులు కావాను చూసి, తనను వది లేసి పారిపోగానే భాలూ పెద్ద పెట్టున నిట్టూర్చాడు.

కావా నోరుతెరిచి భయంకరంగా ఒక్క సారి బుస కొట్టాడు. మర్కటులు, ఎక్కడి వాళ్ళక్కడ స్తంభించి పోయి, మాట్లాడటం మానేశారు. అంతటా నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దంలో మౌగ్లీకి, బాఘీర నీటి నుండి బయటికి వస్తూ తన ఒంటి మీది తడి విది లించు కోవటం వినబడింది.

బాఘీర రొప్పుతూ, "నా పని అయి పోయింది. మనిషికూనను ఆ మండపంలో నుంచి బయటపడెయ్యి. వాణ్ణి తీసుకుని పోదాం. లేకపోతే మర్కటులు మళ్ళీ మీద పడగలరు," అన్నాడు.

"బుస్! ఆగండి. ఆ మర్కటులు నా ఆజ్ఞ లేకుండా కదల లేరు....నేను ఇంకా ముందు రాలేక పోయాను," అని కావా బాఘీరతో, "తమ్ముడూ, నువు ఎవరినో పిలిచినట్టున్నావు?" అన్నాడు.

"యుద్ధోద్రేకంలో నేను కేక పెడితే పెట్టి ఉండవచ్చు ... గాయపడ్డావా, భాలూ?" అన్నాడు బాఘీర.

భాలూ కాళ్ళూ, చేతులూ ఆడించి చూసు కుంటూ, "నన్ను ఓ వంద పిల్లభాలూల కింద విడ గొట్టటానికి వాళ్ళు ప్రయత్నిం చారు. అబ్బ, ఒళ్ళంతా హూనమయింది! కావా, ఇవాళ నువు మా ఇద్దరి ప్రాణాలూ కాపాడావనటానికేమీ సందేహం లేదు," అన్నాడు.

"దాని కేం లే. మనిషికూన ఎక్కడ?" అన్నాడు కావా.

"ఇక్కడే! ఈ బోనులో. ఇందులో నుంచి పైకి ఎక్కలేను," అన్నాడు మౌగ్లీ.

అట్ట చివరి బొమ్మ



"ఏన్లి తీసుకు పోండి. నెమలి లాగా నాట్యం చేస్తున్నాడు. మా పిల్లల్ని తొక్కేస్తాడు," అన్నారు మండపంలోని పాములు.

"ఆహా! ఈ మనిషికూనకు అందరూ స్నేహితులేనే! మనిషికూనా, కొంచెం దూరం వెళ్ళు. విషపు జీవుల్లారా, వెళ్ళి దాక్కోండి. నేనీ గోడ పడగొట్టబోతున్నాను," అన్నాడు కావా.

అతను చలవరాతి చెక్కడపు గోడలో బీట ఉన్న చోటు వెతికి, గురి కోసం ముక్కుతో అక్కడ రెండు మూడుసార్లు తేలికగా కొట్టి, తన శరీరంలో ఆరడుగులు పైకి లేపి, అరడజను బలమైన దెబ్బలు కొట్టాడు. చెక్కడం పొడి పొడి అయి, రాలి పడింది. ఇంత ధూళి లేచింది. అక్కడ ఏర్పడిన కంతలో నుంచి మౌగ్లీ బయటికి దూకాడు. అతను భాలూ మీద ఒక చెయ్యీ, బాఘీర మీద ఒక చెయ్యీ వేసి, ఇద్దరినీ కౌగలించుకున్నాడు.

భాలూ మౌగ్లీని మృదువుగా కౌగలించుకుంటూ, "గాయపడ్డావా, నాయనా?" అని అడిగాడు.

"గాయాలే కాదు, ఆకలి దహించుకుపోతున్నది. అయ్యయ్యో, మీ రిద్దరూ బాగా గాయపడ్డారే! నెత్తురు కూడా కారుతున్నది!" అన్నాడు మౌగ్లీ.

నీటితొట్టెల దగ్గిరా, డాబా ప్రదేశం మీదా చచ్చిపడి ఉన్న మర్కటులను చూస్తూ, "గాయపడింది అచ్చగా మేమే కాదులే!" అన్నాడు బాఘీర, పెదవులు నాక్కుంటూ.

"ఏమీ ఫరవా లేదు. నువ్వు బతికుండటమే చాలురా, కప్పాయ్!" అన్నాడు భాలూ, మౌగ్లీ వీపుతడుతూ.

"అదంతా తరవాత చూసుకోవచ్చు. ముందు కావాకు కృతజ్ఞత చెప్పుకో, మౌగ్లీ. అతను లేకపోతే ఈ యుద్ధం సాధ్యమయేది కాదు, నువ్వు దక్కేవాడివీ కావు," అన్నాడు బాఘీర.

మౌగ్లీ కావా కేసి తిరిగాడు. కావా తల మౌగ్లీ తలకు ఒక అడుగు ఎత్తున ఆడుతున్నది. "ఇతగాడా మనిషికూన? ఒళ్ళు మహా మెత్తగా ఉంది. మసకవెలుగులో నిన్ను చూసి మర్కటు డనుకోగలను, జాగ్రత్తరా, బాబూ," అన్నాడు కావా.

మౌగ్లీ కృతజ్ఞత తెలుపుకుని, అవసరమైనప్పుడు కావాకు వేటలో సహాయపడతానన్నాడు. కావా ఒక్క క్షణంపాటు తన మెడను మౌగ్లీ భుజం మీద ఆనించి, వృద్ధిలోకి రమ్మని ఆశీర్వదించి, "చంద్రుడు అస్తమించుతున్నాడు. ఇక నువు నీ మిత్రులతో వెళ్ళిపోయి, నిద్రతియ్యి. ఇక్కడ జరగబోయే కర్మకాండ నువు చూడదగినది కాదు," అన్నాడు.

చంద్రుడు కొండల చాటుకు పోతున్నాడు. భాలూ నీళ్ళు తాగటానికి వెళ్ళాడు. బాఘీర తన శరీరమంతా శుభ్రం చేసుకున్నాడు. కావా మిద్దె మధ్యకు పాకి వెళ్ళాడు. మర్కటులు మసకచీకట్లో గోడల మీదా, గొబ్బెల మీదా ఎత్తున ఒకరినొకరు ఒరుసుకుని కూర్చుని ఉన్నారు.

"చంద్రుడు అస్తమించాడు. మీకు చూపు అనుతున్నదా?" అని కావా మర్కటుల నడిగాడు.



"చూస్తున్నాం, కావా," అన్నారు మర్కటులు.

"కదలకండి. ఆకలినృత్యం చూడండి," అంటూ కావా తలను ఈ పక్కకూ, ఆ పక్కకూ ఆడిస్తూ ఒక పెద్ద వలయంలో రెండు మూడుసార్లు తిరిగి, అతి వేగంగా తన శరీరాన్ని రకరకాల రేఖలలో తిప్ప సాగాడు. ఎనిమిది సంఖ్యలూ, చతురస్రాలూ కనిపించి మాయమవుతున్నాయి.

భాలూ, బాఘీరలు కొయ్యబారి పోయి కావా శరీరపు కదలికల కేసి చూస్తున్నారు.

"మర్కటులారా, దగ్గిరికి రండి," అన్నాడు కావా.

మర్కటులు, ఎవరో లాగినట్టుగా కావా కేసి ఒక అడుగు వచ్చారు. వాళ్ళతోబాటు భాలూ, బాఘీరలు కూడా ముందుకు ఒక అడుగు వేశారు.

"ఇంకా దగ్గిరికి!" అని కావా పెద్ద కేక పెట్టాడు.

మౌగ్లీ, భాలూ బాఘీరల మీద చేతులు వేసి, వాళ్ళను వెనక్కు లాగాడు. వాళ్ళిద్దరూ నిద్రమేలుకున్నట్టుగా అయారు.

"చెయ్యి తియ్యకు, తమ్ముడూ. లేకపోతే నేను కావా దగ్గిరికి పోతాను," అన్నాడు బాఘీర రహస్యంగా.

"ఏముంది అందులో? కావా మెలికలు తిరుగుతున్నాడు. మనం పోదాం," అన్నాడు మౌగ్లీ.

వాళ్ళు మళ్ళీ అరణ్యవృక్షాల కిందికి చేరాక భాలూ పెద్దగా శ్వాస విడిచి, "ఓహో! నే నెన్నటికీ కావా స్నేహం కట్టను," అన్నాడు.

"వాడు మన తలదన్నినవాడు. ఇంకొక్క క్షణం ఉంటే నేను వాడి నోట్లోకే నడిచి ఉందును," అన్నాడు బాఘీర.

"తిరిగి చంద్రుడు ఉదయించే లోపుగా ఆ నోట్లోకి ఎందరు నడవనున్నారో! వాడి వేట బాగానేసాగుతుంది," అన్నాడు భాలూ.

"పెద్ద పాము అర్థం లేకుండా మెలికలు తిరగటం తప్ప నా కేమీ కనిపించ లేదే?" అన్నాడు మౌగ్లీ. కావా నృత్యంలో గల సమ్మోహనశక్తి మౌగ్లీకి అర్థం కాలేదు. అతను మనిషికూన.

మౌగ్లీని బాఘీర తన వీపు మీద ఎక్కించుకుని బయలుదేరాడు. మౌగ్లీ బాఘీర వీపు మీదనే నిద్రపోయాడు. భాలూ బాఘీరలు తనను గుహకు చేర్చటమూ, తోడేలమ్మ సరసన పడుకో బెట్టటమూ కూడా వా డెరగడు....

ఆ విధంగా పసితనం లోనే మౌగ్లీకి కావాతో పరిచయం కలిగింది.





# అరణ్యపురాణం

## 22

మోగ్లీ మనుషుల మధ్యనుంచి అరణ్యానికి తిరిగి వచ్చాక, అతనికి కావాతో ఉండిన పాతస్నేహం అలాగే ఉండి పోయింది. ఆనాడు కోతులు తనను శిథిలాలకు ఎత్తుకు పోయినప్పుడు కావా వాళ్ళందరినీ చిత్రవధ చేసి తనను కాపాడిన సంగతి మోగ్లీ ఏనాడూ మరవలేదు.

కావా మరొకసారి కుబుసం విడిచిన సంగతి తెలిసి మోగ్లీ అతన్ని పరామర్శించ టానికి వెళ్ళాడు. కుబుసాన్ని విడిచాక, కొత్త చర్మం కాస్త బిరుసెక్కే దాకా కావా నిస్తేజంగా ఉంటాడు.

మోగ్లీ ఇప్పుడు కావాకు పాతనాటి మనిషి కూనకాడు. మిగిలిన అరణ్యవాసులందరితో పాటు కావా కూడా అతన్ని అరణ్యానికి నాయకుడుగా ఆమోదించి, అరణ్య వార్తలన్నీ అతనితో చెబుతున్నాడు.

అపరాహ్ణం అయింది. కావా శరీరపు చుట్టలమధ్య మోగ్లీ, కుర్చీలో చేరగిలబడి కూర్చున్నట్టు కూర్చుని ఉన్నాడు. అతను చుట్టూతా పడి ఉన్న కావా కుబుసాన్ని వేళ్ళతో పట్టి చూస్తున్నాడు.

"కళ్ళ మీది పొరకూడా ఎంత స్పష్టంగా ఉందో!" అన్నాడు మోగ్లీ.

"నీ చర్మం ఎన్నడూ పాతబడి పెళుసు బారదా?" అని కావా అడిగాడు.

"అలా అనిపించి నప్పుడు వెళ్ళి స్నానం చేస్తాను. ఉక్క మరీ జాస్తిగా ఉన్నప్పుడు, చర్మమంతా ఊడిపోయి, వంగిత్తితే బాగుండు నని అనిపించే మాట నిజం," అన్నాడు మోగ్లీ.

"నేను చర్మమూ విసర్జిస్తాను, స్నానమూ చేస్తాను. కొత్త చర్మం ఎలా ఉంది?" అని కావా అడిగాడు.

అట్ట చివరి బొమ్మ



మౌగ్లీ కావా చర్మంమీది పొరల మీదుగా నిమురుతూ, "తాబేలు చర్మం ఇంతా గట్టిగా ఉంటుంది గాని దానికి సొంపు లేదు. సీతాకోకచిలుక రెక్కమీది చుక్కల్లాగా, చాలా అందంగా ఉంది," అన్నారు.

"అది నీరు తగిలితే గాని మెరుపెక్కదు. వెళ్ళి స్నానం చేద్దాంపద," అన్నారు కావా.

"నేను నిన్ను ఎత్తేదీ?" అంటూ మౌగ్లీ కావా మధ్య భాగాన్ని పట్టుకుని ఎత్తాలని చూశారు. అది చచ్చినా కదలలేదు. కావా తమాషా చూస్తూ ఉండిపోయారు.

ఆ తరవాత వాళ్ళ నిత్య వ్యాయామక్రీడ ఆరంభమయింది. ఇద్దరూ కుస్తీ పట్టేవాళ్ళు. అది బలానికీ, దృష్టికీ కూడా పరీక్ష. రెంటిలోనూ కావాదే పై చెయ్యి. కాని, మౌగ్లీ దృఢకాయుడయాక, అతని శక్తులను పెంపొందించటానికి కావాయే ఈ ఆట మౌగ్లీకి నేర్పారు. ఒకసారి కావా మౌగ్లీని తన చుట్టలలో పాదాలనుంచి కంఠందాకా చుట్టేసేవాడు. అప్పుడు మౌగ్లీ తన చేతిని విడిపించుకుని, కావా కంఠాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించేవాడు. తరవాత కావా తన చుట్టలను కాస్త వదులు చేసేవాడు. మౌగ్లీ తన రెండు పాదాల కిందా కావా తోకను తొక్కి పట్టటానికి ప్రయత్నించేవాడు. కావా తన తలను మౌగ్లీ కేసి వేగంగా, కొట్టబోయేలాగా విసిరేవాడు. మౌగ్లీ అతి నేర్పుగా అతని తలను పక్కకు నెట్టేసి, దెబ్బను తప్పించుకో జూసేవాడు. కాని అది సాధ్యమయేది కాదు. మౌగ్లీకి దొరకకుండా కావా అతని శరీరాన్ని, తలచుకున్న చోటల్లా తలతో తాకేవాడు. చిట్ట చివరకు కావా మౌగ్లీని ఒక్క గట్టిదెబ్బ కొట్టి, అంత దూరాన పడేటట్టు చెయ్యటంతో ఈ ఆట ముగిసేది. మౌగ్లీ నవ్వుతూ, రొప్పుతూ లేచి వచ్చేవాడు.

ఇవాళ కూడా ఈ ఆట అలాగే ముగిసింది. తరవాత ఇద్దరూ బండరాళ్ళ

మధ్యన ఉన్న చీకటి కోనేరుకు వెళ్ళి, అందులో ఊతలు కొట్టారు.

"ఇదే నిజమైన సుఖం. మనిషి మందలో ఈ సమయానికి మనుషులు మంచిగాలి రాకుండా తలుపులన్నీ బిగించి, కొయ్య బల్లలమీద పడుకుని, కంపుగుడ్డలు నిలువునా కప్పుకుని, ముక్కులకుండా ముదనష్టపు పాటలు ప్రారంభించేవాళ్ళు—నాకు బాగా జ్ఞాపకం. అరణ్యం చాలా మెరుగు," అన్నాడు మోగ్లీ మత్తుగా.

ఎక్కడనుంచో ఒక తాచుపాము రాళ్ళు దిగివచ్చి, నీరుతాగి, "వేటసాగాలి!" అని తన దారిన వెళ్ళిపోయాడు.

"అయితే, తమ్ముడూ. నీకు కావలసిన దంతా అరణ్యంలో దొరుకుతున్న దంటావా?" అని అడిగాడు కావా.

"అంతా ఎక్కడ దొరుకు తున్నదిలే! దొరికితే నెలకొక షేర్‌ఖాన్‌ను చంపక పోయానా? వానా కాలంలో ఎండా, ఎండా కాలంలో వానా వస్తే ఎంత బాగుండును! కడుపు మాడేటప్పుడు ఒక మేక దొరక్క పోయెనే అనిపిస్తుంది. మేక దొరికితే అది లేడి కాకపోయెనే అనిపిస్తుంది. లేడి దొరికితే అడివి దున్న కాకపోయెనే అనిపిస్తుంది. అందరికీ అంతే!" అన్నాడు మోగ్లీ.



"నీ కింకే కోరికాలేదా?" అని కావా అడిగాడు.

"అరణ్యం తీర్చలేని కోరికంటూ ఏ ముంది?" అన్నాడు మోగ్లీ.

"ఆ తాచు చెప్పటం—" అని కావా ప్రారంభించాడు.

"ఏ తాచు? ఆ తాచు ఏమీ చెప్పనే లేదే?" అన్నాడు మోగ్లీ.

"నీరుతాగి పోయిన తాచుకాదు, ఇంకో తాచులే," అన్నాడు కావా.

"నువ్వు విషపుపురుగులతో స్నేహం కట్టవను కుంటానే! నువ్వే పడగతో మాట్లా డావు?" అని మోగ్లీ అడిగాడు.

"మూడు, నాలుగు నెల లవుతుంది. శిథిలాలలో వేటకు వెళ్ళాను. నీకా చోటు జ్ఞాపకం ఉండే ఉంటుంది. అక్కడ నే నొక సారంగంలో వేటచేసి, చిన్న కునుకు తీశాను. తరవాత నిద్రలేచి, ఆ సారంగం కుండానే ఇంకా ముందుకు పోయేసరికి ఒక తెల్లపడగ కనిపించింది. అతను నాకు తెలిసిన విషయాలెన్నో చెప్పాడు, నే నెన్నడూ చూడనివి ఎన్నో చూపాడు," అన్నాడు కావా.

"కొత్తరకం ప్రాణులా? వేటాడ దగిన వేనా?" అని మౌగ్లీ ఆసక్తితో అడిగాడు.

"వాటిని వేటాడను. వేటాడితే పళ్ళన్నీ ఊడి చక్కాపోతాయి. మనిషి అయిన వాడు వాటిని చూడటానికి ప్రాణాలైనా అర్పిస్తాడట, తెల్లపడగ అన్నాడు," అన్నాడు కావా.

"పోయి చూద్దామా ఏం? నేను కూడా ఒకప్పుడు మనిషినేగా?" అన్నాడు మౌగ్లీ.

"అటే, అట్టే! ఆ తెల్లపడగ కెంత వయసనుకున్నావు? అరణ్యమంత వయసు! అతనితో నిన్ను గురించి చెప్పాను. తాను మనిషిని చూసి చాలా కాలమయిందిట. నిన్ను తీసుకురమ్మన్నాడు. అక్కడ ఉన్న వస్తువులు చూడటానికే మనిషి ప్రాణాలైనా బలి పెడతాడట!" అన్నాడు కావా.

"అదేదో వేటాడదగినదే అయి ఉండాలి," అన్నాడు మౌగ్లీ.

"కానే కాదు. అది—దాన్ని ఎట్లా వర్ణించాలో నాకు తెలియటంలేదు," అన్నాడు కావా.

"అక్కడికి పోదాం. నే నెన్నడూ తెల్ల నాగును చూడలేదు. అతను వాటిని చంపేసి ఉంటాడా?" అని మౌగ్లీ అడిగాడు.

"వాటికి ప్రాణం ఉండదు. అతను వాటికి రక్షకుడుట!" అన్నాడు కావా.

"పోదాం పద," అంటూ మౌగ్లీ నీటిలో నుంచి బయటికి వచ్చి, ఒళ్ళు తడి ఆరటానికి గడ్డి మీద పొర్లిగింతలు పెట్టాడు.

తరవాత ఇద్దరూ కలిసి శిథిలాల కేసి బయలుదేరారు.





# అరణ్యపురాణం

## 23

ఇప్పుడు మౌగ్లీకి వానరులంటే ఏ మాత్రమూ లక్ష్యం లేదు. వానరులకే మౌగ్లీ అంటే గుండె దడ. అయితే మౌగ్లీ శిథిలాలను చేరే సమయానికి వానరమూకలు అరణ్యంలోని కొన్ని ప్రాంతాల మీదికి దాడి పోయి ఉండటం చేత శిథిలాలు నిర్జీవంగా ఉన్నాయి. అంతటా నిశ్శబ్దం, వెన్నెల కాస్తున్నది.

కావా మిద్దె ప్రాంతం మీద ఉండే రాణి వాసపు మేలుకట్టు మీదుగా పాకి, దాని మధ్యగా ఉన్న మెట్ల వెంబడి కిందికి దిగ సాగాడు. ఆ మెట్లు కూడా శిథిలావస్థ లోనే ఉన్నాయి.

"మనమూ మనమూ ఒకటే," అని మౌగ్లీ పాముభాషలో కేక పెట్టాడు. అతను మెట్లు దిగటానికి కాళ్లమీదా చేతులమీదా కూడా కదలవలసి వచ్చింది. మెట్ల దిగువన దారి ఏటవాలుగా దిగిపోయింది. అది అనేక మెలికలుగల దారి. కొంతదూరం పోయాక రాతి కట్టడంలో నుంచి ఒక పెద్ద వేరు తోసుకు వచ్చి ఉండటం కనిపించింది. దాని తాలూకు మహా వృక్షం మొదలు ముప్ఫై అడుగులు ఎగువన ఉన్నది. వాళ్ళు ఒక ఇరుకు సందుకుండా దూరి ఒక నేల గది లోకి అడుగు పెట్టారు. అది చాలా విశాలంగా ఉన్నది. డిప్పలాగా ఉన్న దాని కప్పు నుంచి కూడా అక్కడక్కడా చెట్ల వేళ్ళు దిగాయి. కప్పులో రంధ్రాలు ఏర్పడటంవల్ల కొద్దిపాటి కాంతికిరణాలు గదిలోకి ప్రవేశిస్తున్నాయి.

"ఇది చాలా క్షేమకరమైన గుహ. అయితే రోజూ వచ్చి పోవటానికి మరీ దూరమై పోయింది. ఇక్కడ మనం చూడ వలసినదేమిటి?" అన్నాడు మౌగ్లీ.

"నేనున్నాను కానా?" అని గది మధ్య నుంచి ఒక కంఠం ప్రశ్నించింది. ఏదో

అట్ట చివరి బొమ్మ



తెల్లగా కదులుతూ ఉండటం మౌగ్లీకి కనబడింది. కొంచెం కొంచెమే లేస్తూ ఒక తాచుపాము అతని కళ్ళ ఎదట నిలబడింది. మౌగ్లీ తన జీవితంలో అంతపెద్ద తాచును ఎన్నడూ చూడలేదు. ఆ సర్పం నిడివి దాదాపు ఎనిమిది అడుగులుంటుంది. చీకటిలోనే ఉండటంచేత అతను పాలిపోయి పాత దంతం రంగుగా తయారయాడు. విప్పిన అతని పడగమీది కృష్ణపాదాలు కూడా మాసిపోయిన పసుపు పచ్చరంగు తిరిగాయి. అతని కళ్ళు కెంపుల్లాగా మెరుస్తున్నాయి. చూడటానికి అతను చక్కగా దివ్యంగా ఉన్నాడు.

"వేట సాగాలి," అన్నాడు మౌగ్లీ. అతను కత్తిని అస్తమానమూ బొడ్డున పెట్టుకు తిరిగినా, అరణ్య మర్యాదలను పాటించటం మరిచిపోడు.

తెల్లపడగ మౌగ్లీ మాటకు బదులు చెప్పక, "నగరం ఎలా ఉంది? నూరు ఏనుగులూ, ఇరవైవేల గుర్రాలూ, లెక్కించరానన్ని పశువులూ గల మహా వగరం! ఇరవై మంది రాజులకు రారాజు ఏలే నగరం! నాకిక్కడ చెవుడు వచ్చేస్తున్నది. వాళ్ళ యుద్ధ దుందుభుల ధ్వనులు విని ఎంతో కాలమయింది," అన్నాడు.

"ఎగువ అరణ్యం మాత్రమే ఉన్నది. నేను ఎరిగిన ఏనుగులు హాథీ, అతని కొడుకూ మాత్రమే. ఒక గ్రామంలో ఉన్న గుర్రాలన్నిటినీ బాఘీర చంపేశాడు. పోతే—రాజు అంటే ఏమిటి?" అన్నాడు మౌగ్లీ.

"నీ నగరం ఇప్పుడు లేదని నీతో నాలుగు నెలల క్రితమే చెబితిని కాదుటోయ్?" అన్నాడు కావా తెల్లపడగతో.

"అరణ్యం మధ్య, రాజుగారి పహరా బురుజులు గల ద్వారాలతో కూడిన నగరం ఎలా పోతుంది? నా తండ్రికి తండ్రి గుడ్డు నుంచి బయటికి రాకపూర్వం కట్టిన నగరం అది. నా కొడుకుల కొడుకులు నాలాగా పాలి

పోయేదాకా అది నిలిచి ఉంటుంది. యాగసూరి కొడుకు విజయుడు; అతని కొడుకు చంద్రబీజుడు; అతని కొడుకు సలోంథీ బప్పారావల్ హయాంలో దాన్ని నిర్మించాడు. మి రెవరి పశువులు?" అన్నాడు తెల్లపడగ.

మౌగ్లీ కావా కేసి తిరిగి, "అయోమయంలో పడ్డాను. అతడి మాట ఒక్కటీ నా కర్థం కావటంలేదు," అన్నాడు.

"నాకూ అలాగే ఉంది. అతను మహా వృద్ధు," అని కావా మౌగ్లీతో అని, తెల్లపడగతో, "నాగపితామహా, ఈ ప్రాంతంలో అనాదిగా అరణ్యమే ఉంటున్నది," అని చెప్పాడు.

"అలా అయితే, నా కెదురుగా కూర్చున్న ఇతగా డెవడు? ఇతడికి రాజుగారి పేరు తెలీదు. భయం ఎరగడు. మనిషి నోటితో సర్ప భాష మాట్లాడతాడు. పామునాలుక తోబాటు కత్తి కూడా ధరించాడు. ఎవ రితడు?" అన్నాడు తెల్లపడగ.

ఆ ప్రశ్నకు మౌగ్లీ జవాబు చెబుతూ, "నన్ను మౌగ్లీ అంటారు. నేను అరణ్యవాసిని. తోడేళ్ళు నావాళ్ళు. ఈ కావా నాకు అన్న. నాగపితామహా, నువ్వెవరు?" అని అడిగాడు.



"నేను రాజనిక్షేప రక్షకుణ్ణి. నా చర్మం నల్లగా ఉన్న కాలంలోనే కరుణరాజా ఈపైన ఉన్న కప్పుకట్టాడు! దొంగతనానికి వచ్చే వారికి చావు చవిచూపమని నా కోసం ఈ ఏర్పాటు చేశాడాయన. తరవాత రాతి ద్వారం కుండా నిధిని లోపలికి దించారు. బ్రాహ్మణులు గాసం చేశారు," అన్నాడు తెల్లపడగ.

మౌగ్లీ స్వగతం, "ఓహో, ఇందులో ఏదో చెరుపు ఉన్నది. తెల్లపడగ చెప్పేది సామాన్య విషయంకాదు. మనిషి మంద వెంట ఉన్నప్పుడు ఒక బ్రాహ్మడి సంగతి తెలుసుకున్నాను," అనుకున్నాడు.

తెల్లపడగ చెప్పుకు పోతున్నాడు:

"నే నిక్కడికి పచ్చాక అయిదు సార్లు రాతి పలక ఎత్తి, మరింత నిధి దించారు. ఇంత గొప్ప నిధి మరెక్కడా లేదు—నూరు రాజుల నిధి. అయితే ఆఖరుసారి పలక ఎత్తి చాలా, చాలా కాలమయింది. నా నగరం నన్ను మరిచిపోయిందో ఏమో మరి."

"అసలు నగరమే లేదు. పైకి చూడు. ఆ కనిపించేవి, రాళ్ళను చీల్చుకుని దిగుతున్న మహావృక్షాల వేళ్ళు. చెట్లూ, మనుషులూ కలిసి పెరగరు," అన్నాడు కావా.

తెల్లపడగ కసిగా, "రెండు, మూడు సార్లు మనుష లిక్కడ ప్రవేశించారు. నేను చీకట్లో పాకి వాళ్ళను చేరవచ్చేసరికా వాళ్ళేమీ మాట్లాడలేదు. ఆ తరవాత వాళ్ళు బహు కొద్దిసేపు మాత్రమే పలవలలాడారు. మీరేమో వచ్చి నాతో నానా అబద్ధాలూ ఆడుతున్నారు—ఒక మనిషి ఒక సర్పమూనూ. నగరమే లేదనీ, నా రక్షణపని ముగిసిందనీ నన్ను నమ్మమంటాడు! రాతి పలక ఎత్తి, బ్రాహ్మలు గానం చేస్తూ దిగి వచ్చి, నాకు వెచ్చని పాలు పోసి, వెలుగులోకి తీసుకు పోయేదాకా నేను రాజనిక్షేప రక్షకుణ్ణే! నగరం చచ్చిపోయిందా? అవి చెట్లవేళ్ళా? అయితే వంగి ఈ రత్నాలను తీసుకోండి చూస్తాం. ప్రపంచంలో ఇంత విలువైనవి మరి లేవు. పామునాలుక మనిషీ, నువ్వు వచ్చినదారినే ప్రాణాలతో తిరిగి పోగలిగితే చిన్న చిన్న రాజులందరూ నీకు బానిసలైపోగలరు!" అన్నాడు తెల్లపడగ.

"మళ్ళీ దారి తప్పుతున్నది. నాగపితామహా, తీసుకు పోవటానికి ఇక్కడ ఏమీ కనబడదే?" అన్నాడు మౌగ్లీ.

"సూర్య చంద్రుల సాక్షిగా, ముక్కోటి దేవతల సాక్షిగా ఈ అబ్బాయికి చావు పిచ్చి పట్టుకున్నది. నువు కళ్ళు మూసేలోపుగా నీకు ఏ మానవుడూ చూడనిది చూపిస్తాను, చూడు," అన్నాడు తెల్లపడగ.





# అరణ్యపురాణం

## 24

మౌగ్లీ చుట్టూ పరికించి చూసి, నేల మీది నుంచి తళతళా మెరిసే దాన్ని గుప్పిట పైకి తీశాడు.

"ఓహో, మనిషి మందలో ఆటకు ఉపయోగించే వాటి లాగే ఉంది. ఇది పసుపు పచ్చగా ఉన్నది, అవి గోధుమ రంగుగా ఉండేవి. అంతే తేడా," అంటూ అతను బంగారపు ముద్దను కింద పడ నిచ్చాడు. ఆ చీకటి కొట్టులో కొన్ని అడుగుల లోతున వెండి, బంగారు నాణాలున్నాయి. వాటిలో సగం కూరుకుని ఏనుగు అంబారీలున్నాయి. అవి బంగారు రేకుతో తయారు చేసి, రత్నాలు పొదిగినవి. రాజులు ఎక్కి తిరిగిన పల్లకీలున్నాయి. వాటికి వెండి నగిషీలున్నాయి.

తెల్లపడగ చెప్పిన మాట నిజం. ఈ నిధికి మూల్యం కట్టడం సాధ్యం కాదు. ఎన్నో శతాబ్దాల మీద యుద్ధాలద్వారానూ, దోపిడీ చేసీ, వర్తకం జరిపీ, పన్నులు వసూలు చేసీ కూడబెట్టిన నిధి ఇది.

అయితే వీటి విలువ మౌగ్లీకి కొంచెం కూడా తెలియదు. కత్తులు అతన్ని కొద్దిగా ఆకర్షించాయి. కాని, తన కత్తికున్న "పట్టు" వాటికి లేకపోవటం వల్ల వాటిని జార విడిచేశాడు. చిట్టచివరకు అతని దృష్టిని ఒక అంకుశం ఆకర్షించింది. దాని పిడి చివర ఒక గుండ్రని, పెద్ద కెంపు ధగధగలాడుతున్నది. దాని దిగువ ఎనిమిది అంగుళాల మేర నీలపు రాళ్ళు ఒత్తుగా అమర్చబడి ఉండి, పట్టు బాగా చిక్కటానికి వీలుగా ఉన్నాయి. మిగిలిన పిడి అంతా దంతంతో చేసినది. దాని చివర ఉన్న ముల్లూ, కొక్కెమూ ఉక్కువి. వాటిపైన బంగారు రేకున్నది. వాటి మీద ఏనుగుల బొమ్మలు

అట్ట చివరి బొమ్మ



చిత్రించి ఉన్నాయి. ఆ బొమ్మలే మౌగ్లీని ఆకర్షించాయి. వాటిని చూస్తుంటే హాథీ జ్ఞాపకం వచ్చాడు.

మౌగ్లీ ప్రతి చర్యనూ ఎంతో శ్రద్ధగా గమనిస్తున్న తెల్లపడగ, "ఇదంతా ఒక్కసారి కళ్ళ చూడటానికి ప్రాణాలర్పిస్తే మాత్రం ఏమిటి? నేను నీకు మహోపకారం చేశాను కానూ?" అన్నాడు.

"నా కేమీ అర్థం కావటం లేదు. ఇవన్నీ కఠినంగానూ, చల్లగానూ ఉన్నాయి. తినటానికి పనికిరావు. కాని, ఇది బాగుంది. దీన్ని పట్టుకు పోయి, ఎండలో చూడాలి," అంటూ అంకుశం ఎత్తి చూపించి, "ఇవన్నీ నీవేనంటావా? దీన్ని నా కిస్తావా? నువు తినటానికి కప్పలను తెచ్చి పెడతాను," అన్నాడు మౌగ్లీ.

తెల్లపడగ క్రూరమైన ఆనందంతో ఉబ్బిపోతూ, "తప్పక ఇస్తాను. ఇక్కడ ఉన్న నిధినిక్షేప మంతా నీదే—నువు వెళ్లిపోయే దాకా!" అన్నాడు.

"నే నింక వెళ్ళిపోతున్నాను. ఈ చోటు చీకటిగానూ, చలిచలిగానూ ఉన్నది. ఈ ముల్లుకర్రను అరణ్యానికి తీసుకుపోతాను," అన్నాడు మౌగ్లీ.

"అరణ్యానికి తీసుకు పోతావా? సరే.... ముందు, నీ కాలి దగ్గిర అదేమిటో చూడు!" అన్నాడు తెల్లపడగ.

మౌగ్లీ ఒక మనిషి కపాలాన్ని పైకి ఎత్తి, "మనిషి తలఎముక. అక్కడ ఇంకా రెండున్నాయి," అన్నాడు.

"వాళ్ళు కొన్ని ఏళ్ళక్రితం ఈ నిధిని ఎత్తుకు పోదామని వచ్చారు. చీకట్లో నేను వాళ్ళను పరామర్శించాను. తరవాత వాళ్లు కదలలేదు," అన్నాడు తెల్లపడగ.

"నిధి, నిధి అంటావు. నా కెందు కానిధి? నా కీ ముల్లుకర్ర కావాలి. దీన్ని నా కిచ్చావా వేట సాగాలి. లేకపోయినా వేట సాగాలి. నేను విషప్రాణులతో పోరాడను. మీ వాళ్ల

డగ్గిర నేను అభయమంత్రం కూడా నేర్చుకున్నాను," అన్నాడు మౌగ్లీ.

"ఇక్కడ అభయమంత్రం నా ఒక్కడిదే!" అన్నాడు తెల్లపడగ.

కావా, కళ్ళు జ్యోతుల్లాగా మెరుస్తూ, ముందుకు దూకి, "మనిషిని తీసుకు రమ్మన్నదెవరు?" అని అడిగాడు.

"నే నే-అన్నాను. నేను మనిషిని చూసి ఎంతో కాలమయింది. ఈ మనిషి సర్పభాష మాట్లాడతాడు కూడానూ," అన్నాడు తెల్లపడగ.

"కాని అప్పుడు చంపటం మాట రాలేదు. నేను ఒంటరిగా అరణ్యానికి తిరిగి పోయి, ఇతన్ని మృత్యువుకు అప్పగించి వచ్చానని చెప్పనా?" అన్నాడు కావా.

తెల్లపడగ అహంకారంగా, "చంపటం గురించి ముందుగా మాట్లాడే అలవాటు నాకు లేదు. నువ్విక్కణ్ణించి వెళ్ళినా, మానినా, గోడలో సారంగం ఉండనే ఉంది. కోతులను చంపేవాడా, జాస్తిగా మాట్లాడకు. నేను నీ మెడ మీద తాకానంటే చాలు, నువు సొదిలోకి మిగలకుండా పోతావు. ఇక్కడికి వచ్చిన మనిషి ఊపిరితో తిరిగి పోవటమన్నది ఏనాడూ జరగలేదు. నే నీ నగర రాజ నిక్షేపరక్షకుణ్ణి!" అన్నాడు.



"ఓరి పాలిపోయిన చీకటి పురుగా, నేను మళ్ళీ చెబుతున్నాను, విను. నీ రాజూ లేడు, నగరమూ లేదు. మన చుట్టూ ఉన్నది అరణ్యం," అన్నాడు కావా.

"నిధి ఉన్నది గద. పోనీ ఓ పని చేద్దాం. కుర్రాణ్ణి పరిగెత్తమని, నువు వినోదం చూడు, కావా. అటూ ఇటూ పరిగెత్తు కుర్రాడా, ఆడుకుందాం!" అన్నాడు తెల్లపడగ.

మౌగ్లీ కావా నెత్తిమీద నెమ్మదిగా చెయ్యి పెట్టి, రహస్యంగా, "ఈ తెల్లవాడి కింతవరకూ మనిషి మందలో వాళ్ళ సంగతే తెలుసు. నా సంగతి ఎరగడు. వేట కావాలిట వాడికి. ఇద్దాం," అన్నాడు.

అతను తన చేతిలో ఉన్న అంకుశాన్ని చప్పున తెల్లపడగ మెడ మీద పడేటట్టుగా వేశాడు. దాని బరువు కింద తెల్లపడగ కదల లేక పోయింది. మెలికలు తిరుగుతున్న తెల్లపడగ శరీరం మీద కావా దూకి, "చంపు!" అని కేక పెట్టాడు.

మౌగ్లీ కుడిచెయ్యి అప్రయత్నంగా కత్తి మీదికి పోయింది.

"చంపను. ఆకలికి తప్ప ఇంకెన్నడూ చంపను," అని మౌగ్లీ తెల్లపడగను మెడ వెనక పట్టుకుని అతని నోరు కత్తితో పగల దీసి, "చూడు, కావా! బెరడు!" అన్నాడు. తెల్లపడగ పై దవడలో భయంకరమైన విషపు కోరలున్నాయి. కాని చిగుళ్ళు పడిలిపోయి, నల్లగా ఉన్నాయి. వాటిలో విషం వట్టి పోయింది.

మౌగ్లీ తెల్లపడగ మెడ మీది నుంచి అంకుశం ఎత్తి, అతన్ని విడిచి పుచ్చుతూ, "రాజనిక్షేపానికి కొత్త రక్షకుడు రావాలి, బెరడూ. నువు చెయ్యరాని పని చేశావు, బెరడూ. నువే, అటూ ఇటూ పరిగెత్తి ఆడుకో," అన్నాడు.

"ఇంత అవమానం భరించలేను. నన్ను చంపెయ్యి," అన్నాడు తెల్లపడగ.

"నీ చంపటాలతో చాలి వచ్చింది. ఇక ఈ ముల్లుకర్రను నేను పట్టుకు పోతాను. నిన్ను ఓడించాను గద!" అన్నాడు మౌగ్లీ.

"దాని మూలంగా చావు రాకుండా చూసుకో! అది మృత్యువు! జ్ఞాపకం ఉంచుకో! నా నగరంలో ఉండే ప్రతి ఒక్కరికీ సరిపడ్డంత మృత్యువు దానిలో ఉన్నది. అది ఎంతోకాలం నీకు దక్కదు, అడివి మనిషీ. నీ దగ్గిర నుంచి లాగుకునే వాడికీ దక్కదు. దాని కోసం హత్యల పరంపర సాగుతుంది. నా శక్తి ఉడిగిపోయింది. ఇక నేను చెయ్యవలిసిన పనిని ఆ అంకుశమే చేస్తుంది. అది మృత్యువు! మృత్యువు! మృత్యువు!" అన్నాడు తెల్లపడగ.





# అరణ్యపురాణం

## 25

మౌగ్లీ కంత కుండా పాకి బయటికి వచ్చేటప్పుడు తెల్లపడగ, "అది మృత్యువు! మృత్యువు!" అంటూ విగ్రహాలను కాటు వేస్తున్నాడు.

తిరిగి తమ అరణ్యంలోకి చేరుకోవటంతో కావాకూ, మౌగ్లీ కీ ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఉదయపు నీరెండలో మౌగ్లీ అంకుశాన్ని మెరిసేటట్టు తిప్పుతూ పరమానందం చెందాడు.

ఎండలో మెరిసే కెంపును చూసి అతను, "ఇది బాఘీర కంటి కన్న కూడా బాగా మెరుస్తున్నది. దీన్ని అతనికి చూపించాలి. అయితే ఆ బెరడుగాడు మృత్యువు గురించి ఎందుకు మాట్లాడినట్టు? నన్ను భయపెట్టాలనా?" అన్నాడు.

"నా కేం తెలుసు? నువు వాణ్ణి కత్తితో చంపెయ్యాలే దన్నదే నా విచారమల్లా... ఈ పూట వేటకు పోదాం, వస్తావా?" అన్నాడు కావా.

"లేదు. దీన్ని బాఘీరకు చూపాలి.... వేటసాగాలి!" అంటూ మౌగ్లీ పరిగెత్తుతూ, మధ్యమధ్య వంగి తన చేతిలోని అంకుశాన్ని చూసి ఆనందిస్తూ, బాఘీర ఉండే అరణ్య ప్రాంతానికి చేరుకున్నాడు.

బాఘీర అప్పుడే సుష్టుగాతిని, నీరు తాగుతూ కనిపించాడు. మౌగ్లీ తన అనుభవాలన్నీ పూసగుచ్చినట్టు చెబుతుంటే, బాఘీర ఆలకిస్తూ అప్పుడప్పుడూ అంకుశాన్ని మూజూశాడు. తెల్లపడగ అన్న ఆఖరు మాటకు బాఘీర ఆమోదం తెలపటం గమనించి మౌగ్లీ, "అయితే తెల్లపడగ అన్న మాట నిజమే నంటావా?" అన్నాడు.

"తమ్ముడూ, నేను ఉదయపూరు రాజా గారి బోనులో పుట్టినవాణ్ణి. నాకు మనుషుల

అట్ట చివరి బొమ్మ



సంగతంతా తెలుసు. ఆ ఎర్రరాయి కోసం ఒక్క రాత్రిలో మూడు హత్యలు చేసేవాళ్లు చాలామంది ఉంటారు," అన్నాడు బాఘీర.

"చేసేటందు కేమీ లేకపోతే మనుషులు హత్యలు చేస్తారని నాకూ తెలుసు. ఈ ఎర్ర రాయి తినటానికూ్కడా పనికి రాదే, దీని కోసం చంపటం దేనికని!" అన్నాడు మౌగ్లీ.

"మౌగ్లీ, నువు పడుకుని నిద్రపో! మనుషుల మందలో ఉన్నావు, కాని ఏం లాభం?" అన్నాడు బాఘీర, నిద్ర ముంచుకొస్తూ.

"ఈ ములికి గల వస్తువుతో ఏం పని, బాఘీరా?" అని మౌగ్లీ అడిగాడు.

"మనుషులు హాథీ సంతానాన్ని తలలో పొడిచి రక్తం తెప్పించటానికి! అలా మనిషి అజ్ఞలను అమలు చేసుకోవటానికి! గోళ్ళూ, కోరలూ లేని మనిషి ఇటువంటివీ, ఇంకా ఘోరమైనవీ సృష్టించుకున్నాడు!" అన్నాడు బాఘీర.

"ఛీ, ఛీ! మనిషిమందకు సంబంధించిన ప్రతిదీ రక్తం కళ్ళ చూసేదే! ఈ సంగతి తెలిస్తే దీన్ని తీసుకురాకనే పోదును," అంటూ మౌగ్లీ తన చేతిలో ఉన్న అంకుశాన్ని దూరంగా విసిరి వేశాడు. అది తళతళా మెరుస్తూ వెళ్ళి, ముప్పై గజాలదూరాన నేలలో గుచ్చుకున్నది. మౌగ్లీ మంచుతో తడిసిన గడ్డిమీద చేతులు రుద్దుతూ, "పీడ వదిలించుకున్నాను. ఆ బెరడుగాడు నేను చస్తానన్నాడు. పాలిపోయిన ముసిలి, వెర్రి పీనుగు!" అన్నాడు.

"రాత్రల్లా వేటాడి, పగలల్లా వాగటం నా వల్ల కాదు. నేను నిద్రపోతున్నాను, చిన్న తమ్ముడూ," అన్నాడు బాఘీర తన చోటికి బయలుదేరిపోతూ.

మౌగ్లీ మంచి చెట్టు చూసుకుని ఎక్కి, లతలు అల్లి ఉయ్యాల చేసుకుని, అందులో ఊగుతూ నిద్రపోయి, అందమైన ఎర్ర రాయి గురించి కలగన్నాడు. తిరిగి అతనికి



మెలకువ వచ్చేసరికి చీకటి పడుతున్నది. మర్కటులు చెట్లమీద పెద్దగా అరుస్తున్నారు.

"దాన్ని ఇంకోసారి చూసుకుందాం," అనుకుంటూ లతలుపట్టుకుని అతను కిందికి దిగి వచ్చాడు. అప్పటికే బాఘీర అక్కడ తారట్లాడుతూ, వసికట్టుతున్నాడు.

"ఆ ములికి గల వస్తువేమయింది?" అన్నాడు మౌగ్లీ.

"ఎవరోమనిషి తీసుకున్నాడు. ఇవిగో వాడి అడుగుజాడలు," అన్నాడు బాఘీర.

"ఔరడుగాడు చెప్పినది నిజమైతే ఆ మనిషి చావాలి. జాడలవెంబడి పోదాం," అన్నాడు మౌగ్లీ.

"జాడ లెక్కడికీ పోవు. ముందు కడుపు నింపుకుందాం," అన్నాడు బాఘీర.

వాళ్ళకు త్వరలోనే ఆహారం దొరికింది. ఇద్దరూ కడుపునిండా తిని, తాగి, అడుగు జాడల ననుసరించి బయలుదేరారు. ఆ కాలిగుర్తులు గలవాడు, కొంతదూరం నడిచి తరవాత పరిగెత్తి, చివరకు ఒక పక్కకు తిరిగాడు. ఆ ప్రదేశంలోనే ఇంకోమనిషి కాలి గుర్తులు మొదటి గుర్తులను చేరవచ్చాయి. ఈ రెండోజత పాదాలు చిన్నవి. కాలి వేళ్ళు లోపలికి మణిగి ఉన్నాయి. అవి గోండు వేటగాడివని మౌగ్లీ గ్రహించాడు.

రెండు జతల జాడలుండటం చేత మౌగ్లీ చిన్న అడుగుల వెంటా, బాఘీర పెద్ద అడుగుల వెంటా చీలి నడుస్తూ, తాము గ్రహించిన విషయాలు ఒకరి కొకరు కేక పెట్టి చెప్పుకున్నారు.

చివరకు రెండు జాడలూ ఏకమయాయి. ఆ దారిలోనే ఒక గ్రామస్థుడి శవం దారికి అడ్డంగా పడి ఉన్నది. వాడి గుండెలోకి వీపులో నుంచి గోండువాడి బాణం గుచ్చుకుని ఉన్నది. "ఒకచావు! ఆ వస్తువేదీ?" అన్నాడు మౌగ్లీ.

"గోండువాడు తీసుకుని ఉంటాడు," అంటూ బాఘీర, చిన్న పాదాలజాడ వెంబడి

దారి తీశాడు. కొంతదూరం వెళ్ళాక ఒక కనుమలో నెగడు వేసిన చోట గోండువాడి శవం దొరికింది. రెండో చావు! అక్కడే పాదరక్షలు ధరించిన నలుగురి కాలిగుర్తులు కనిపించాయి.

మౌగ్లీకి ఇక ముందుకు పోబుద్ధి కాలేదు. కాని బాఘీర, వెనక్కు తిరగటం వేటగాడి లక్షణం కాదన్నాడు.

ఆ నలుగురి అడుగు జాడల ననుసరించి వాళ్ళు ఒక గంటసేపు నడిచాక బాఘీరకు పొగవాసన తగిలింది. ఆ ప్రాంతాలలోనే పొదల మధ్య బాఘీరకు మరొక శవం కనిపించింది. వాణ్ణి ఎవరో కొట్టి చంపారు. గోండువాడు చచ్చినట్టే వీడూ చచ్చాడు.

మరో అరమైలు వెళ్ళాక వాళ్ళకు ఆరిపోతున్న నెగడూ, దాని పక్కన మూడు శవాలూ కనిపించాయి. ఎవరి మీదా గాయం లేదు. "వీళ్ళెలా చచ్చినట్టు?" అన్నాడు మౌగ్లీ ఆశ్చర్యంగా.

"విషం!" అన్నాడు బాఘీర. వీళ్ళ చేతిలో చచ్చినవాడు వంటవాడు. వాడు ముందుగానే మిగిలిన వాళ్ళ ఆహారంలో విషం కలిపాడు. అంకుశం నెగడు పక్కనే పడివున్నది.

మౌగ్లీ దాన్ని శిథిలాలనుంచి తెచ్చినందుకు చాలా పశ్చాత్తాప పడ్డాడు. అతను దాన్ని ఒక చోట తాత్కాలికంగా పూడ్చి ఉంచి, రెండు రోజుల అనంతరం రాత్రి పూట తెల్లపడగ ఉండే చోటికి వెళ్ళి, రంధ్రంకుండా ఆ అంకుశాన్ని లోపలికి వేసి, "సర్వపితామహా, మంచి యువకుణ్ణి రాజనిక్షేప రక్షణకు తోడు తెచ్చుకో! లోపలికి వచ్చిన వాడు ప్రాణాలతో తిరిగి పోకుండా చూడు!" అని చెప్పాడు.

"ఓహో, ఇది తిరిగి వచ్చిందా? నువ్వింకా బతికే ఉన్నావా? నువ్వు చావెలా తప్పించుకో గలిగావు? ఎంత ఆశ్చర్యం!" అన్నాడు తెల్లపడగ.





# అరణ్యపురాణం

## 26

మౌగ్లీకి జీవితం మహా ఉల్లాసంగా గడిచి పోతున్నది. అరణ్యంలో అందరూ అతనికి మిత్రులే. వారికి అతనంటే అభిమానంతో బాటు కొద్దిపాటి భయంకూడా లేక పోలేదు. అతను అరణ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు అతని నలుగురు అన్నలూ వెంట ఉంటే ఉండేవారు, లేకపోతే ఒంటరి గానే తిరిగేవాడు. అతన్ని గురించి ఎన్ని కథలైనా చెప్పుకోవచ్చు. వాటిలో ఇప్పుడు చెప్పబోయేది ఒకటి.

తోడేలయ్యా, తోడేలమ్మా పోయారు. వాళ్ళు ఉంటూ వచ్చిన గుహకు మౌగ్లీ ఒక పెద్ద కొండరాయిని తీసుకు వచ్చి అడ్డం పెట్టేశాడు. తరవాత వారి మీద చావు పాట పాడేశాడు.

భాలూ చాలా వృద్ధుడై పోయాడు. అతని కీళ్ళలో ఇప్పుడు పట్టులేదు.

ఉక్కునరాలూ, ఇనప కండరాలూ కలిగిన బాఘీర కూడా ఇప్పుడు వేట మీదికి వెనకటంత వేగంగా లంఘించలేక పోతున్నాడు.

అకేలా పండు ముసలి. అతని శరీరం తెల్లగా నెరిసిపోయింది. అతని డొక్క ఎముకలు వెళ్ళుకొచ్చాయి. కొయ్యకాళ్ళతో నడిచినట్టు నడుస్తున్నాడు. అతని ఆహారాన్ని మౌగ్లీయే సంపాదించి పెడుతున్నాడు.

సియోనీ తోడేళ్ళ మంద విచ్ఛిత్తి అయి పోయింది. ఆ మంద తాలూకు రెండోతరం వాళ్ళు అయిదేళ్ళ వయసులో సంపూర్ణ జవ సత్వాలు కలిగి ఉన్నప్పుడు, ఆ తరానికి చెందిన సుమారు నలభై మంది తోడేళ్ళూ మరొక నాయకుణ్ణి ఎన్నుకుంటే బాగుంటుం దని అకేలా సలహా ఇచ్చాడు. మంద నాయ కత్వానికి జరిగిన పోటీలో ఫావో నెగ్గాడు.

అట్ట చివరి బొమ్మ



తిరిగి కొండమీద సమావేశాలు జరిగాయి. తనకేమీ సంబంధం లేకపోయినా మౌగ్లీ వాటికి హాజరై, ఫావోకు ఎగువన ఎత్తుగా ఉండే రాతిమీద అకేలా సరసన కూర్చుంటూ ఉండేవాడు. అతనెప్పుడైనా మాట్లాడటం ప్రారంభిస్తే అతని ప్రసంగం పూర్తి అయినదాకా అందరూ నిశ్శబ్దంగా ఉండి వినేవారు.

ఆ రోజులలో వేటకూ, నిద్రకూ ఎలాటి విఘాతమూ ఉండేది కాదు. పైవాళ్ళెవరూ "మౌగ్లీ జనం" ఉండే ప్రాంతంలో అడుగు పెట్టేవాళ్ళు కారు. సమావేశంలో తోడేలు కూనలను తెచ్చి, "చూడండి! బాగా చూడండి!" అన్న హెచ్చరికలు వినిపించినప్పుడల్లా మౌగ్లీ శరీరం పులకించేది. ఆ సమావేశాలకు అతను విధిగా హాజరయేవాడు.

ఒకనాడు చీకటి పడేవేళ మౌగ్లీ ఒక దుప్పిని చంపి, దాని అర్ధభాగాన్ని అకేలా కోసం తీసుకుపోతూండగా ఒక వింత కేక వినపడింది. షేర్‌ఖాన్ గతించినాక అలాటి కేక మౌగ్లీకి వినిపించనే లేదు. పులివెకనగా వేటాడుతూ పోయే నక్కలు అలాటి కర్ణకఠోరమైన కేక పెడతాయి. అందులో ద్వేషమూ, విజయగర్వమూ, భయమూ, నిస్పృహా, ఒక విధమైన వెటకారమూ మిశ్రమంగా ధ్వనిస్తాయి. వాయిన్ గంగ అవతలి ప్రాంతం నుంచి అలాటి కేక వినవచ్చింది.

ఆ కేకను మౌగ్లీతోబాటు, అతని వెనకనే గెంతుకుంటూ, ఆడుతూ, పాడుతూ నడిచే అతని అన్నలు కూడా విన్నారు. వారు చట్టున ఆగిపోయారు. వారి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. వారు గుర్రుమన్నారు. అప్రయత్నంగా మౌగ్లీ చెయ్యి కత్తి మీదికి పోయింది. అతని కళ్ళు ఎరుపెక్కాయి. అతను కనుబొమలు ముడేస్తూ, "ఇక్కడ వేటాడ సాహసించే చారల వాడెవడూ లేడే!" అన్నాడు.

"ఇది చారలవాడి కేకకాదు. భారీఎత్తున వధ జరుగుతున్నది. శ్రద్ధగా విను!" అన్నాడు పెద్దన్న.

ఆ కేక మళ్ళీ వినిపించింది. మౌగ్లీ గట్టిగా ఊపిరితీసి సమావేశం జరిగే గుట్ట వద్దకు పరిగెత్తాడు. మందతోడేళ్ళు చాలా మంది అటుకేసే పరిగెత్తుతున్నారు. మౌగ్లీ గుట్ట చేరేసరికి ఫావో, అకేలాలు అక్కడ ఉన్నారు. చాల మంది తోడేళ్ళు వారిచుట్టూ కూర్చుని ఉన్నారు. స్త్రీలూ, పసిపిల్లలూ మాత్రం తమ ఇళ్ళకేసి వేగంగా పరిగెత్తుతున్నారు. ఇలాంటప్పుడు వాళ్ళు బయట ఉండటం క్షేమంకాదు.

వాయిన్ గంగ గలగలలూ, సాయంకాలపు గాలికి చెట్లు చేసే కలకలమూ తప్ప మరేమీ ఆ చీకటిలో వినరావటం లేదు. కాని అంతలోనే నది అవతలి పక్కనుంచి తోడేలు పిలుపు వినబడింది.

ఆ తోడేలు మందలో తోడేలు కాదు. మందకు చెందిన వాళ్ళంతా గుట్ట మీద సమావేశమై ఉన్నారు.

"పిశాచాలు! పిశాచాలు!" అంటూ ఒక బక్క చిక్కిన పెద్దతోడేలు, ఒక కాలు కుంటుతూ, గుట్టనెక్కి వచ్చి, మౌగ్లీముందు సాష్టాంగ పడిపోయాడు. అతడి నోట నురుగు



వస్తున్నది. అతని పక్కలు బాగా రక్తసిక్తమై ఉన్నాయి. "వేటసాగాలి! మీ నాయకుడెవరు?" అని ఫావో గంభీరంగా అడిగాడు.

"వేటసాగాలి! నేను ఏకాకిని," అన్నాడు కొత్త తోడేలు. అంటే అతను ఏమందకూ చెందక, ఒంటరిగా జీవించే వాడన్నమాట. అతని గుండె అదురుకు శరీరం కంపించిపోవటం స్పష్టంగా కనిపిస్తున్నది.

"ఏమిటి విశేషం?" అని ఫావో అతణ్ణి ప్రశ్నించాడు.

"పిశాచాలు, దక్కను పిశాచాలు—ఎర్రవేట కుక్కలు! దక్కను శూన్యమయిందిట, ఉత్తరంగా వచ్చారు—దారి

పొడుగునా మారణహోమం సాగిస్తూ. ఈ చంద్రుడు మొదట కనిపించిన నాడు నాకొక భార్యా, ముగ్గురు కూనలూ ఉండే వారు. మైదానంలో పిల్లలకు నా సహచారిణి వేట నేర్పుతూ ఉండేది. అర్ధరాత్రివేళ వాళ్ళ వేట తమకపు కేకలు విన్నాను. తెల్లవారేసరికి నలుగురూ శవాలై ఉన్నారు. పగ తీర్చుకోపటానికి బయలుదేరి, పిశాచాలను కళ్ళజూశాను," అన్నాడు ఏకాకి.

"ఎంత మంది?" అని మౌగ్లీ చప్పున అడిగాడు. తోడేళ్ళ మంద కోపంతో గుర్రుమంటున్నది.

"నాకు తెలీదు. వాళ్ళలో ముగ్గురిని ఖర్చు కింద వెయ్యండి. కాని చివరకు వాళ్ళు నన్ను లేడిని తరిమినట్టు తరిమారు. మూడు కాళ్ళ మీద నన్ను పరిగెత్తించారు. చూడండి!" అన్నాడు ఏకాకి, నజ్జు అయిపోయిన తన ముందు కాలును చాస్తూ. దాని మీద రక్తం నల్లగా అట్ట కట్టుకుని ఉన్నది. అతని పక్కలా, కంఠం మీదా కూడా గాట్లున్నాయి.

ఆకేలా మౌగ్లీ తనకోసం తెచ్చిన ఆహారం ముందు నుంచి లేస్తూ, "తిను," అన్నాడు. ఏకాకి దాని పైకి ఆత్రంగా దూకాడు. అతను తన ఆకలి కాస్త తీర్చుకున్నాక, "మీరు పెట్టిన ఈ తిండి వృథా పోదు. నన్ను కాస్త బలం తెచ్చుకోనిచ్చారంటే నేను కూడా వేటలో కలుస్తాను. నా కుటుంబం పోయింది. నేను ఆ పిశాచాల మీద పగతీర్చుకోవాలి," అన్నాడు.

అతని దవడలు ఎముకలు కొరకటం ఆలకించి ఫావో, "అలాటి దవడలతో అవసరం ఉంది. పిశాచాల వెంబడి కూనలు కూడా ఉన్నారా?" అని అడిగాడు.

"లేదు. లేదు. అందరూ ఎర్ర వేటగాళ్లే. పూర్తిగా పెరిగినవాళ్ళు. దక్కనులో తొండలను తినేవాళ్ళే అయినా పలంగానూ, బలంగానూ ఉన్నారు," అన్నాడు ఏకాకి.





# అరణ్యపురాణం

## 27

ఈ శునకాలను గురించి అకేలాకు కొంత తెలుసును. అతను మౌగ్లీతో రహస్యంగా, "ఒంటరిగా చావటం కంటె మందలో చావటం మేలు. ఇది నా ఆఖరు వేట—మంచి వేట. కాని మనిషి ప్రమాణాన్ని బట్టి నీ కింకా చాలా ఆయుస్సు ఉన్నది. ఉత్తరంగా వెళ్ళి, సుఖంగా పడుకో. శునకులు వెళ్ళాక ఎవరైనా మిగిలితే, యుద్ధవివరాలు తెలుసుకోవచ్చు," అన్నాడు.

"ఓహెూ, నేను వెళ్ళి బురదగుంటల్లో చేపలు పట్టి, చెట్ల మీద నిద్రపోవాలేం? కాయఘు కొరుక్కుతినటానికి మర్కటుల సహాయం కూడా తీసుకోవాలా? మంద మాత్రం పోరాటం సాగిస్తుందేం?" అన్నాడు మౌగ్లీ రోషంగా.

"చావుతో పోరాటమే. ఎర్రకుక్కల సంగతి నీకేం తెలుసు? నే చెప్పేది విను. చారలవాడు సైతం—" అని అకేలా ప్రారంభించాడు.

"ఆహాహా! నేను ఒక చారలవాణ్ణి చంపాను. షేర్‌ఖాన్ అయితే ఎర్రకుక్కలు మూడామడల దూరాన ఉండగానే తోక ముడిచి పారిపోయేవాడు. విను. ఒక తోడేలయ్య ఉండేవాడు. ఆయన నా తండ్రి. ఒక తోడేలమ్మ ఉండేది—నా తల్లి. ఇంకో ముసలి తోడేలు నాకు తల్లీ తండ్రీ కూడానూ. ఆయన ఇప్పుడు పండిపోయాడు. కనక నేను చెప్పే దేమిటంటే—కుక్కల తండా ఇక్కడికి వచ్చే పక్షంలో వేటలో మందతో బాటే నేనూనూ. నా కత్తి కూడా ఓ తోడేలుకోరే!" అన్నాడు మౌగ్లీ.

"తోడేలు భాష మాట్లాడే మనిషీ, నీకు కుక్కలతండా సంగతి తెలీదు. నేనైనా పగ తీర్చుకోవటానికి పోరాడతాను గాని, ప్రాణా

అట్ట చివరి బొమ్మ



లతో బయట పడతానని కాదు. వాళ్ళు తాపీగా కనబడ్డదాన్నల్లా చంపుతూ సాగి పోతారు. అది తిండి కోసం జరిగే వేట కాదు—వధ! మీకు పగ తీర్చుకునే సమస్య లేదు. శునకులు వెళ్ళిపోయే దాకా ఉత్తరంగా పోయి మీ మందవాళ్ళు తల దాచుకుని, దొరికినదానితో కడుపు నింపు కోండి," అన్నాడు ఏకాకి.

మౌగ్లీ గట్టిగా నవ్వి, "మందవాళ్ళం ఉత్తరంగా పారిపోవాలట! పారిపోయి బల్లుల్నీ, ఎలకల్నీ పట్టాలిట! వినండి! మనం భయపడి తలదాచుకుంటే వాళ్ళు మన వేటభూములన్నీ ఒక కొలిక్కి తెస్తారట! ఏం? వాళ్ళు కుక్కలు—కుక్కల కొడుకులు! వాళ్ళ కాళ్ళవేళ్ళ మధ్య బొచ్చుంటుంది. ఎలక సంతానం లాగా ఒక్కో కానుపుకూ ఆరుగురూ, ఎనిమిది మందీ పుడతారు. పారిపోతామా? చెప్పండి! వేట సాగాలి! మందంతా కదలండి. ఇళ్ళ కోసం, బిడ్డల కోసం! గుహల్లో ఉండే పసి కూనల కోసం! ఎడా, పెడా వధ చెయ్యండి," అని అరిచాడు.

మంద అంతా అరణ్యం దద్దరిల్లేటట్టు అరిచింది.

మౌగ్లీ తన నలుగురు అన్నలతో, "మీరు వీళ్ళ వెంటే ఉండండి. అకేలా, ఫావోలు యుద్ధయత్నాలు చూస్తారు. నేను వెళ్ళి తండా ఏమాత్రమున్నదీ లెక్క చూస్తాను," అని చెప్పాడు.

ఏకాకి సగం లేచి, "నిష్కారణంగా చచ్చిపోతాడు. శునకుల తండా ముందు ఈ బొచ్చు లేనివాడెంత? చారలవాడు కూడా—జ్ఞాపకం ఉంచుకో," అన్నాడు.

"తండా చచ్చాక మాట్లాడుకుందాం. అందరికీ వేట సాగాలి!" అంటూ మౌగ్లీ చీకట్లోకి పరిగెత్తాడు. అతను చాలా ఉద్రేకంలో ఉండి, అడుగు ఎక్కడ పడుతున్నది కూడా లక్ష్యపెట్టకుండా పరిగెడుతున్నాడు.

దానికి ఫలితంగా అతను కావా చుట్టలకు కాలు తగిలి బొక్కబోర్లా పడ్డాడు.

కావా నదీ తీరానికి సమీపంలో లేళ్ళు నడిచే బాటలో మాటు వేసి దీక్షగా చూస్తున్నాడు. "ఇదేం పని? తపాతపా పరిగెత్తుతూ వేట చెడగొట్టావు!" అన్నాడతను.

"నాదే తప్పు. నేను పోతున్నదే నీ కోసం. ఎప్పుడు కనిపించినా ఇంకా లావూ, ఇంకా పొడుగూ పెరిగి ఉంటావు. నిన్ను పోలిన వాళ్ళు అరణ్యంలో మరోరు లేరు. నీ బుద్ధీ, నీ బలమూ, నీ వయసూ, నీ అందమూ!" అన్నాడు మౌగ్లీ లేస్తూ.

"ఈ స్తోత్రపాఠా లన్నీ దేనికో! ఈ అబ్బి నా మీద రాళ్ళు వేసీ నన్ను నానా మాటలూ అనీ నెల తిరగలేదే? ఆ నోరే ఇంత తియ్యగా పలుకుతుందేం ఇప్పుడు?" అంటూ కావా మౌగ్లీ కోసం చుట్టలు తొట్టి ఉయ్యాల లాగా తయారు చేశాడు.

"అవును, నా వేట దారికి అడ్డొచ్చి, ఈల వేసినా వినిపించుకోకపోతే రాళ్ళు రువ్వనూ!" అంటూ మౌగ్లీ కావా చుట్టల మధ్య సుఖంగా చేరగిలబడి కూర్చుని, ఎర్రకుక్కల వృత్తాంత మంతా చెప్పాడు.

అంతా విని కావా, "తండా ఏ మాత్రం ఉంటుంది?" అన్నాడు.



"నా కేమీ తెలీదు. నేను చూడలేదు. నీ కోసం రెక్కలు కట్టుకుని వచ్చాను. భలే వేట, కావా! ఆ తరవాత ఎంతో మందిమి మిగలం," అన్నాడు మౌగ్లీ ఉత్సాహంగా.

"ఇందులో నువెందుకు వేలు పెడుతున్నావు? నువు మనిషివి. మంద నుంచి నిన్ను వెళ్ళగొట్టిన మాట మరవకు. కుక్కల సంగతి తోడేళ్ళు చూసుకుంటాయి లే," అన్నాడు కావా.

"కిందటేడు కాసిన కాయలు ఈ యేడు మట్టి. నేను మనిషినైతేనేం? నేనూ ఒక తోడేలునే నని వాళ్ళకు మాట ఇచ్చేశాను.

ఈ కుక్కలు దాటిపోయిన దాకా నేను మందలో వాణ్ణే," అన్నాడు మౌగ్లీ.

"మాట ఇచ్చానంటే మరి మాట్లాడను. అయితే ఈ తండా వచ్చిపడితే ఏం చేద్దామని నీ ఉద్దేశం?" అన్నాడు కావా.

"కుక్కలు వాయిన్‌గంగ ఈది రావాలి. లోతు తక్కువ నీటిలో నిలబడి నా కత్తితో వాటిని ఎదుర్కొందా మనుకుంటున్నాను. నా వెంట మంద ఉంటుంది. కుక్కలను నీటివాలుకు మళ్ళించవచ్చునని ఆశ," అన్నాడు మౌగ్లీ.

"కుక్కల తండా పక్కకు తిరగటం కల్ల. నువ్వు చెప్పే వేట ముగిశాక ఒక్క మనిషి కూనా, ఒక్క తోడేలు కూనా కూడా మిగలవు. ఎముకలే మిగులుతాయి," అన్నాడు కావా

"చస్తే, చస్తాం. వేట మాత్రం మజాగానే ఉంటుంది. నేనెన్నో వర్షాలు చూడలేదు. జ్ఞానినీ కాను, బలంగలవాణ్ణీ కాను. ఇంతకన్న మంచి ఉపాయం నువ్వు చెప్పగలవా, కావా?" అన్నాడు మౌగ్లీ.

"నూరువర్షాలు చూశాను. చాలా చెట్లు నా కళ్ళ ముందు పుట్టినవి," అన్నాడు కావా.

"కాని ఈ వేట కొత్తది. కుక్కల తండా మన కేసి పూర్వం ఎన్నడూ రాలేదు," అన్నాడు మౌగ్లీ.

"ప్రతిదీ అదివరకు జరిగినదే....నా యేళ్ళు జ్ఞాపకం చేసుకుంటున్నాను, కాస్సేపు కదలకుండా అలా కూచో," అన్నాడు కావా.

ఒక గంటసేపు మౌగ్లీ కదలకుండా ఉండిపోయాడు. కావా తల నేలకానించి గతంలోకి వెళ్ళిపోయాడు. అతని కళ్ళు కాంతివిహీనమై పోయాయి నిద్రలో వేటాడుతున్నట్టుగా అతని తల ఈ పక్కకూ ఆ పక్కకూ తోసుకొచ్చింది. మౌగ్లీ కూడా నిద్ర మగతలో పడ్డాడు. వేటకు ముందు కునుకు అవసరం.





# అరణ్యపురాణం

## 28

కావా శరీరం మళ్ళీ లావెక్కటమూ, అతను చైతన్యంతో బుస కొట్టటమూ మౌగ్లీకి తెలియ వచ్చింది.

"గడిచిన ఋతువులన్నీ తిరిగి చూశాను. హిస్! నది కేసి పోదాం పద. కుక్కల తండా గురించి ఏం చెయ్యాలో నేను నీకు చూపుతాను," అన్నాడు కావా.

అతను బాణంలాగా సూటిగా వాయిన్‌గంగ పెద్ద పాయకేసి బయలుదేరాడు. మౌగ్లీ అతని వెంబడే బయలుదేరాడు. అడుగున "శాంతిశిల" గల మడుగులోకి అతను ప్రవేశించినప్పుడు మౌగ్లీ తాను కూడా ఈదసాగాడు.

"ఈదకు, తమ్ముడూ. నేను చాలా వేగంగా పోతాను. నా వీపు పట్టుకో," అన్నాడు కావా. మౌగ్లీ తన ఎడమ చేతిని కావా మెడ చుట్టూ వేసి, కుడి చేతిని తన శరీరానికి అంటి ఉంచి, కాళ్ళు సూటిగా పెట్టుకున్నాడు. అప్పుడు కావా ప్రవాహానికి ఎదురీదుతూ వెళ్ళాడు.

శాంతిశిలకు ఒకటి, రెండు మైళ్ళు ఎగువన వాయిన్‌గంగ చలవరాతి గుట్టల మధ్యగల సన్నని కనుమకుండా, అతి వేగంగా ప్రవహిస్తుంది. తాము కనుమ కుండా పోయేటప్పుడు మౌగ్లీ ఈ పక్కా, ఆ పక్కా చూశాడు. గాలిలో అతనికి తియ్య తియ్యని, పుల్ల పుల్లని వాసన వచ్చింది. అతను చప్పున తన తలను నీటి అడుగుకు ముంచి గాలికోసం మాత్రమే అప్పుడప్పుడూ పైకెత్తుతూ వచ్చాడు.

నీటి అడుగున ఉన్న ఒక రాతికి తోక మెలిక వేసి కావా ఆగాడు.

"ఇది మృత్యు గహ్వరం! ఇక్కడి కెందు కొచ్చాం?" అన్నాడు మౌగ్లీ.

అట్ట చివరి బొమ్మ



"సరిగా చూడు. అంతా నిద్రపోతున్నారు. నేను నీ చెయ్యంత వాడినప్పుడు కూడా ఈ ప్రదేశం ఇలాగే ఉండేది. ఏమీ మార్పు లేదు," అన్నాడు కావా.

అరణ్యం పుట్టిన నాటినుంచీ ఈ కనుమ లోని రాళ్ళ గుట్టలలో కొండ తేనెటీగల నివాసాలు ఏర్పాటై ఉన్నాయి. అందుచేత ఈ ప్రాంతానికి అరమైలు దూరంలోకి ఏ ప్రాణీ రాదు. ఆ సంగతి మౌగ్లీ ఎరుగును. కనుమలోని ప్రతి గహ్వరంలోనూ తేనె పట్లున్నాయి. కనుమ పొడుగునా రెండు పక్కలా నల్లటి మఖ్మల్ పరదాలు వేళ్ళాడ గట్టినట్టుగా కనబడుతుంది. కొన్ని కోట్ల తేనె టీగలు నిద్రపోతున్నాయి. వాటిని చూసే మౌగ్లీ తన తలను నీటిలో ముంచాడు.

కావా మళ్ళీ కదిలి, ప్రవాహానికి ఎదురు ఈదుతూ కనుమ అవతలి చివరకు చేరుకుని, "ఇదే ఈ రుతువులో వేట భూమి, చూడు!" అన్నాడు.

నది ఒడ్డున మూడు అస్తిపంజరాలు కని పించాయి. రెండు జింక పిల్లలవీ, ఒకటి అడవి దున్నదీనూ. ఆ మూడు జంతువులూ దారి తప్పి వచ్చి, తేనెటీగల బారి పడ్డాయి.

"వాళ్ళు నిద్ర లేచేలోగా మనం వెళ్ళి పోదాం," అన్నాడు మౌగ్లీ.

"వాళ్ళు తెల్లవారితేగాని లేవరు. నేను చెప్పేది విను. చాలా చాలా ఏళ్ళ క్రితం ఒక దుప్పి, కుక్కలు తరుముతూంటే, దక్షిణం నుంచి ఇటుకేసి వచ్చింది. దానికి అరణ్యం తెలీదు. అది భయంతో గుడ్డిదై పోయి ఈ కనుమలోకి దూకింది. కుక్కలూ దూకారు. మిట్ట మధ్యాన్నంవేళ ఈగలు మంచి రోషంమీద ఉన్నారు. దూకిన కుక్కలు నీటిని చేరే లోపలే చచ్చారు. దూకని కుక్కలూ చచ్చారు. కాని దుప్పి బతికింది!" అన్నాడు కావా.

"దుప్పి ఎలా బతికింది?" అని మౌగ్లీ ఆశ్చర్యంగా అడిగాడు.



"ప్రాణభయం కొద్దీ ముందు దూకినది దుప్పి. అది దూకినాకగాని ఈగలకు చైతన్యం కలగ లేదు. ఆ తరవాత దూకిన కుక్కల పని ఖాళీ అయిపోయింది," అన్నాడు కావా.

"దుప్పి చావనే లేదా?" అన్నాడు మౌగ్లీ ఆలోచిస్తూ.

"ఈగల మూలంగా చావ లేదు. కాని అది ప్రవాహంలో పడిపోతుంటే బలంగా పట్టుకునేటందుకెవరూ లేరు—ఏ మౌగ్లీ గాని అలా దూకితే కావా అనే స్థూలకాయుడుండేటట్టుగా!" అన్నాడు కావా.

"మృత్యువుతో చెలగాటమే! కాని—కావా, అరణ్యంలో నీ అంత జ్ఞాని మరొకడు లేడు," అన్నాడు మౌగ్లీ.

"కుక్కల మంద నిన్ను తరిమిందే అనుకో. పైన ఉండగానే చావని కుక్కలు ఇక్కడో, ఇంకా దిగువనో నీటిలో పడతారు. వాయిన్‌గంగ ప్రవాహం మహా దారుణమైనది. పాపం, వాళ్ళను పట్టుకునేందుకు కావా ఉండదు. వాళ్ళు సియోనీ గుహల దగ్గిర తేలుతారు. అక్కడ వాళ్ళ పీకలు కొరకటానికి మంద సిద్ధంగా ఉంటుంది," అన్నాడు కావా.

"అద్భుతం, అద్భుతం! రాత్రి సూర్యుడు పొడిచినా ఇంతకన్న మంచి ఏర్పాటుండబోదు. పోతే, పరిగెత్తటమూ, దూకటమూ మాట చూడాలి. నన్ను కుక్కలు చూసి, వెంటపడేటట్టు చెయ్యాలి," అన్నాడు మౌగ్లీ.

"ఎగువన ఉన్న రాళ్ళగుట్టలను అవతలి పక్కనుంచి చూశావా?" అన్నాడు కావా.

"లేదు, లేదు. ఆ మాట మరిచాను," అన్నాడు మౌగ్లీ.

"వెళ్ళి చూడు. చాలా ఘోరమైన ప్రదేశం. అంతటా నెర్రెలూ, గుంటలూనూ. పొరపాటున కాలు పడరానిచోట పడిందో, వేట అక్కడే ముగుస్తుంది. నిన్నిక్కడే వదిలేసి, కుక్కలతండా కోసం ఎక్కడ

చూడాలో మందకు చెబుతాను. అ పైన ఇది నాకు సంబంధించిన సంగతి కాదు. నా జాతివేరు, తోడేళ్ళ జాతివేరు," అంటూ కావా ప్రవాహం వెంబడి ఈదుకుంటూ వెళ్ళాడు. ఒక చోట అతనికి ఫావో, అకేలాలు కనిపించారు.

"స్! కుక్కలు! కుక్కలతండా ప్రవాహం వెంట వస్తుంది. మీకు ధైర్యం ఉంటే, వాళ్ళను లోతు తక్కువ నీటిలో చంపవచ్చు," అన్నాడు కావా.

"వాళ్ళెప్పు డొస్తారు? మనిషి కూన ఎక్కడ?" అని అకేలా అడిగాడు.

"వాళ్ళు వచ్చినప్పుడు వస్తారు, ఇక మీ మనిషికూన మాటా? అతని వద్ద మాట తీసుకుని మృత్యువుకు ఎరవేశారుగా? అతను నా వెంటే ఉన్నాడు. అతనీసరికే చావకపోతే అది నీ తప్పుకాదు, పండు కుక్కా! తండా కోసం ఇక్కడే వేచి ఉండండి. నేనూ, మీ మనిషికూనా మీపక్షాన ఉన్నందుకు సంతోషించండి," అంటూ కావా ప్రవాహానికి ఎదురీది వెళ్ళి కనుమ మధ్య నిలిచి ఎగువనున్న కొండల అంచును పరికించసాగాడు.

త్వరలోనే నక్షత్రాలకు అడ్డంగా మౌగ్లీ తల కదలటం కనిపించింది. తరవాత మనిషి నీటిలో దూకిన చప్పుడయింది. మరు క్షణం మౌగ్లీ కావా చుట్టలమధ్య చేరాడు.

"అదొక పెద్ద దూకు కాదు. నేను సరదాకు అంతకంటె హెచ్చింపు దూకాను. అయితే పైన ఉన్న ప్రదేశం చాలా చండాల మైనది. పొట్టిపొట్టి పొదలూ, లోతైన గుంట లూనూ. ఒక చోట మూడురాళ్ళు ఒకదాని మీద ఒకటి పేర్చి పెట్టాను. పరిగెత్తేటప్పుడు వాటిని కాళ్ళతో తోసేస్తాను. ఈగలకు చచ్చే కోపం వస్తుంది. నేను మళ్ళీ వచ్చేదాకా ఇక్కడే ఉండు, కావా. వేకువన తండాను రెచ్చగొడతాను," అంటూ మౌగ్లీ కనుమ చివర ఒడ్డుకు ఈదుకుంటూ వెళ్ళాడు.





# అరణ్యపురాణం

## 29

మౌగ్లీకి మృత్యువును కవ్వించటమంటే చాలా ఇష్టం. అదీగాక అరణ్యంలో తన కెవరూ ఎదురు లేరన్నది రుజువు చెయ్యాలన్న అభిలాష కూడా అతనికి అమితంగా ఉండేది. చెట్ల మీది తేనె పట్లను అతను భాలూ సహాయంతో చాలా సార్లు దోచాడు. తేనెటీగలకు అడవి వెల్లుల్లి వాసన సరిపడదని అతనికి తెలును.

అందుచేత ఇప్పుడతను ఒక గుప్పెడు అడవి వెల్లుల్లి పీకి మూటగట్టుకుని ఏకాకి చెప్పిన నెత్తురు జాడనుబట్టి నడిచాడు. ఆ జాడ దట్టంగా పెరిగిన చెట్ల కిందుగా పోతున్నది. చెట్లగుంపులకూ, తేనెపట్లకూ మధ్య ప్రదేశంలో పొదలు తప్ప చెట్లు లేవు.

ఈ బయలు ప్రదేశాన్ని మౌగ్లీ ఒక గంట పాటు శ్రద్ధగా పరిశీలించాడు. తరవాత అతను చెట్ల కేసి తిరిగి వెళ్ళి, భూమికి ఎనిమిది అడుగుల ఎత్తున ఉన్న ఒక చెట్టు కొమ్మ ఎక్కి కూర్చుని, తన కత్తిని అరికాలి మీద పదును పెట్టసాగాడు.

మధ్యాన్నం కావస్తూండగా అతనికి కుక్కలతండా వాసన తెలియవచ్చింది, పద ధ్వని కూడా వినిపించింది. శునకులు ఏకాకి నెత్తురు జాడను పసికట్టి వస్తున్నారు. ఎర్ర కుక్క ప్రమాణం తోడేలులో సగం కూడా ఉండదు. కాని ఆ కుక్కల కాళ్ళలోనూ, దవడలలోనూ చాలా శక్తి ఉన్నది. శునకుల నాయకుడి తల కనబడగానే మౌగ్లీ, "వేట సాగాలి!" అని కేక పెట్టాడు.

శునక నాయకుడు తల ఎత్తి చూశాడు. అతడి వెనకగా వచ్చే అసంఖ్యాకులైన శునకులు ఆగిపోయారు. వాళ్ళ నోళ్ళు రక్తమయంగా ఉన్నాయి. వాళ్ళందరూ కలిసి రెండొందలకు తక్కువ ఉండరు.

అట్ట చివరి బొమ్మ



శునకనాయకుడు ఏకాకి రక్తపు జాడ వెంబడి తండాను తీసుకుపోవటానికి దీక్షగా ప్రయత్నిస్తున్నాడు. అలా జరిగినట్టయితే పగటిపూటే శునకులు తోడేళ్ళస్థావరాలను చేరుకుంటారు. చీకటి పడినదాకా శునకులను తానున్న చెట్టు దగ్గిరే నిలిపెయ్యాలని అతని ఉద్దేశం.

"ఎవరి అనుమతితో మీరు ఇటుకేసి బయలుదేరి వచ్చారు?" అని మౌగ్లీ శునకులను అడిగాడు.

ఒక శునకుడు తన కోరలను వెళ్ళబెట్టుతూ, "ఈ కనబడే అరణ్యాలన్నీ మావే!" అన్నాడు.

మౌగ్లీ ఇకిలిస్తూ, ఎలుక లాగా కిచకిచ శబ్దం చేశాడు, శునకులు తన దృష్టిలో ఎలుకల కన్న ఎక్కువ కాదన్నట్టు.

కుక్కలతండా చెట్టు మొదలును చుట్టుముట్టింది. శునక నాయకుడు రౌద్రంగా ఒకసారి మొరిగి, "నువ్వు మానుకోతివి!" అని తిట్టాడు.

దానికి జవాబుగా మౌగ్లీ తన కాలును శునక నాయకుడి నెత్తికి ఎగువగా చాపి కాలివేళ్ళు ఆడించాడు. దానితో తండాకు ఆగ్రహావేశం వచ్చి, వెర్రెత్తింది. శునక నాయకుడు ఎగిరి అందుకోబోతే మౌగ్లీ తన కాలును పైకి లాక్కుంటూ, "కుక్కా, ఎర్ర కుక్కా! దక్షిణదేశానికి తిరిగి పోయి తొండలను పట్టుకుని తిను! నీ కాలివేళ్ళ సందున అంతా బొచ్చే!" అన్నాడు, తన కాలి వేళ్ళను మళ్ళీ ఆడిస్తూ.

"బొచ్చులేని కోతిగాడా, దిగి రారా! ఎలాగూ నిన్ను తిండికి మాడ్చి చంపేస్తాం!" అని శునకులు కేకలు పెట్టారు.

మౌగ్లీ కోరినది కూడా ఇదే—శునకులకు ఆగ్రహం తెప్పించటం. అతను కొమ్మమీద చాచుకుని పడుకుని, శునకులను గురించి తన కున్న అభిప్రాయాలన్నీ వివరించ సాగాడు. మౌగ్లీ నోరు మహా చెడ్డది. అతని

మాటలు శునకులపైన శూలాలకన్న క్రూరమైనవి. వాటి ప్రభావంతో శునకులు గుర్రుపెట్టటంతో మొదలుపెట్టి, తలలు ఎగిరిపోయేటట్టు మొరగటందాకా వచ్చారు. కొమ్మమీద ఉన్న మౌగ్లీని అందుకోవాలని శునక నాయకుడు చాలాసార్లు ఎగిరాడు. మౌగ్లీ కుడిచెయ్యి సిద్ధంగానే ఉంది గాని, గురి తప్పటం ఇష్టంలేక అతను చెయ్యి చేసుకోలేదు.

చిట్టచివరకు శునకనాయకుడు కోపావేశంతో నేలమీది నుంచి ఏడెనిమిది అడుగుల ఎత్తు ఎగిరాడు. మౌగ్లీ కుడిచెయ్యి కొండచిలువ తలలాగా చప్పున ముందుకు వచ్చి శునకనాయకుడి మెడ పట్టేసింది. ఆ అదురుకు మౌగ్లీ ఉన్న కొమ్మ ఊగిపోయి, అతను కింద పడినంతపని జరిగింది.

కాని మౌగ్లీ కుక్కమెడ పట్టు విడవక శునకనాయకుణ్ణి ఒక్కొక్క అంగుళమే కొమ్మ మీదికి లాగాడు. అతను ఎడమ చేత్తో కుక్కతోక కోసేసి, శునకుణ్ణి కింద విడిచేశాడు.

ఇంకేమీ అవసరం లేదు. ఇక శునకులు ఏకాకి నెత్తురు జాడను లక్ష్యపెట్టరు. మౌగ్లీ రక్తం తాగికాని వాళ్ళు ఆ చెట్టు కింది నుంచి కదలరు—లేదా అతని చేతిలో చావనైనా



చస్తారు. వాళ్ళు ఉన్నచోటనే చుట్టలు చుట్టుకుని పడుకోవటం మౌగ్లీ చూశాడు. ఇక వాళ్ళు వెళ్ళిపోయే భయంలేదు గనక మౌగ్లీ చెట్టుమీది పైపంగకు ఎక్కి, విశ్రాంతగా నిద్రపోయాడు.

మూడు నాలుగు గంటలయాక అతను నిద్రలేచి చూసేసరికి శునకులంతా అక్కడే ఉన్నారు. ఏమీ చడీచప్పుడూలేదు. వాళ్ళ కళ్ళు ఉక్కులాగా మెరుస్తున్నాయి. సూర్యుడు అస్తమించుతున్నాడు. ఇంకొక అరగంటలో తేనెటీగలు పని విరమిస్తారు. మసక వెలుతురులో శునకులు అంత బాగా పోరాడలేరు.

మౌగ్లీ చెట్టు కొమ్మ మీద లేచి నిల బడతూ శునకులతో, "మీ రింత శ్రద్ధగా నాకు కాపలా ఉండవలిసిన పనిలేదు. అయినా నేను మిమ్మల్ని మరవను. మీరు నిజమైన గస్తీగాళ్ళు. నాకది అంత నచ్చ లేదు. అందుచేత మీ పెద్దాయన తోక తిరిగి ఇవ్వదలచలేదు. నీకు సమ్మతమేనా, ఎర్ర కుక్కరాజా?" అన్నాడు.

"ఓరి మానుకోతిగాడా! అట్టే వాగకు. నీ డొక్కను నేనే స్వయంగా చీరేస్తాను," అన్నాడు శునకనాయకుడు.

"తొందరపడకు, ఎలుకబుద్ధీ! అందరికీ మొండితోకలు కాగలవు. మీ దక్షిణదేశానికి వెళ్ళి ఒక మర్కటుడు ఇలా చేశాడని చెప్పుకో. పోవా? అయితే నావెంటరా, నీకు జ్ఞానోపదేశం చేస్తాను!" అంటూ మౌగ్లీ మర్కటుల లాగా తానున్న చెట్టు నుంచి మరొక చెట్టుకు మారి, మళ్ళా దాని నుంచి మరోచెట్టుకూ, ఇంకో చెట్టుకూ వెళ్ళ సాగాడు. శునకులు తలలు ఎత్తి అతని కేసే చూడసాగారు.

అప్పుడప్పుడూ మౌగ్లీ కాలుపట్టుతప్పి పడబోయినట్టు నటించాడు. అప్పుడు చూడాలి శునకుల తొక్కులాట! తళతళ లాడే కత్తి చేతబట్టి చెట్ల మీదుగా కదులు తుంటే, నిప్పులాగా మెరిసే బొచ్చుతో శున కులు చెట్లకిందుగా అతన్ని అనుసరించి నడవటం ఒక విచిత్రమైన దృశ్యం.

"నీ జాడ మాకు తెలియకుండా చేదా మనా నీ ఉద్దేశం? చచ్చేదాకా నిన్ను వదలం!" అన్నారు శునకులు.

"నీ వెధవ తోక నువే ఉంచుకో!" అంటూ మౌగ్లీ శునకనాయకుడి తోకను వెనక్కు విసిరివేశాడు. శునకులందరూ దాని కేసి మూగారు. మరుక్షణం మౌగ్లీ చెట్టుబోదె వెంబడి సర్రున నేలకు జారి, వాయువేగంతో కొండ తేనెపట్లున్న గుట్టల కేసి పరిగెత్తసాగాడు.





# అరణ్యపురాణం

## 30

మౌగ్లీ తమను తప్పించుకుని పారిపోతూండటం కళ్ళబడగానే శునకులు ఒక్క పెడబొబ్బ పెట్టి అతడి వెనకగా దౌడు సాగించారు.

మౌగ్లీ తేలికగా, ఆయాసం రాకుండానే పరిగెత్తాడు. తేనెపట్లు దగ్గిర పడినప్పుడు అతను తన శక్తి అంతా వ్యయపరచ నిశ్చయించుకున్నాడు.

తేనెటీగలు మసకవెలుతు రుండగానే నిద్రపోయాయి. ఎందుకంటే పొద్దుపోయాక పూలు వికసించే ఋతుపు కాదది. అయినా మౌగ్లీకి, తేనెపట్లకు కొంత దూరంలో ఉండగానే, మృదువైన ఝుంకారం వినిపించింది. అప్పు డతను తన శక్తి కొద్దీ పరిగెత్త నారంభించాడు. పరిగెత్తేటప్పుడు తన కాలితో, తాను పేర్చి ఉంచిన రాళ్ళకుప్పను కనుమలోకి నెట్టేశాడు. మృదువైన ఝుంకారం కాస్తా భయంకరమైన హోరుగా మారింది. గాలిలో తేనెటీగలు నల్లని మేఘంలా కానవచ్చాయి. దిగువన చాలా లోతుగా వాయిన్‌గంగ ఉన్నది. అందులో కావా తల కూడా "డైమండ్" ఆకారంలో కనిపించింది.

మౌగ్లీ ఒక్క ఊపున నదిలోకి గెంతేశాడు. తోక లేని శునకనాయకుడు ఎగిరి అతని వీపును కరవ యత్నించాడు. మౌగ్లీ తన విజయానికి చాలా ఉప్పొంగిపోయాడు. అతని శరీరం పైన ఒక్క ఈగకాటు లేదు. అంతా అనుకున్నట్టు సక్రమంగా జరిగిపోయింది. వెల్లుల్లి వాసన ఈగల నుంచి అతన్ని కాపాడింది.

మౌగ్లీ నీటి పైకి లేచేసరికి కావా శరీరం అతన్ని పొదవటానికి సిద్ధంగా ఉంది. కొండ పై అంచు నుంచి శునకుల శరీరాలు కనుమలోకి పడుతున్నాయి. అవి చూడటా

అట్ట చివరి బొమ్మ



నికి తేనెటీగల తుట్టెల లాగా ఉన్నాయి. శునకుల శరీరాలు నీటిని చేరుకునేలోపల ఈగలు పైకి ఎగిరిపోతున్నాయి; కళేబరాలు ప్రవాహం వెంబడి కొట్టుకుపోతున్నాయి.

ఇంకా సముద్రపు హోరు లాంటి ఈగల ధ్వని వినవస్తూనే ఉన్నది. ఎగువ నుంచి శునకుల మొరుగుడు కూడా వినిపిస్తున్నది. శునకులలో కొందరు మాత్రమే కనుమలోకి పడిపోయి, ప్రవాహంతో కొట్టుకుపోయారు. కొందరు పైన వున్న నెర్రెలలో పడి, దిగువ నుండే గుహలలోకి జారి, అక్కడ ఈగల వాత పడ్డారు. కొందరు శునకులు చెట్లు ఎగబాకబోయి, ఈగల చేత ఆవరించబడ్డారు; వాటి కాట్లకు తట్టుకోలేక నదిలోకి దూకేశారు.

మౌగ్లీకి శ్వాస తిరిగి వచ్చిన దాకా ఆగి కావా, "ఈగలు చాలా కోపంమీద ఉన్నారు. మనం ఇక్కడ నిలవటం క్షేమం కాదు," అని చెప్పాడు

మౌగ్లీ తన కత్తిని చేతపట్టుకుని, ప్రవాహం వెంబడి ఈదసాగాడు. సాధ్యమైనంతవరకు అతను నీటి అడుగునే ఉంటూ ఈదాడు.

"జాగ్రత్త, నీటిలోకి దూకిన శునకులందరూ చావలేదు," అన్నాడు కావా.

"కత్తి సిద్ధంగానే ఉన్నది," అని మౌగ్లీ జవాబిచ్చాడు. ఈగలు ప్రవాహం వెంట రావటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

శునకుల తండాలో సగం భాగం అపాయం తెలుసుకుని, పక్కలకు పరిగెత్తి నధిలోకి దూకేసింది. వాళ్ళ మొరుగు వినిపిస్తున్నది. ప్రాణాలు దక్కించుకున్న శునకులు మౌగ్లీ చేసిన ద్రోహన్ని మరవలేదు. నీటిలో పడినా ఈగలు వాళ్ళను వెంటాడుతూనే ఉన్నాయి. మౌగ్లీ తనకు అందిన శునకుణ్ణి పట్టుకుని కత్తితో చంపేస్తున్నాడు.

"శాంతిశిల" సమీపిస్తున్న కొద్దీ సియోనీ తోడేళ్ళమంద అరుపు మరింత స్పష్టంగా

వినిపిస్తున్నది. ఒడ్డుకు దారితీయమని శునకులు తమ నాయకుణ్ణి అడుగుతున్నారు. తేనెటీగలు వెనక్కు తిరిగిపోయాయి. "ఇక నేను కూడా వెళ్ళిపోతాను. నాకు తోడేళ్ళతో ఏమిటి సంబంధం? వేట సాగాలి, తమ్ముడూ!" అని కావా వెళ్ళిపోయాడు.

శునకులు తడిసి ముద్ద అయి, ఉత్సాహన్ని కోల్పోయి, ఒకరొకరే ఒడ్డు చేరసాగారు. కుంటికాలితో గెంతుతూ ఏకాకి ఒడ్డునే ఉన్నాడు.

"ఈ వేట బాగాలేదు," అన్నా డొక శునకుడు రొప్పుతూ.

"భలే వేట!" అంటూ మౌగ్లీ ఆ శునకుడి పక్కకు దూకి, తన కత్తిని శునకుడి గుండెల్లోకి దింపి, శునకుడి చివరి కాటు నుంచి తప్పుకున్నాడు.

"నువేనా, మనిషికూనా?" అని ఏకాకి కేకపెట్టాడు.

"చచ్చిన శునకుల నడుగు, ఏకాకీ! వాళ్ళ నోట మట్టికొట్టాను. వాళ్ళ నాయకుడికి తోక లేకుండా చేశాను. నీ కోసం కొందరు మిగిలారులే!" అన్నాడు మౌగ్లీ

"రానీ!" అన్నాడు ఏకాకి.

తోడేళ్ళమంద వాళ్ళకు చాలా సమీపంలోకి వచ్చింది.



నది మలుపు తిరిగే చోట శునకులు ఒడ్డు పట్టారు. అది పొరపాటు. ఇంకొక అరమైలు దిగువన వాళ్ళు ఒడ్డు పట్టి ఉండవలసింది. వాళ్ళ కోసం తోడేళ్ళు చింత నిప్పుల్లాటి కళ్ళతో వేచిఉన్నారు. ఏకాకి కనిపించటంతో నాయకుడు శునకులను ఒడ్డు పట్టించాడు.

సుదీర్ఘమైన యుద్ధం ఆరంభమయింది. ఇప్పటికీ శునకుల సంఖ్య తోడేళ్ళ సంఖ్యకు రెట్టింపున్నది. కాని తోడేళ్ళు అన్నిటికీ తెగించి ఉన్నారు—ఆడవాళ్ళతోనూ, పిల్లలతోనూ సహా. శునకులు యుద్ధంలో పొట్టలు చీల్చేస్తారు. తోడేళ్ళు కంఠాలు కొరికేస్తారు,

లేదా డొక్కలు చీలుస్తారు. నీటిలో నుంచి మోరలెత్తి బయటికి వచ్చే శునకుల కంఠాలు తోడేళ్ళకు సులువుగా అందాయి. కాని శునకులు పైకి వచ్చాక బలం వాళ్ళదే అయింది.

పోరాటాన్ని చూస్తూ ఉన్న మౌగ్లీని అన్నలు నలుగురూ పొదువుకున్నారు. వాళ్ళ కేసి దూకిన శునకులను మౌగ్లీ తన కత్తికి బలిచేశాడు. అతి వృద్ధుడైన అకేలా, సగం చచ్చిన ఏకాకీ, కొత్తనాయకుడు ఫావో ఎంతో సాహసంతో పోరాడారు. శునక నాయకుడు చిక్కక చిక్కక ఏకాకికే చిక్కాడు! మౌగ్లీ సహాయం పోబోతే ఏకాకి, "అగు, ఇది నా పంతు!" అన్నాడు.

ఏకాకి మహావీరుడు. శునక నాయకుణ్ణి చంపి మరీ చచ్చాడు. ఏకాకి చావగానే మౌగ్లీ మిగిలిన తోడేళ్ళను హెచ్చరించుతూ, "ఒక్క శునకుణ్ణి కూడా ప్రాణాలతో వదలకండి!" అని అరిచాడు.

అకేలా ప్రాణాలతో ఉండగానే మౌగ్లీ కంట పడ్డాడు.

"ఇది నా ఆఖరు పోరాటమని ముందే చెప్పాను. ఇవాళ నువు లేకపోతే ఈ మందలో ఒక్కరు మిగిలి ఉండరు. నువ్వికా నీ వాళ్ళ దగ్గిరికి తిరిగి వెళ్ళు. అన్ని ఋణాలూ పూర్తిగా తీరిపోయాయి," అన్నాడు అకేలా.

మౌగ్లీ అకేలా ఒంటిని పొదివి పట్టుకుని నిలబెట్టాడు. ఒకప్పుడు మందకు నాయకుడైన అకేలా చావుపాట పాడాడు. అతని కంఠం అంతకంతకూ బలమెక్కి, నది దాటి చాలాదూరం వినిపించింది.

"వేట సాగాలి!" అంటూ అకేలా తన బలమంతా కూడగట్టుకుని గాలిలోకి ఎగిరి, వెల్లికిలా పడిపోయాడు. అతని ప్రాణం పోయింది.

ఆ రాత్రి జరిగిన యుద్ధంలో ఒక్క శునకుడు కూడా ప్రాణాలతో మిగలలేదు.





# అరణ్యపురాణం

## 31

ఎర్రశునకులతో పోరాటమూ, అకేలా మరణమూ జరిగి ఏడాది వెళ్ళిపోయింది. మౌగ్లీకిప్పుడు పదిహేడో ఏడు నిండబోతున్నది. కాని అతను ఈడుకు మించి కనిపించేవాడు. దానికి కారణం అతని అపార శరీర దార్ఢ్యమూ, మంచి ఆహారమూనూ. అతి వేగంగా దూకుతూ పోతున్న జింకను అతను తల పట్టుకుని పడదోయగలడు. అరణ్యంలోని ప్రాణులు అతని దారికి అడ్డు తొలుగుతారు. వాళ్ళకు అతనంటే చెడ్డ భయం.

శీతాకాలం అయి పోయి, వసంత కాలం రాబోతున్నది. వాయిన్‌గంగ ఒడ్డున ఒక ఎత్తయిన గుట్ట మీద బాఘీరా, మౌగ్లీ పడుకుని ఉన్నారు.

"పాత సంవత్సరం అయి పోయి కొత్త సంవత్సరం ఆరంభం కానున్నది. కొత్త పాటలు పాడే తరుణం దగ్గిర పడింది. అరణ్యానికి కొత్త జీవం వస్తుంది," అంటూ బాఘీర వెల్లికిలా పడుకుని, గాలిని కాళ్ళతో కొట్ట సాగాడు.

"అదేం పని? నువ్వూ, నేనూ అరణ్యానికి ఏలికలం గద! సిగ్గుచేటుకాదూ?" అని మౌగ్లీ బాఘీరను మందలించాడు.

బాఘీర సరిగా లేచి కూర్చుని, "కొత్త పాటల సమయం వస్తున్నదని చెప్పాను గద!" అన్నాడు.

"అవును! మీ రంతా నన్ను ఒంటరిగా విడిచిపోతారు. కిందటిసారి ఏం జరిగింది? పొలాల నుంచి చెరుకుగడలు తెమ్మని హాథీకి కబురు చేస్తే, రెండు రోజులయాక వచ్చాడు. ఈ లోపల అతను ఘీంకరిస్తూ చెట్ల మధ్యగా పరుగులు తీయటమూ, వెన్నెట్లో తందనాలు వెయ్యటమూ తప్ప చేసినదేమీ లేదు," అన్నాడు మౌగ్లీ.

అట్ట చివరి బొమ్మ



"కొత్త పాటల తరుణమంటే అంతే!" అన్నాడు బాఘీర.

వసంతా గమనంతో అరణ్యానికి ఒక నూతన శోభ వచ్చింది. అరణ్యవాసులు ఎంతో ఉల్లాసంగా ఉన్నారు. వాళ్ళ కంఠ ధ్వనులే మారిపోయాయి. మామూలుగా ఈ రుతువులో మౌగ్లీ కూడా ఎంతో ఉల్లాసంగా ఉండి, అరణ్యంలోపడి ఎన్నో మైళ్లు పరిగెత్తేవాడు.

కాని ఈసారి అతనిలో ఉత్సాహం లేదు. తిన్న తిండి కడుపులో రాయి పెట్టినట్టున్నది. మనసులో ఏదో చిరాకు. బాఘీరతో తాను చిరాకుపడి ఎందుకు మాట్లాడాడో మౌగ్లీకి అర్థం కాలేదు. అతని శరీరంలో జబ్బు లక్షణాలేవీ లేవు. తాను తప్ప మిగిలిన అరణ్య వాసులందరికీ వెర్రి పట్టుకున్నట్టుగా ఉన్నది!

వసంతంలో యౌవనంలో ఉన్న తోడేళ్లు ఒకరితో ఒకరు యుద్ధాలు చేస్తారు; మందకు తెలియకుండా ఏ కాంత ప్రదేశంలో పోట్లాడు కుంటారు. ఈ సంగతి మౌగ్లీకి తెలుసు. తెలిసి కూడా అతను, పోట్లాడుకోబోతున్న ఇద్దరు తోడేలు యువకుల మధ్యకు వెళ్లి, వాళ్ళను వేరు చెయ్యాలని చూశాడు. ఇద్దరూ ఏకమై మౌగ్లీని పక్కకు నెట్టేసి, మరుక్షణం కలియబడ్డారు.

మౌగ్లీకి చప్పున కోపం వచ్చింది. అతను ఒర నుంచి కత్తి పైకిలాగి, క్రోధంతో పళ్ళు బయటపెట్టాడు. ఇద్దరు తోడేళ్ళనూ చంపెయ్యాలని అతని ఉద్దేశం. కాని అతని కేదో నీరసం వచ్చేసింది. కత్తి తిరిగి ఒర లోకి వెళ్లిపోయింది.

"నే నేదో విషం తిన్నాను. ఇన్నాళ్ళూ నన్ను నెట్టెయ్యగల తోడేలు ఉండటం నే నెరగను. ఈ ఇద్దరు అర్భకులు నన్ను అవలీలగా తోసి పారేశారు! నాలో బలం లేదు. నేను త్వరలోనే చచ్చిపోతాను," అనుకున్నాడు మౌగ్లీ.

ఆ సాయంత్రం అతను వేటాడాడు గాని, తిండి సయించలేదు. ఆ రాత్రి పండు వెన్నెల. అరణ్యమంతటా కొత్త పాటలూ, పోట్లాటలూ సాగుతున్నాయి. ఇలాంటి రాత్రి పరుగు తియ్యటం మౌగ్లీ అలవాటు. అతను గొంతెత్తి గట్టిగా పాడుతూ, అరణ్యం మధ్యగా ఉత్తరాన ఉన్న ఊబుల కేసి పరిగెత్తాడు—ఎగరటంలాటి పరుగు.

అతను త్వరలోనే ఊబులను చేరి, వాటి మధ్యకు వెళ్లి, తుంగల మధ్య కూర్చున్నాడు. అరణ్యంలోనే వదిలేశాననుకున్న విషాదం అతన్ని మళ్ళీ ముంచెత్త సాగింది. తాను నిశ్చయంగా విషం తిని ఉంటానను కున్నాడు. ఆ రెండు తోడేళ్ళూ పోట్లాడు కునేటప్పుడు తనకు భయం వేసింది. ఇదే అకేలా గాని, ఫావో గాని అయితే భయ పడతారా?

అతని కిప్పుడు చావు భయం కూడా పట్టుకున్నది. ఈ ఊబి గుంటల మధ్య తన శవం తేలుతుందా? అరణ్యంలో ఉన్న గుట్ట మీదికి పోయి చావటం మేలనీ, అకేలాను గద్ద పీక్కుతిన్నట్టు తనను కూడా తినకుండా తన శవాన్ని బాఘీర కాపాడతా డనీ అనిపించింది.

అతని కంట ఒక పెద్ద అశ్రుకణం రాలింది. ఆ దుఃఖంలో అతని కేదో సంతుష్టి



కనబడింది. అతనికి అకేలా చస్తూ అన్న మాటలు గుర్తు వచ్చాయి. మనుషుల వద్దకు తిరిగి పొమ్మన్నాడు అకేలా మౌగ్లీని.

"అవసానదశలో అకేలా మతి పోయి ఏమిటో అన్నాడు. నేనే అరణ్యాన్ని!" అని మౌగ్లీ పైకే గట్టిగా అనేశాడు.

తుంగల మధ్య నుంచి ఒక అడవి గేదె, "మనిషి!" అన్నది.

దాని వెంట ఉన్న దున్న తల ఎత్తి చూసి, "ఛీ, మనిషి కాదు! సియోనీ మంద వెంట ఉండే బొచ్చులేని తోడేలు!" అనటం మౌగ్లీ విన్నాడు. ఆ దున్న పేరు మైసా. మౌగ్లీ అతన్ని ఎరుగును.

మైసా అన్న మాటలకు కోపం వచ్చి మౌగ్లీ తుంగ మధ్యగా వెళ్ళి, తన కత్తితో మైసాను పొడిచి, మైసా బాధతో అరుస్తుంటే, గట్టిగా నవ్వుతూ, "సియోనీ మందలో ఉండే బొచ్చులేని తోడేలు నిన్ను ఒకప్పుడు తోలాడను!" అన్నాడు.

"నువా! తోడేలువా! చాల్లే! నువు పెంపుడు జంతువుల్ని తోలేవాడివని అరణ్యాని కంతకూ తెలుసు. నువు నిజమైన వేటగాడివే అయితే పాములా పాకి వచ్చి, ఆడకూతురి దగ్గిర నాకు అవమానం చేస్తావా?" అన్నాడు మైసా.

"నాకీ ప్రాంతం కొత్త. ఇటెక్కడన్నా మనిషిమంద ఉందా, మైసా?" అని అడిగాడు మౌగ్లీ.

"ఉత్తరంగా పో. ఊబి దాటాక గ్రామం ఉంది," అన్నాడు మైసా.

మౌగ్లీ ఊబి దాటి ఒక విశాలమైన మైదానం చేరాడు. అతనికి దూరంగా దీపం కనబడింది—ఎర్రపువ్వు! అతను మనుషుల విషయం ఆలోచించి చాలాకాలమయింది. కాని ఇప్పుడా "ఎర్రపువ్వు" అతన్ని ఆకర్షిస్తున్నది. "మనిషి మంద ఏ మాత్రం మారిందో చూడాలి," అనుకుంటూ అతను ముందుకు సాగాడు.





# అరణ్యపురాణం

## 32

మౌగ్లీ తాను అరణ్యంలో లేడన్నమాట పూర్తిగా మరిచిపోయి, ఎదురుగా కనిపించే దీపంకాంతి కేసి నిశ్చింతగా నడిచాడు. మూడు, నాలుగు కుక్కలు ఒక్కసారిగా మొరగ నారంభించాయి.

మౌగ్లీ చప్పున కూర్చుని, తోడేలు లాగా చిన్నగా గుర్రుపెట్టాడు. దానితో కుక్కలు మొరగటం మానాయి.

“నే నీ మనిషి మంద ప్రాంతాలకు అసలు దేనికి వచ్చినట్టు?” అనుకున్నాడు, అతను మూతి నిమురుకుంటూ. కిందటిసారి మనిషిమంద రాళ్ళు విసిరి నప్పుడు ఒక రాయి ఆ మూతికే తగిలింది.

గుడిసె తలుపు తెరిచి, ఒక స్త్రీ ద్వారం వద్ద నిలబడింది. లోపల బిడ్డ ఏడుస్తున్నాడు. ఆ స్త్రీ వెనుదిరిగి, “పడుకోరా. ఏ నక్కనో చూసి కుక్కలు మొరిగాయిలే!” అన్నది.

గడ్డిలో దాగి ఉన్న మౌగ్లీ చలిజ్వరంతో వణికినట్టు వణికాడు. ఆ గొంతు అతనికి బాగా పరిచితమైనది. ఆ సంగతి నిర్ధారణ చేసుకోవాలి. అప్రయత్నంగా అతని నోట మనిషిమాట వచ్చేసింది. అతను చిన్నగా, “మెస్సువా! మెస్సువా!” అని పిలిచాడు.

“ఎవరా పిలిచేది?” అన్నదా స్త్రీ, వణుకుతున్న గొంతుతో.

“మరిచిపోయావా?” అన్నాడు మౌగ్లీ. అతని గొంతు ఎండుకు పోయినట్టయింది.

ఆమె తలుపు సగం మూసి, ఇంకో చెయ్యి రొమ్ముకు నొక్కిపెట్టి, “నిజంగా నువే అయితే, నీకు నేనేం పేరుపెట్టానో చెప్పు,” అన్నది.

“నత్తూ! ఓరినత్తూ!” అన్నాడు మౌగ్లీ.

“రా, నాయనా, లోపలికి రా,” అన్నది మెస్సువా.

అట్ట చివరి బొమ్మ



మౌగ్లీ గుడిసెలోకి అడుగు పెట్టి మెస్సువాను ఎగా దిగా చూశాడు. ఈమె తన మీద ఎంతో ప్రేమ చూపింది ఒకప్పుడు. తాను ఈమెనే ఒకసారి కాపాడాడు. అయితే ఈమె కిప్పుడు జుట్టు నెరుస్తున్నది; అయినా ఆమె కళ్ళలోనూ, కంఠస్వరంలోనూ మార్పులేదు.

ఆమె కూడా సహజంగా అతనిలో మార్పు ఉంటుందని ఊహించ లేదు. ఆమె అతన్ని నఖ శిఖ పర్యంతమూ పరీక్షించింది. ఇప్పుడతని తల వాకిలి అంత ఎత్తుకున్నది. అతను ఎత్తుకు తగ్గట్టు బలంగానూ, చాలా అందంగానూ ఉన్నాడు. నల్లని అతని జుట్టు భుజాల మీదికి పడుతున్నది. మెడన అతని కత్తి వేళ్ళాడుతున్నది. తలచుట్టూ మల్లెపూలదండ ఉన్నది. చూస్తే ఏ వనదేవుడో అనిపించేటట్టున్నాడు.

మంచంలో పడుకుని ఉన్న బిడ్డ లేచి గట్టిగా ఏడుపు మొదలెట్టాడు. మెస్సువా వాణ్ణి ఊరుకో బెట్టుతున్నంత సేపూ మౌగ్లీ చుట్టూ ఉన్న వంటపాత్రలనూ, నీటికుండలనూ, మనుషులు ఉపయోగించే ఇతర వస్తువులనూ చూశాడు.

"బాబూ, ఏమన్నా తినటానికీ, తాగటానికీ ఇచ్చేదా? ఇదంతా నీదే. మా ప్రాణాలు కాపాడిన వాడివి! నేను నత్తూ అని పేరు పెట్టింది నీకేనా? లేక నువ్వు ఎవరన్నా దేవుడివా?" అన్నది మెస్సువా.

"నత్తూనే. నేనుండే చోటు నుంచి చాలా దూరం వచ్చేశాను. వెలుగు కనబడింది. ఏమీ ఆలోచించకుండా దగ్గిరికి వచ్చాను. నువ్విక్కడ ఉంటున్నావని నాకు తెలీదు," అన్నాడు మౌగ్లీ.

"మేం ఖాన్హివారాకు వచ్చాక అక్కడ ఇంగ్లీషువాళ్ళు మాకు న్యాయం చేస్తామన్నారు. మమ్మల్ని గ్రామస్థులు దహనం చెయ్యాలని చూశారు. జ్ఞాపకం ఉంది కాదూ?" అన్నది మెస్సువా.



"అదంతా నే నెక్కడ మరిచిపోతాను ?" అన్నాడు మౌగ్లీ.

"ఇంగ్లీషువాళ్ళు చట్టాలన్నీ తిరగేసి, ఆ దుర్మార్గుల కోసం వచ్చిచూస్తే మొదలు గ్రామమే లేదు," అన్నది మెస్సువా.

"అదీ నాకు జ్ఞాపకమే," అన్నాడు మౌగ్లీ.

"అందుచేత మా ఆయన ఇక్కడ పొలాలలో పనికి కుదిరి, కష్టపడి పని చేసి కాస్తంత భూమి కూడా సంపాదించుకున్నాడు. ఆ గ్రామపు పొలాలంత మంచి పొలం కాదనుకో. మా కెంత కావాలి? ఇద్దరం ప్రాణులం," అన్నది మెస్సువా.

"ఆయన ఏడీ?" అని మౌగ్లీ అడిగాడు.

"పోయాడు. ఏడాదయింది," అన్నది మెస్సువా.

"వీడు?" అంటూ మౌగ్లీ పిల్లవాణ్ణి చూపాడు.

"నా కొడుకే. రెండేళ్ళ క్రితం పుట్టాడు. నువు వనదేవుడివైతే నీ వాళ్ళ నుంచి వీడికి అపాయం లేకుండా ఆశీర్వదించు," అంటూ మెస్సువా తన చిన్న కొడుకును ఎత్తుకున్నది. ఆ కుర్రవాడు భయంపోయి, మౌగ్లీ మెడలో వేళ్ళాడే కత్తిని పట్టుకోబోయాడు. మౌగ్లీ వాడి బుల్లివేళ్ళను పట్టుకుని, ఎడంగా తోసేశాడు.

"లేదా, పులిపట్టుకు పోయిన నా నత్తూవే అయితే, వీడు నీ చిట్టితమ్ముడు; వీణ్ణి అన్నగా ఆశీర్వదించు," అన్నదామె, పిల్లవాణ్ణి మౌగ్లీకిస్తూ.

"అయ్యయ్యో, ఆశీర్వదించటమూ అదీ నా కేం తెలుస్తుంది? నేను దేవుణ్ణీ కాను, వీడి అన్ననూ కాను....చూడమ్మా, నాగుండె ఎందుకో బరువుగా ఉంది," అన్నాడు మౌగ్లీ.

"ఉండదూ మరీ—రాత్రిపూట చెమ్మ నేలల్లో పరిగెత్తితే? జ్వరం పట్టుకుని ఉంటుంది," అన్నది మెస్సువా.

అరణ్యంలో తనకు రోగం వస్తుందన్న ఆలోచనకు మౌగ్లీ నవ్వుకున్నాడు.

"నాయనా, పొయ్యిరాజేసి కాసిని పాలు కాచి ఇస్తా, తాగుదువు గాని. ఆ మల్లెదండ తీసి అవతలపెట్టు. దాని వాసన మహా ఘాటుగా ఉన్నది," అన్నది మెస్సువా.

మౌగ్లీ కూర్చుని ముఖం చేతులలో దాచుకుని ఏదో గొణిగాడు. అతనిలో ఎన్నడూ ఎరగని వింత వికారాలేవేవో చెల రేగుతున్నాయి. తాను విషపదార్థ మేదో తిన్నానన్న భావం వదలటంలేదు. తల నాదు గానూ, పైత్యం చేసినట్టూ ఉన్నది.

అతను మెస్సువా ఇచ్చిన పాలను రెండు గుక్కల్లో తాగేశాడు. మెస్సువా అతన్ని మళ్ళీ మళ్ళీ భుజంతట్టింది. అతను తన పోయినకొడుకు సత్తూ అయినా కాక పోయినా, రక్తమాంసాలు గల మనిషి మటుకు అవును! ఆమెకు అదే సంతోషం.

"నాయనా, నువు అందంగా ఉంటావని ఎవరన్నా నీతో అన్నారా?" అన్నదామె, తన కళ్ళలో గర్వం ప్రదర్శిస్తూ.

మౌగ్లీ తల వెనక్కు తిప్పి తనను తాను చూసుకోవటానికి ప్రయత్నించాడు. మెస్సువా అతన్ని చూసి విరగబడి నవ్వ సాగింది. ఎందుకో తెలీకుండానే మౌగ్లీకూడా గట్టిగా నవ్వాడు. వాళ్ళిద్దరినీ చూసి పసి పిల్లవాడు కూడా నవ్వ నారంభించాడు.

మెస్సువా వాణ్ణి ఎత్తుకుని తన రొమ్ముకు అదుముకుని, "అన్నను చూసి నవ్వొచ్చు నుట్రా? అందులో సగం అందం వచ్చిన నాడు నీకు రాజుగారి చిన్నకూతురి నిచ్చి పెళ్లిచెయ్యమూ, నిన్ను ఏనుగు అంబారీలో ఊరేగించమూ?" అన్నది.

ఆమె మాటల్లో హెచ్చుభాగం అతనికి అర్థంకాలేదు. చాలా దూరం పరిగెత్తాడేమో, ఆ పైన వేడి వేడి పాలు తాగిన ఫలితంగా అతను పడుకుని వెంటనే గాఢ నిద్రలో పడి పోయాడు. మెస్సువా అతని ముఖం మీది వెంట్రుకలను పైకి తోసి, అతని మీద దుప్పటి కప్పి, ఎంతో తృప్తిపడింది.





# అరణ్యపురాణం

## 33

మౌగ్లీ ఆ నాడు మిగిలిన రాత్రీ, మర్నాడు పగలూ నిద్రపోయి, చీకటి పడే వేళకు లేచాడు. నిద్ర మేలుకుంటూనే అతను కత్తిమీదికి చెయ్యి పోనిచ్చి, చివాలున లేచి నిలబడి, యుద్ధానికి సిద్ధమయాడు. మెస్సువా అతన్ని చూసి నవ్వుతూ భోజనం తెచ్చి పెట్టింది.

అతనిలో చెలరేగే ఆందోళన అలాగే ఉన్నది. అతనికి పరిగెత్తాలని కూడా ఉన్నది. కాని పసిపిల్లవాడు మౌగ్లీ ఒళ్ళో నుంచి దిగలేదు. మౌగ్లీ జుట్టు దువ్వుతానని మెస్సువా కూడా పట్టుపట్టింది. ఆమె పిచ్చి పాటలేవో పాడుతూ, మౌగ్లీ జుట్టు చిక్కు తీస్తూండగా, బయటినుంచి పెద్దన్న మూలగటం వినిపించింది.

మౌగ్లీ జంతువుల భాషలో, "రమ్మన్నప్పుడు వచ్చావు కావు," అన్నాడు.

"నీ మిత్రులందరినీ చేర్చుకు, పుణ్యం ఉంటుంది," అన్నది మెస్సువా మౌగ్లీతో.

"నీ కేమీ భయం లేదు. ఆ నాడు మీరు కాన్హివారాకు వెళ్ళేటప్పుడు మీకు తెలీకుండా నా మిత్రులు ఎందరో మిమ్మల్ని అనుసరించి కాపాడారు. అమ్మా, నేనిక వెళ్ళాలి!" అన్నాడు మౌగ్లీ.

మౌగ్లీ తలుపు మీద చెయ్యి వేసి తెరవబోతూండగా మెస్సువా అతని మెడ చుట్టూ చేతులు వేసి, "మళ్ళీ రా, నాయనా! కొడుకువో, కావో, నువ్వంటే నాకు ప్రాణం. చూడు, వాడు కూడా ఏడుపు మొహం పెట్టాడు," అంటూ పసివాణ్ణి చూపింది. మౌగ్లీకి గొంతులో ఏదో అడ్డం పడ్డట్టనిపించింది; "తప్పక వస్తాను," అన్నాడు.

అతను బయటికి వచ్చి పెద్దన్నతో, "మీరు నలుగురూ నేను పిలిచినప్పు డెందుకు

అట్ట చివరి బొమ్మ



రాలేదు? ఇంతకాలం ఏం చేస్తున్నారు?" అని అడిగాడు.

"ఎంతకాలం? నిన్న రాత్రేగా? కొత్త పాటలు పాడాం," అన్నాడు పెద్దన్న.

"అవునవును," అన్నాడు మౌగ్లీ.

"నువు చేసిన పనేమిటి? మనిషి మందలో కలిసి తిని, నిద్రపోయావా?" అని పెద్దన్న అడిగాడు.

మౌగ్లీ ఏదో అనబోతూండగా తెల్లదుస్తులు వేసుకుని ఒక అమ్మాయి దారి వెంబడి పోతూ కనబడింది. పెద్దన్న వెంటనే దాక్కు న్నాడు. మౌగ్లీ పొలంలో ఎత్తుగా పెరిగిన మొక్కల మధ్యకు వెళ్ళాడు.

ఏదో దయ్యాన్ని చూశాననుకుని ఆ యువతి కెవ్వున అరిచింది. తరవాత ఒక్క నిట్టూర్పుతో తనను తాను సంబా ళించుకుని ముందుకు పోయింది. మౌగ్లీ పైరు మొక్కల మధ్య నుంచి ముఖం బయటికి పెట్టి ఆమె కనబడకుండా పోయిన దాకా చూశాడు. తరవాత పెద్దన్న కేసి తిరిగి, "నేను మనిషి మందకుపోతే నా వెంట మీరు రారా?" అని అడిగాడు.

"అదివరకు వచ్చాం కామా? ఇప్పుడు రాలేదా?" అన్నాడు పెద్దన్న.

"ఎన్ని సార్లయినా వస్తారా?" అని మౌగ్లీ అడిగాడు.

పెద్దన్న కాస్సేపు మౌనంగా ఉండి, "బాఘీర అన్నది నిజం. మనిషి చివరకు మనిషినే చేరుకుంటాడు. అమ్మ కూడా అనేది—" అన్నాడు.

"అకేలా కూడా అదే అన్నాడు," అన్నాడు మౌగ్లీ, గొణుక్కుంటూ.

"మహాజ్ఞాని కావా కూడా అలాగే చెప్పాడు," అన్నాడు పెద్దన్న.

"నువ్వేమంటావు పెద్దన్నా?" అని మౌగ్లీ అడిగాడు.

"వాళ్లు నిన్ను ఒకసారి వెళ్ళగొట్టారు. నీ మూతి మీద రాయి విసిరారు. నిన్ను

చంపటానికి బలదేవుణ్ణి పంపారు. నిన్ను ఎర్రపువ్వులోకి తొయ్యాలని చూశారు. వాళ్ళను నువే నానా తిట్లూ తిట్టావు. వాళ్ల మీదికి అరణ్యాన్ని పంపకం చేశావు," అన్నాడు పెద్దన్న.

"ఇంతకూ నీ ఉద్దేశం చెప్పలేదు," అన్నాడు మౌగ్లీ. ఈ సంభాషణ చేస్తూ ఇద్దరూ పరిగెత్తుతున్నారు.

"మా నలుగురమూ నీ వాళ్ళమే. నీ దారే మా దారి. ఒక తల్లిబిడ్డలం. అరణ్యాని కేం చెప్పకుంటావు?" అన్నాడు పెద్దన్న.

"బాగా జ్ఞాపకం చేశావు. నువు ముందు వెళ్ళి కొండ మీద అందరినీ సమావేశ పరుచు. నా కడుపులో మాట వాళ్ళకు చెప్పకుంటాను," అన్నాడు మౌగ్లీ.

మరొక తరుణంలో అయితే అందరినీ ఒక్క కేకతో సమావేశపరిచే పనే. కాని కొత్త పాటల తరుణం ఇంకా పూర్తి కాలేదు.

"అరణ్యాధిపతి మనుషుల మధ్యకు పోతున్నాడు. కొండ మీదికి రండి!" అని పెద్దన్న కేకలు పెట్టాడు.

"ఎండలు ముదిరాక తిరిగి వస్తాడులే!" అన్నారు కొందరు నిర్లక్ష్యంగా.

మౌగ్లీ కాళ్ళీడ్చుకుంటూ సమావేశ స్థలానికి చేరేసరికి అక్కడ అన్నలు నలుగురే



ఉన్నారు. వాళ్ళు కాక కళ్ళు బొత్తిగా కన బడని భాలూ, కావా కూడా ఉన్నారు.

"నీ శకం ముగిసిందా, మనిషికూనా? కాసిని కన్నీళ్ళు వదిలెయ్యి," అన్నాడు కావా.

మౌగ్లీ బాధతో మూలుగుతూ, "ఆ శున కుల చేతిలోనైనా పోయాను కాను. నా బల మంతా పోయింది. పడుకుంటే నిద్రరాదు. స్నానం చేస్తే తాపం పోదు. నా ఎముకలన్నీ గుజ్జులా గయాయి," అన్నాడు.

"ఎందు కిన్ని మాటలు? ఆ నాడు అకేలా కూడా అన్నాడు — మౌగ్లీని మనిషి మందకు తిరిగి వెళ్ళమని. నేనూ అన్నాను. ఈ ముసలాడి మాట ఎవరు వింటారు?

బాఘీరా కూడా—ఏడీ, బాఘీర ఎక్కడ?" అన్నాడు భాలూ.

"నాకు ఏనాడో తెలుసు, అరణ్యం వద్దన్నా మనిషి మనిషిమందకే పోతాడు చివరకు," అన్నాడు కావా.

అన్నలు నలుగురూ బిత్తరపోయి ఒకరి నొకరు చూసుకుని, మౌగ్లీ కేసి చూశారు.

భాలూ మౌగ్లీతో, "నాకు కళ్ళు కనపడక పోయినా, బుద్ధికి అంతా కనపడుతుంది. కప్పాయ్, నీ దారి నువు చూసుకో. మనిషి మందలో చోటు చేసుకో. కాని అరణ్యం నువు ఎప్పుడు పిలిచినా పలుకుతుంది, నీ చెప్పుచేతల్లో ఉంటుంది," అన్నాడు.

"నాకు పోవాలని లేదు. నన్ను కాళ్ళు ఈడ్చుకుపోతున్నాయి," అన్నాడు మౌగ్లీ.

"పట్టులో తేనె అయిపోయింది. విడిచి పోక తప్పదు," అన్నాడు భాలూ.

"ఒకసారి విడిచిన కుబుసంలోకి మళ్ళీ ప్రవేశించేది లేదు," అన్నాడు కావా.

"కాని బాఘీర మాటేమిటి? నన్ను ఎద్దు నిచ్చి కొన్నాడు—"

మౌగ్లీ మాట పూర్తి కాకముందే పొదలను తోసుకుంటూ బాఘీర వచ్చాడు. అతను రక్తసిక్తమైన పంజా ఎత్తి చూపుతూ, "ఇందుకే నేను రావటం ఆలస్యమయింది. రెండేళ్ళ వయసు గల ఎద్దును చంపాను. నిన్ను అదే విడుదల చేస్తుంది, తమ్ముడూ. అన్ని రుణాలూ తీరిపోయాయి. వేట సాగాలి, తమ్ముడూ! భాలూ అభిప్రాయమే నాదీనీ!" అన్నాడు.

భాలూ మౌగ్లీని గట్టిగా కౌగలించుకున్నాడు. భాలూ భుజం మీద తల పెట్టి మౌగ్లీ ఏడుస్తుంటే, "కుబుసం విడవటమంటే ఎంత కష్టం!" అన్నాడు కావా.

పెద్దన్న తల ఎత్తి చూసి, "నక్షత్రాలు పలచబడుతున్నాయి. ఇక మన దారి మనం వెతుక్కోవాలి!" అన్నాడు మిగిలిన తోడేలు తమ్ముళ్ళతో. —(అయిపోయింది)

